తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

RNI NO.TELTEL / 2013 /50370

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

మంగళవారం 18.08.2026 | సంపుటి :13 సంచిక : 29 | పేజీలు :12 వెల : రూ. 4/-

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

సామాన్యుని స్వరం
జనంసాక్షి tv
JANAMSAKSHI TV

## 'సర్' జాబితా విడుదల


**తెలంగాణలో 78.30% ఎన్యూమరేషన్ పత్రాలు స్వీకరణ**



- 2.73 శాతం మంది చనిపోయినవారిగా గుర్తింపు
- సుమారు 60 లక్షల మంది అనామలీస్ ఓటర్లు
- ఆగస్టు 17 నుంచి అక్టోబర్ 15 వరకు అభ్యంతరాల స్వీకరణ
- అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితాను విడుదల

**హైదరాబాద్,ఆగస్ట్17(జనంసాక్షి):** తెలంగాణలో రాష్ట్ర ఎన్నికల సంఘం సర్ ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేసింది. సర్ ప్రక్రియలో మొదటి భాగం పూర్తయిందని రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 78.30శాతం ఎన్యూమరేషన్ పత్రాలు అందినట్లు తెలిపారు. 2.73 శాతం మంది చనిపోయినవారిగా గుర్తించినట్లు సుదర్శన్‌రెడ్డి వెల్లడించారు. మరో వైపు సుమారు 60 లక్షల మంది అనామ లీస్ ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. అలాగే 32 లక్షల మంది ఓటర్లు మ్యాపింగ్ చేసుకోలేదని గుర్తించారు. ఈ నేపథ్యంలో

మిగతా 2లో..



## పొరపాటు జరిగింది

**సవరిస్తాం : మంత్రి పొంగులేటి**

**22ఏ భూములపై ఆందోళన వద్దు**

### అధికారుల తప్పిదం వల్లనే ఇలా జరిగింది
### అందుకు ప్రజలను క్షమాపణలు కోరుతున్నాం



- నిషేధిత జాబితా నుంచి భూములను తొలగిస్తాం
- టోల్‌ఫ్రీ నంబర్ 18005994788కు సంప్రదించాలి
- ప్రజలను ఆఫీసులకు తిప్పే అధికారులపై చర్యలు తీసుకుంటాం
- మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించిన రెవెన్యూ మంత్రి

**హైదరాబాద్,ఆగస్ట్17(జనంసాక్షి):** ప్రైవేటు వ్యక్తుల ఆస్తికి ఆటంకం కలిగించాలనే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రైవేటు భూమిని 22ఏలో పెట్టారంటూ మేడ్చల్, హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల నుంచి 750 దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. హైదరాబాద్‌లో మీడియాతో పొంగులేటి మాట్లాడుతూ..అధికారుల పొరపాటు వల్ల ఇలా జరిగిందన్నారు. 22ఏ భూములపై నాలుగు జిల్లాల్లోని అధికారులతో కలిసి చర్చించాం. గతంలో ఆ భూములు యూఎల్‌సీ జాబితాలో ఉన్నాయి. నిషేధిత జాబితాను అప్‌డేట్ చేయడంలో పొరపాటు జరిగిందన్నారు. అధికారుల తరఫున క్షమాపణలు కోరుతున్నానని మంత్రి అన్నారు. ప్రైవేట్ ఆస్తుల్ని 22ఏ జాబితా నుంచి

మిగతా 2లో..

# టిమ్స్ జాతికి అంకితం

- కార్పొరేట్‌కు ధీటుగా వైద్యసేవలు
- విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యం
- ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి
- విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉంది
- ఆరోగ్యశ్రీ కోసం ఇప్పటి వరకు రూ.2,600 కోట్లు ఖర్చు చేశాం
- గత పాలకులు టిమ్స్‌లకు కొబ్బరికాయలు కొట్టి వదిలేశారు
- వచ్చే ఏడాదికల్లా ఉస్మానియా సహా అన్ని ఆస్పత్రులు ప్రారంభిస్తాం
- కార్పోరేట్ స్థాయిలో ఆస్పత్రుల నిర్వహణ
- సనత్‌నగర్ టిమ్స్ ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

### పేదల ఆరోగ్యం బాధ్యతగా తీసుకుంటున్నాం



టిమ్స్ ఆస్పత్రిలో వివిధ విభాగాల గురించి సీఎం రేవంత్ రెడ్డికి వివరిస్తున్న వైద్యులు. చిత్రంలో ఆరోగ్యమంత్రి దామోదరరాజనర్సింహ, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు

**హైదరాబాద్,ఆగస్ట్17(జనంసాక్షి):** తెలంగాణ ప్రజాపాలనలో విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడంతో పాటు, రాష్ట్ర ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ విద్యార్థులు ప్రపంచవ్యాప్తంగా ఉన్న అవకాశాలను అందిపుచ్చుకునేలా విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. పేదల ఆరోగ్యాన్ని కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరికీ ఉచిత వైద్యం అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. గత 32 నెలల్లో ఆరోగ్యశ్రీ కోసం రూ. 2,600 కోట్లు ఖర్చు చేసినట్లు సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. ప్రజలకు నాణ్యమైన వైద్యం అందుబాటులో

మిగతా 2లో..

> గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం టిమ్స్ ఆస్పత్రులకు టెంకాయ కొట్టింది కానీ నిర్మాణాన్ని మాత్రం మర్చిపోయింది. టిమ్స్ ఆస్పత్రులు పూర్తయితే పేదల వైద్యానికి 10 వేల పడకలు అందుబాటులోకి వస్తాయి. 2027 డిసెంబర్ 9లోపు ఉస్మానియా, మిగిలిన టిమ్స్ ఆస్పత్రులు పూర్తి చేస్తాం. కార్పొరేట్ ఆస్పత్రులకు తీసిపోని విధంగా ప్రభుత్వ ఆస్పత్రులను నిర్వహిస్తాం. ఆస్పత్రికి వచ్చే రోగులకు ఆహారం, ఇతర వసతులు కల్పిస్తున్నాం. రోగులతో పాటు వచ్చే బంధువులకు ఆహారం, వసతి సౌకర్యం కల్పిస్తాం - ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

### అధికారుల పేరు చెప్పి తప్పించుకుంటే
## కుదరదు



- సీఎం ఇల్లు కూడా నిషేధిత జాబితాలో ఉంది
- అందుకే జాబితా నుంచి తొలగించేందుకే హడావుడి
- హరీశ్‌రావు కౌంటర్

**హైదరాబాద్,ఆగస్ట్17(జనంసాక్షి)** రాష్ట్రంలో 22ఎ సెక్షన్ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డగోలుగా భూములను నిషేధిత జాబితాలో పెట్టి ప్రజలను

మిగతా 2లో..

## నిద్రలోనే అగ్నికి ఆహుతి

### హోటల్‌లో మంటలు చెలరేగి ఏడుగురు మృతి

**దుర్ఘటన తెల్లవారుజామున చోటుచేసుకోవడంతో భారీ ప్రాణనష్టం**



**కోల్‌కతా,ఆగస్ట్17(జనంసాక్షి):** పశ్చిమ బెంగాల్ లోని బీర్‌భూమ్ జిల్లా తారాపీఠ్‌లో ఒక హోటల్‌లో మంటలు చెలరేగడంతో ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. సోమవారం తెల్లవారుజామున గ్రౌండ్‌ఫ్లోర్‌లోని హోటల్ రిసెప్షన్‌లో ఈ మంటలు మొదలయ్యాయి. క్షణాల్లోనే భవనమంతా వ్యాపించాయి. అప్పుడు అతిథులంతా నిద్రలో ఉన్నారు. ఈ ఘటనలో పలువురు గాయపడ్డారు. ఓ నాలుగు అంతస్తుల హోటల్ భవనంలో ప్రమాదవశాత్తూ మంటలు చెలరేగి ఏడుగురు సజీవ దహనం కాగా.. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఈరోజు తెల్లవారుజామున సుమారు 4 గంటల ప్రాంతంలో హోటల్ గ్రౌండ్ ఫ్లోర్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఏసీ యూనిట్లలో సాంకేతిక లోపం కారణంగా మంటలు వ్యాపించాయి. భారీగా మంటలు చెలరేగడంతో గ్రౌండ్ ఫ్లోర్ మొత్తం క్షణాల్లోనే పొగ అలుముకుంది. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. హుటాహుటిన

మిగతా 9లో..

## ఆలయంలో తొక్కిసలాట

**ఏడుగురు భక్తుల దుర్మరణం**

**పదుల సంఖ్యలో క్షతగాత్రులు**

- విద్యుత్ తీగ పడడంతో ఆందోళనకు గురైన భక్తులు
- అక్కడినుంచి బయటకు పరిగెత్తే క్రమంలో తొక్కిసలాట
- బీహార్ లఖిసరాయ్ జిల్లాలోని అశోక్‌ధామ్ ఆలయంలో ఘోరం
- ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ప్రధాని మోడీ





**పాట్నా,ఆగస్ట్17(జనంసాక్షి):** బిహార్‌లో విషాదం చోటుచేసుకుంది. లఖిసరాయ్ జిల్లాలోని అశోక్‌ధామ్ ఆలయంలో సోమవారం తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో ఏడుగురు భక్తులు ప్రాణాలు కోల్పోయారు. పదుల సంఖ్యలో గాయపడ్డారు. శ్రావణమాసం సోమవారం కావడంతో ఈ శివాలయానికి భారీగా భక్తులు తరలివచ్చారు. అయితే వారి మధ్యలో ఒక ఎలక్ట్రిక్ వైర్ తెగిపడిపోవడంతో ఒక్కసారిగా భయపడిపోయారు. షాక్ కొడుతుందనే ఆందోళనతో అక్కడి నుంచి బయటకు పరిగెత్తే క్రమంలో తొక్కిసలాట చోటుచేసుకుంది. ఈ ఘటనలో గాయపడినవారిని సమీప ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాదంపై ముఖ్యమంత్రి సమ్రాట్ చౌధరీ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. క్షతగాత్రులకు సత్వర చికిత్స అందేలా చూడాలని అధికారులను

మిగతా 2లో..

### కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ యథాతథంగా
## కొనసాగిస్తాం

**హైకోర్టులో స్టే ఎత్తివేయించి మళ్లీ అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్నాం**



- కోర్టు వివరణ అడిగినంత మాత్రాన పథకాలు నిలిచిపోవు
- గత ప్రభుత్వం పక్కాగా అమలు చేయలేదు అందుకే సమస్యలు వచ్చాయి
- దీనిపై డివిజన్ బెంచ్‌కు అప్పీల్ చేస్తున్నాం
- ధర్నాలు చేసే వారు పథకంపై తప్పిదాలపై మాట్లాడాలి
- మీడియా సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి

**హైదరాబాద్,ఆగస్ట్17(జనంసాక్షి):** కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కళ్యాణ లక్ష్మి షాది, ముబారక్ గ్రీన్ చానెల్ ద్వారా నిధులు విడుదల చేస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి మీడియా సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ కళ్యాణ లక్ష్మి పథకంపై వివరించారు. కళ్యాణ్ లక్ష్మి పథకం పై ఇప్పటివరకు జారీ చేసిన 8 జీవోలను ఒక పిటిషన్ హైకోర్టులో వేసిందన్నారు. అందులో భాగంగా ఈ పథకాన్ని ఆపాలని హైకోర్టు మధ్యంతర ఆదేశాలకు ఇవ్వడం జరిగింది. దీనిపై డివిజనల్ బెంచ్ కు అప్పీల్‌కై వెళుతున్నాము. సానుకూల నిర్ణయం వస్తుందని ఆశిస్తున్నాం అని మంత్రి తెలిపారు. ఈ పథంలోని లొసుగులు ఏదైనా ఉంటే అది గత ప్రభుత్వం 2014లో చేసిన పొరపాటు వల్ల తలెత్తినది. అప్పుడు సరైన రీతులో ఉత్తర్వులు ఇచ్చి ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదన్నారు. తమ ప్రభుత్వం త్వరలో గత

మిగతా 2లో..

### తప్పులు చేసింది ఎన్‌టీఏ..
## శిక్ష విద్యార్థులకా?

- యూజీసీ-నెట్ సోషియాలజీ, ఇంగ్లిష్, కామర్స్ పరీక్షల రద్దు దారుణం
- మండిపడ్డ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ



**న్యూఢిల్లీ,ఆగస్ట్17(జనంసాక్షి):** నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ తీరుపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మరోమారు ఆగ్రహం వ్యక్తం చేశారు. యూజీసీ-నెట్ పరీక్షల్లో సోషియాలజీ, ఇంగ్లిష్, కామర్స్ పరీక్షలను రద్దు చేసి సెప్టెంబర్‌లో మళ్లీ నిర్వహించాలని ఎన్‌టీఏ నిర్ణయించడంపై రాహుల్ గాంధీ ఫైర్ అయ్యారు. ఎన్‌టీఏ తప్పులకు వేలాది మంది విద్యార్థులు మూల్యం చెల్లించాల్సి వస్తోందని విమర్శించారు. ఎక్స్ వేదికగా స్పందించిన రాహుల్ గాంధీ.. 'మోదీజీ.. మీ ఎన్‌టీఏ ఏం చేసిందో చూడండి.

మిగతా 2లో..

## పరీక్షల్లో అవకతవకలు

ఎన్‌టీఏలో 50మందిపై వేటు

9లో..

### విద్యార్థులను కలిసి వారి సమస్యలు వినండి

జార్ఖండ్ సీఎం సోరెన్‌కు రాహుల్ లేఖ

2లో..

### సుప్రీంలో రాహుల్‌కు ఊరట

ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో విచారణ నిలిపివేత



## భాజపా కొత్త టీం


- నూతన జాతీయ కార్యవర్గం ప్రకటన
- 13 మంది జాతీయ ఉపాధ్యక్షులతో పాటు వివిధ కీలకపదవుల భర్తీ
- జాతీయ ఉపాధ్యక్షురాలిగా పురందేశ్వరి..

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** భాజపా నూతన జాతీయ కార్యవర్గాన్ని ప్రకటించింది. 13 మంది జాతీయ ఉపాధ్యక్షులతో పాటు వివిధ కీలక పదవులకు

మిగతా 2లో..


## ఆ పరీక్షలన్నీ రద్దు

**ఉద్యోగ నియామక పరీక్షల్లో అక్రమాల ఆరోపణల నేపథ్యంలో ఝార్ఖండ్ ప్రభుత్వం సంచలన నిర్ణయం**



**రాంచీ(జనంసాక్షి):** ఉద్యోగ నియామక పరీక్షల్లో అక్రమాలు జరిగాయంటూ విద్యార్థులు చేపట్టిన ఆందోళనలతో ఝార్ఖండ్ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. లఖ్‌నవూకు చెందిన ఔట్ సోర్సింగ్ సంస్థ టీడీపీఎల్ 2014 నుంచి నిర్వహించిన అన్ని పరీక్షలను రద్దు చేస్తున్నట్లు సీఎం హేమంత్ సోరెన్ ప్రకటించారు. పరీక్షల్లో అక్రమాలపై విద్యార్థుల ఆందోళనల

మిగతా 2లో..



## ఇరాన్‌పై అణుదాడికి ట్రంప్ ప్రణాళికలు

**అమెరికా కాంగ్రెస్ మాజీ సభ్యురాలు టేలర్ గ్రీన్ సంచలన వ్యాఖ్యలు**

**టెహ్రాన్(జనంసాక్షి):** అమెరికా కాంగ్రెస్ మాజీ సభ్యురాలు, రిపబ్లికన్ పార్టీ నాయకురాలు మర్జోరీ టేలర్ గ్రీన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అణ్వాయుధాలను నియంత్రించడమే తమ లక్ష్యమని అగ్రరాజ్య అధ్యక్షుడు ట్రంప్ బయటకు చెప్తున్నప్పటికీ.. ఇరాన్‌పై అణు దాడులు ప్రారంభించడానికి రహస్యంగా సన్నద్ధమవుతున్నారని పేర్కొన్నారు. త్వరలో ఈ అణుదాడులు చేయడానికి ట్రంప్ యంత్రాంగం ప్రణాళికలు రచిస్తోందన్నారు. ఇందుకోసం ప్రభుత్వ ఉన్నతస్థాయి అధికారులు వ్యూహాత్మక సమావేశాలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఈ అణు దాడుల వల్ల ప్రపంచం మొత్తం పెద్ద సంఘ ర్షణలోకి.. ఆర్థిక మాంద్యంలోకి వెళ్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రజలు ముందుకు వచ్చి.. ఆయన చర్యలను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. 1945లో జపాన్‌లోని హిరోషిమా, నాగసాకి నగరాలపై అణ్వాయుధాలను ప్రయోగించిన విషయాన్ని టేలర్ గ్రీన్ గుర్తు చేసుకున్నారు. ఇన్నేళ్లు గడిచినా జపాన్ ప్రజలు ఇప్పటికీ రేడియేషన్ వ్యాధులు, క్యాన్సర్, పుట్టుకతో సంక్రమించే లోపాలతో తీవ్ర ఇబ్బందులు పడుతు న్నారని అన్నారు. అదే పరిస్థితి ఇరాన్‌కు

మిగతా 9లో..



సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

### రూల్స్ పాటించని విమానాలు నిలిపివేయండి

2లో..

### అప్పుడు అర్బన్ నక్సల్స్.. ఇప్పుడేమో దీమాగీ మావోయిస్టులు

ప్రధాని వ్యాఖ్యలపై పలు రాజకీయ పార్టీల విమర్శలు

# టిమ్స్ జాతికి అంకితం



ఉండేలా ప్రభుత్వ ఆస్పత్రుల సామర్థ్యాన్ని మరింత పెంచుతున్నామని తెలిపారు.తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (టిమ్స్) ఆస్పత్రులు పేదలకు ఎంతో ఉపయోగపడతాయని సీఎం అన్నారు. గత పాలకులు టిమ్స్ నిర్మాణానికి కొబ్బరికాయ కొట్టి పనులను మర్చిపోయారని విమర్శించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హైదరాబాద్‌లో మూడు టిమ్స్ ఆస్పత్రుల నిర్మాణాన్ని వేగంగా చేపట్టామని తెలిపారు. అదే విధంగా వరంగల్‌లోనూ ఆస్పత్రి నిర్మాణ పనులను వేగవంతం చేస్తున్నామని పేర్కొన్నారు. 2027 డిసెంబర్ నాటికి రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న ఆస్పత్రులను ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రతి ఆరు నెలలకు ఒక ఆస్పత్రిని ప్రారంభించే దిశగా ప్రణాళిక రూపొందించామని సీఎం వెల్లడించారు. ఇందుకు అవసరమైన నిధులను ప్రభుత్వం కేటాయిస్తోందని తెలిపారు. ఆస్పత్రుల నిర్మాణ పనులు వేగంగా, నాణ్యతతో పూర్తయ్యేలా ప్రత్యేక అధికారులను నియమించి పర్యవేక్షణ చేపడుతున్నామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు.ప్రజా ప్రభుత్వం వ్యవసాయం, మహిళా సంక్షేమంతో పాటు విద్య, వైద్యాన్ని అత్యంత ప్రాధాన్యతగా తీసుకుందని, మన బిడ్డలను ప్రపంచంలోనే గొప్ప స్థానాల్లో చూడాలని నాణ్యమైన విద్యను అందించేందుకు చర్యలు తీసుకున్నాం అని సిఎం అన్నారు. నర్సింగ్ విద్యార్థులకు జర్మనీ, జపాన్ దేశాల్లోనూ అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఈరోజుల్లో ప్రైవేటు వైద్యం అత్యంత ఖరీదుగా మారింది. అందుకే పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందుబాటులోకి తీసుకొచ్చేందుకు టిమ్స్ ను ప్రారంభించుకున్నాం.సీఎంఆర్ఎఫ్ కోసం రూ. 2526 కోట్లు ఖర్చు చేశాం. ఇప్పటి వరకు రూ. 5226 కోట్లు పేదల ఆరోగ్యం కోసం ఖర్చు చేశాం. రెండేళ్లలో రూ.21,800 కోట్లు వైద్య ఆరోగ్య శాఖ కోసం ఖర్చు చేశాం. ఉస్మానియా ఆసుపత్రి శిథిలావస్థకు చేరితే,. పదేళ్లు అధికారంలో ఉన్నవాళ్లు కొత్త ఉస్మానియా ఆసుపత్రిని నిర్మించాలని ప్రయత్నించలేదు. టిమ్స్ ఆసుపత్రులు, వరంగల్ ఆసుపత్రికి కేవలం టెంకాయకొట్టి వదిలేశారు.మేం అధికారంలోకి వచ్చాక సనత్ నగర్, ఎల్బీ నగర్, అల్వాల్ టిమ్స్, వరంగల్ ఆసుపత్రులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకున్నాం అని సిఎం వివరించారు. ఇవన్నీ పూర్తయితే 10 వేల పడకల ఆసుపత్రులు అందుబాటులోకి వస్తాయి.2027, డిసెంబర్ 9 వరకు ఉస్మానియా, ఎల్బీ నగర్, అల్వాల్, వరంగల్ ఆసుపత్రులను పూర్తి చేస్తాం. ఒక్కో ఆసుపత్రికి ఒక్కో డైరెక్టర్ ను నియమించి పర్యవేక్షిస్తాం కార్పొరేట్ తరహాలో ఆసుపత్రుల నిర్వహణ ఉండేలా చర్యలు తీసుకుంటాం. ఆసుపత్రికి వచ్చే రోగుల అటెండెంట్ లు ఉండేదుకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు నిధులు మంజూరు చేస్తాం.ప్రభుత్వ ఆసుపత్రుల్లో అదనంగా సమయాన్ని కేటాయించే సూపర్ స్పెషాలిటీ వైద్యులకు ప్రోత్సహకాలను అందిచేలా చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నానని అన్నారు. మేం టిమ్స్ ను ప్రారంభిస్తామని చెప్పగానే కొందరు పగటి వేషగాళ్లల్లా వచ్చి తిరిగి పోతున్నారు.కేటీఆర్ వచ్చి ఇది తామే కట్టామని చెప్పి వెళ్లారు. వెనక ఉన్న మెంటల్ హాస్పిటల్ కు వెళ్లి పేషంట్లకు టిమ్స్ లు కట్టింది నేనే నన్ను గుర్తుపట్టలేదా అని కేటీఆర్ అడిగాడట.అక్కడ ఉన్న రోగి ఊకో బిడ్డా నేను కూడా మొదట్లో అలాగే మాట్లాడేవాడిని.. రాను రాను వాడే తగ్గిపోతది అని చెప్పాడట.. మీరు కడితే పదేళ్లలో ప్రారంభించడానికి సమయం దొరకలేదా? మీ కుటుంబమే అధికారంలో వున్నపుడు ఎందుకు రిబ్బన్ కట్ చేయలేదు. మీరు ఎర్రవెల్లి, జన్వాడ, మొయినాబాద్, శంకర్ పల్లి ఫామ్ హౌసులు నిర్మించుకునేందుకు ఒక్క క్షణం కూడా ఆలస్యం కానివ్వలేదు. కానీ పేదలకు వైద్యం అందించే ఆసుపత్రులు పూర్తి చేయాలని ఆలోచన రాలేదా..ఇకనైనా ఆత్మ పరిశీలన చేసుకోండి..నియోజకవర్గానికో పది, 20 కోట్లు ఖర్చు చేసి సేవ చేస్తే మీ పాపాలు కొంతైనా తగ్గుతాయని అన్నారు. కెసీఆర్, కేటీఆర్ 2034 వరకు మారకూడదని, ఇలాగే ఉండాలని కోరుకుంటున్నా.వాళ్లు అబద్దాలు చెప్పడం మాననంత కాలం నేను ఇలాగే నిజాలు చెబుతూనే ఉంటానని అన్నారు. మంత్రులు దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు.

## కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ యతథతంగా కొనసాగిస్తాం

ప్రభుత్వం చేసిన అన్ని తప్పిదాలను సరిచేసి ఈ పథకం కొనసాగేలా చేస్తామన్నారు. గత ప్రభుత్వం పథకం లోప భూయిష్టమైన జీవోలు ఇవ్వడం వల్లే ఈ పథకం ఇలా అయిందన్నారు. కౌంటర్ ఫైల్ చేయడానికి అధికారుల లోపమా లేదా ప్రభుత్వంలో న్యాయపరమైన అంశాలు చూసే వారి లోపమా అని విచారణ చేస్తున్నాం.. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. తెలంగాణ ప్రజలకు కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ పథకాల అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పొన్నం స్పష్టం చేశారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లు పేద కుటుంబాలకు అండగా నిలిచిన సంక్షేమ పథకాలని అన్నారు. పేదింటి ఆడబిడ్డ వివాహ సమయంలో కుటుంబంపై పడే ఆర్థిక భారాన్ని తగ్గించడమే ఈ పథకాల ప్రధాన ఉద్దేశం అని తెలిపారు. ఈ పథకాలను గత ప్రభుత్వం ప్రారంభించింది. రాజకీయాలకు అతీతంగా పేదల ప్రయోజనం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తోంది. పేదలకు నష్టం కలగకుండా న్యాయపరంగా అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలను ప్రభుత్వం వినియోగిస్తుంది. రాజకీయ పిటిషన్లు పై ఈ పథకం ఎందుకు కొనసాగిస్తున్నారు అని స్టే ఇచ్చింది.. పథకాన్ని ఎత్తివేయలేదు..ఇది గత ప్రభుత్వ పథకం దీనిని ఎత్తివేయాలని మేము ఆలోచన చేయలేదు. గతంలో నిధులు కేటాయింపులకు సంబంధించిన ఇబ్బంది ఉన్న మేము వచ్చిన తర్వాత గ్రీన్ చానెల్ ద్వారా నిధులు విడుదల చేసాం. వాళ్లు చేసిన అప్పులు.. దానిని తొలగించడానికి నిధుల సకాలంలో విడుదల చేయడానికి వ్యవస్థ ఏర్పాటు చేయలేదు.. పేద ల పిల్లల వివాహాలకు సామాజికంగా ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న వారికి ప్రభుత్వం బాసటగా ఉండాలని ప్రభుత్వం భావిస్తుంది. 12 తారీకు స్టే విధించింది.. వచ్చే నెల 9 వరకు అవకాశం ఉన్నప్పటికీ అప్పటి వరకు వెయిట్ చేయకుండా కోర్టులో స్టే తొలగించడానికి ముందుకు పోయాం.. రోడ్ల మీద నిరసనలు చేస్తున్న నాయకులకు చెప్తున్న మీరు చేసిన జీవోల వల్లే పథకానికి ఈ పరిస్థితి వచ్చింది. అయినా మేము కొనసాగిస్తున్నాం అన్నారు. బహుజన నాయకుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376 జయంతి సందర్భంగా ట్యాంక్ బండ్ పై సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభిస్తారని అన్నారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి, పీసీసీ,మంత్రులు ,ఎమ్మెల్యేలు ,ఎమ్మెల్సీలు , ఎంపీలు, ప్రజా ప్రతినిధులు ,బలహీన వర్గాల నాయకులు ,కుల సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. మొన్ననే ట్యాంక్ బండ్ పక్కన సామాజిక ఉద్యమ నాయకుడు మహాత్మా జ్యోతిబాపూలే సావిత్రి బాయ్ పూలే విగ్రహావిష్కరణ చేసుకున్నామని మంత్రి వివరించారు.

### తప్పులు చేసింది ఎన్‌టీఏ.. శిక్ష విద్యార్థులకా?

జూన్ 22 నుంచి 30 వరకు సోషియాలజీ, ఇంగ్లిష్, కామర్స్ యూజీసీ–నెట్ పరీక్షలు జరిగాయి. దాదాపు రెండు నెలల తర్వాత ప్రశ్నపత్రాల్లో లోపాలు, గత ప్రశ్నల పునరావృతం కారణంగా ఈ మూడు పరీక్షలను ఎన్‌టీఏ రద్దు చేసింది. ఎన్‌టీఏ నిర్ణయం వల్ల ఏళ్ల తరబడి పరీక్షకు సిద్ధమైన వేలాది మంది అభ్యర్థులు మళ్లీ దరఖాస్తు చేసుకోవడం, ఫీజులు చెల్లించడం, దూర ప్రాంతాల్లోని పరీక్ష కేంద్రాలకు ప్రయాణించాల్సి వస్తోంది. తప్పు చేసింది ఎన్‌టీఏ.. కానీ, శిక్ష అనుభవించేది మాత్రం విద్యార్థులా?' అని రాహుల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పరీక్షా వ్యవస్థ విద్యార్థులను దోపిడీ చేసే వ్యవస్థగా మారిందని రాహుల్ ఆరోపించారు. దేశంలో సరైన పరీక్షా వ్యవస్థ లేదంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తాను కోటా, డెహ్రాడూన్, ప్రయాగ్‌రాజ్‌లలో ఇదే విషయాన్ని ప్రస్తావించానన్నారు. 'ఇది విద్యా వ్యవస్థ కాదు.. డబ్బు, కాలం, మానసిక ఆరోగ్యం, ఆత్మవిశ్వాసాన్ని తీసుకుని చివరికి ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వని వ్యవస్థగా మారింది' అని రాహుల్ విమర్శలు గుప్పించారు. యూజీసీ–నెట్ ప్రశ్నపత్రాలు పరీక్షకు ముందే లీకయ్యాయా? అని రాహుల్ గాంధీ సందేహం వ్యక్తం చేశారు. ఈ ప్రశ్నకు ఎన్‌టీఏ ఎందుకు సమాధానం చెప్పడం లేదని ప్రశ్నించారాయన. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా మొదటి అడుగు మాత్రమేనన్న రాహుల్ గాంధీ.. ఎన్‌టీఏ అధికారులపైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 'సెప్టెంబర్‌లో మళ్లీ పరీక్ష రాయనున్న ప్రతి విద్యార్థికి చెబుతున్నా.. మీరు సమస్య కాదు. పరీక్షను నిర్వహించలేని వ్యవస్థను ప్రధాని మోదీ ప్రభుత్వం నిర్మించింది. ఆ వ్యవస్థ చేసిన తప్పులకు ఇప్పుడు విద్యార్థులనే బాధ్యులుగా చేస్తోంది. మీ విలువైన సంవత్సరాలు వృథా అవుతున్నాయి. దీనిపై మోదీ సమాధానం చెప్పే వరకు మేము ప్రశ్నిస్తూనే ఉంటాం' అని అన్నారు.

## విద్యార్థులను కలసి వారి సమస్యలు వినండి

న్యూఢిల్లీ,ఆగస్ట్17(జనంసాక్షి):జార్ఖండ్‌లో ప్రభుత్వ ఉద్యోగ నియామక పరీక్షల్లో అవకతవకలు జరిగాయంటూ విద్యార్థులు చేపట్టిన ఆందోళనపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పందించారు. ఆందోళన చేస్తున్న విద్యార్థులను స్వయంగా కలిసి వారి సమస్యలను వినాలని జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌ను కోరారు. ఈ మేరకు ఆగస్టు 14న సోరెన్‌కు రాహుల్ గాంధీ లేఖ రాశారు. జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ , జార్ఖండ్ స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ నిర్వహించిన నియామక పరీక్షల్లో అవకతవకలు, ప్రశ్నపత్రాల లీక్, నియామక పక్రియలో పారదర్శకత లోపించిందంటూ విద్యార్థులు ఆందోళన చేస్తున్నారు. రాంచీలో కొనసాగుతున్న ఈ నిరసనలు సోమవారం నాటికి 24వ రోజుకు చేరుకున్నాయి. విద్యార్థుల ఆందోళన ఇప్పటివరకు శాంతియుతంగానే సాగుతోందని, వారి డిమాండ్లు న్యాయమైనవని రాహుల్ గాంధీ తన లేఖలో పేర్కొన్నారు గత కొన్ని నెలలుగా దేశవ్యాప్తంగా ప్రశ్నపత్రాల లీకులు, విద్యా వ్యవస్థలో అవకతవకలకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులకు కాంగ్రెస్ మద్దతు ప్రకటించింది జార్ఖండ్‌లోని పరిస్థితి మరింత తీవ్రతరం కాకుండా చూడటానికి ముఖ్యమంత్రి స్వయంగా విద్యార్థులను కలిసి వారి ఆందోళనలను వినాలి. సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించేందుకు ప్రభుత్వం ముందుకు రావాలి' అని రాహుల్ తన లేఖలో పేర్కొన్నారు.

## సుప్రీంలో రాహుల్‌కు ఊరట

న్యూఢిల్లీ,ఆగస్ట్17(జనంసాక్షి): కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీకి సుప్రీంకోర్టులో ఊరట లభించింది. ఆదాయానికి మించిన ఆస్తుల ఆరోపణల కేసులో సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ వ్యవహారంపై అలహాబాద్ హైకోర్టులో కొనసాగుతున్న విచారణను తదుపరి ఆదేశాలు వచ్చే వరకు నిలిపివేయాలని ఆదేశించింది. అలాగే ఈ కేసులో సీబీఐ, ఈడీ ఎలాంటి నివేదికను ప్రస్తుతం అలహాబాద్ హైకోర్టుకు సమర్పించకూడదని స్పష్టం చేసింది. రరాహుల్ గాంధీ దాఖలు చేసిన పిటిషన్‌ను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జాయ్‌మాల్య బాగ్చి, వి. మోహనాలతో కూడిన ధర్మాసనం విచారించింది. అలహాబాద్ హైకోర్టు ఇప్పటికే ఈ కేసులో తదుపరి విచారణను ఆగస్టు 20న చేపట్టనుంది. అయితే హైకోర్టు విచారణను తదుపరి ఆదేశాల వరకు వాయిదా వేయాలని తాజాగా సుప్రీంకోర్టు ఆదేశించింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తమ దర్యాప్తు లేదా పరిశీలనకు సంబంధించిన ఎలాంటి నివేదికను హైకోర్టుకు సమర్పించకుండదని పేర్కొంది. రాహుల్ గాంధీ ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారని కర్ణాటకకు చెందిన బీజేపీ కార్యకర్త విఘ్నేశ్ శిశిర్ చేసిన ఫిర్యాదు ఆధారంగా ఈ వ్యవహారం అలహాబాద్ హైకోర్టుకు వెళ్లింది. రాహుల్ గాంధీ ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణలను పరిశీలించాలని సీబీఐ, ఈడీకి హైకోర్టు గతంలో సూచించింది. ఈ ఆదేశాలను రాహుల్ గాంధీ సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. అంతేకాకుండా ఈ కేసు విచారణను అలహాబాద్ హైకోర్టు నుంచి ఢిల్లీ హైకోర్టుకు బదిలీ చేయాలని ప్రత్యేక పిటిషన్ కూడా దాఖలు చేశారు.

## సర్ జాబితా విడుదల

సుమారు 92 లక్షల మందికి నోటీ సులు జారీ చేయనున్నట్లు సుదర్శన్‌రెడ్డి తెలిపారు. నోటీసు లు అందుకున్న ఓటర్లు సంబంధిత పత్రాలను సమర్పించి తమ వివరాలను నిర్ధారించు కోవాలని సూచించారు. నోటీ సులు అందుకున్న వారు వీలైనంత త్వరగా స్పందించాలని కోరారు. ఏ కారణంతో నోటీసు జారీ చేశామో స్పష్టంగా తెలియజేస్తామని సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఓటు తొలగింపుపై అభ్యంతరాలు ఉన్నవారు తమ అభ్యంతరాలను సమర్పించవచ్చని పేర్కొన్నారు. ఆగస్టు 17 నుంచి అక్టోబర్ 15 వరకు అభ్యంతరాలు, సంబంధిత దరఖాస్తులను పరిశీలించనున్నట్లు సుదర్శన్‌రెడ్డి వెల్లడించారు. పరిశీలన పక్రియ పూర్తయిన అనంతరం అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితాను విడుదల చేయనున్నట్లు తెలిపారు. సర్ పక్రియను పూర్తి చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా 2 వేల మందికి పైగా అధికారులు పాల్గొంటారని సుదర్శన్‌రెడ్డి వెల్లడించారు. ఎవరి ఓట్లు అయినా లేకపోతే ఫారం 6ఏ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ముసాయిదా జాబితాను ఎన్నికల అధికారులు అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు.

## ఆ పరీక్షలన్నీ రద్దు..

**ఉద్యోగ నియామక పరీక్షల్లో అక్రమాల ఆరోపణల నేపథ్యంలో ఝార్ఖండ్ ప్రభుత్వం సంచలన నిర్ణయం**

దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అలాగే, ఝార్ఖండ్ స్టాఫ్ సెలక్షన్ కమిషన్–కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవెల్ పరీక్షను సైతం రద్దు చేయాలని క్యాబినెట్ నిర్ణయించిందన్నారు. 2014 నుంచి జరిగిన నియామక పరీక్షలకు సంబంధించిన చిన్న, పెద్ద తప్పులన్నింటిపైనా సీఐడీతో విచారణ జరిపిస్తామన్నారు. పరీక్షల్లో సంస్కరణల కోసం కమిటీని ఏర్పాటు చేస్తామన్న ఆయన.. దీనికి సీనియర్ ఐఏఎస్ అధికారి అమితాబ్ కౌశల్ సారథ్యం వహిస్తారని వెల్లడించారు. రాష్ట్రంలో పరీక్షల కుంభకోణంలో పలు కంపెనీల ప్రమేయం ఉన్నట్లు తెలుస్తోందన్నారు. గనులు, ఖనిజాల సవరణ బిల్లుపై చర్చించేందుకు అసెంబ్లీ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసే అవకాశం ఉందన్నారు. పేపర్ లీక్ ఆరోపణలు, నియామక ప్రక్రియలో అవకతవకలు, పాలనాపరమైన లోపాలతో తమ కెరీర్‌కు తీవ్రనష్టం వాటిల్లుతోందంటూ ఆ రాష్ట్రంలోని విద్యార్థులు గత 24 రోజుల నుంచి నిరసనలు చేస్తున్న సంగతి తెలిసిందే. విద్యార్థుల ఆందోళనలు తీవ్రరూపం దాల్చడం, ఆరుగురు విద్యార్థులు నిరాహార దీక్ష కొనసాగిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించింది.

## ఆలయంలో తొక్కిసలాట

ఆదేశించారు. మృతుల కుటుంబాలు రూ.4 లక్షల పరిహారం ప్రకటిం చారు.భక్తులు భారీ సంఖ్యలో ఆలయానికి వచ్చారు. దానికి తగ్గట్టే మేం ఏర్పాట్లు చేశాం. భయాందోళన కారణంగా వారు పరిగెత్తడంతో బారికేడ్లు పడిపోయాయి. దాంతో ఒకరిపై ఒకరు పడిపోయారు. ఈ ఘటనకు ఎలక్ట్రిక్ వైర్ కారణంగా తెలుస్తోంది. ధ్రువీకరించుకున్న తర్వాతే పూర్తి వివరాలు వెల్లడిస్తామని లఖిసరాయ్ డిస్ట్రిక్ట్ మేజిస్ట్రేట్ శైలేంద్ర కుమార్ వెల్లడించారు.

**తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ప్రధాని మోడీ**

బిహార్ లఖిసరాయ్‌లోని అశోక్ ధామ్ ఆలయం వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ దిగ్భ్రాంతికి గురయ్యారు. తొక్కిసలాటలో ఏడుగురు మృతి చెందడంపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ప్రమాదంలో గాయపడిన బాధితులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ప్రధాని పోస్టు చేశారు. బిహార్‌లోని లఖిసరాయ్‌లో జరిగిన తొక్కిసలాటలో భక్తులు ప్రాణాలు కోల్పోవడం తీవ్రంగా కలచివేసింది. ఈ దుఃఖ సమయంలో మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి. గాయ పడిన వారు త్వరగా కోలుకోవాలని ఆశిస్తున్నాను. బాధితులకు స్థానిక యంత్రాంగం సహాయం అందిస్తోంది' అని ప్రధాని మోదీ అన్నారు. మరోవైపు, బాధితులకు బిహార్ ప్రభుత్వం ఆర్థిక సాయం ప్రకటించింది. మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.4 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. ప్రమాదం గురించిన వివరాలను లఖిసరాయ్ జిల్లా మేజిస్ట్రేట్ శైలేంద్ర కుమార్ వెల్లడించారు.దర్శనం కోసం మహిళలు, పురుషులు రెండు క్యూ లైన్లలో నిలబడి ఉండగా.. పురుషుల క్యూ లైన్‌కు సమీపంలో విద్యుత్ స్తంభం అకస్మాత్తుగా కూలిపోయిందన్నారు. స్తంభానికి ఉన్నది కేబుల్ వైర్ అయినప్పటికీ.. విద్యుత్ వైర్ అనే పుకారు క్షణాల్లో వ్యాపించిందని పేర్కొన్నారు. దీంతో తొక్కిసలాట జరిగిందని తెలిపారు. రెండు నిమిషాల వ్యవధిలో ఏడుగురు మృతి చెందగా.. దాదాపు 12 మందికి పైగా గాయపడినట్లు జిల్లా మేజిస్ట్రేట్ పేర్కొన్నారు. బాధితులను వెంటనే చికిత్స నిమిత్తం సదర్ ఆస్పత్రికి తరలించినట్లు వెల్లడించారు.

## అప్పుడు అర్బన్ నక్సల్స్.... ఇప్పుడేమో దీమాగీ మావోయిస్టులు

న్యూఢిల్లీ(జనంసాక్షి): ప్రధాని నరేంద్రమోడీ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో ఎర్రకోట పై నుంచి దిమాగీ నక్సల్స్ అనే వ్యాఖ్యలు చేయడం ప్రతిపక్షాల్లో ఆగ్రహానికి కారణమవుతోంది. ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగంలో ఉపయోగించిన దిమాగీ నక్సల్ పదంపై రాజకీయ వివాదం కొనసాగుతోంది. ప్రధాని మోడీ ఈ వ్యాఖ్యపై కాంగ్రెస్, సీపీఐ, సమాజ్‌వాదీ తదితర ప్రతిపక్షాలు మండిపడ్డాయి. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ మాట్లాడుతూ.. మోదీ గతంలో తన రాజకీయ ప్రత్యర్థులను అర్బన్ నక్సల్స్ అని పిలిచారని, ఇప్పుడు దిమాగీ నక్సల్స్ అంటున్నారని విమర్శించారు. ఇది ప్రధాని నిరాశకు సంకేతమని అన్నారు. కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు దిమాగీ నక్సల్స్ అంటే ఎవరో చెబుతూ సోషల్ మీడియా పోస్ట్ పెట్టారు. దీనికి కాంగ్రెస్ సీనియర్ నేత పి. చిదంబరం వ్యంగ్యంగా స్పందిస్తూ.. తాను 'దిమాగీ నక్సల్స్‌గా ఉండటానికి గర్విస్తున్నారని అన్నారు. రిజిజు ప్రకారం, దిమాగీ నక్సల్స్ అంటే.. మావోయిస్టులకు మద్దతు ఇస్తూ భారత రాజ్యాంగాన్ని తిరస్కరించే వారు, వేర్పాటువాదులకు మద్దతు ఇచ్చేవారు, ఆర్టికల్ 370కు మద్దతు ఇచ్చేవారు, దేశ ఈశాన్య ప్రాంతాన్ని భారతదేశం నుంచి వేరు చేయడానికి చికెన్ నెక్‌ను తెంచాలని కోరుకునేవారు అని అన్నారు. ఇప్పుడు దిమాగీ నక్సల్స్ అనే పదంపై సీపీఎం, కాక్రోచ్ జనతా పార్టీ సహా పలువురు కాంగ్రెస్ నేతలు ప్రశ్నిస్తున్నారు. ఎర్రకోటపై నుంచి జాతిని ఉద్దేశిస్తూ ప్రసంగించిన ప్రధాని నరేంద్రమోడీ.. అడవుల్లో ఆయుధాలు పట్టుకుని పోరాడిన నక్సలైట్లను దాదాపుగా అంతం చేశామని చెప్పారు. అయితే మావోయిస్టు భావజాలంతో ఉన్న దిమాగీ నక్సల్స్‌ఇంకా అవకాశాల కోసం చూస్తున్నారని, హింస, అశాంతికి దారి తీసే ప్రయత్నాలు చేస్తున్నారని వ్యాఖ్యానించారు. దేశాన్ని తప్పుదారి పట్టించే ప్రయత్నాలను అడ్డుకోవాలంటే అలాంటి వారిని గుర్తించి ఏకాకులు చేయాలని మోడీ అన్నారు. ఈ పదాన్ని ఉపయోగించడంపై సీపీఎం ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ స్పందించారు. ఈ పదాన్ని ప్రభుత్వాన్ని విమర్శించే వారిని, జంతర్ మంతర్ వద్ద నిరసనలు చేపట్టే వారిని ఉద్దేశించి చేశారని ఆయన అన్నారు. గతంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లను విమర్శించే వారిని 'అర్బన్ నక్సల్స్'గా ముద్ర వేశారని, ఇప్పుడు ఇదే తరహాలో 'దిమాగీ నక్సల్స్' అనే కొత్త పదాన్ని తీసుకువచ్చారని బేబీ అన్నారు. మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా నక్సలిజాన్ని అంతం చేశామని చెబుతున్న విధానంపై బేబీ ప్రశ్నలు లేవనెత్తారు. యువకులు, యువతను పట్టుకుని న్యాయపక్రియ ముందు నిలబెట్టే బదులుగా ఎన్‌కౌంటర్లు చేస్తున్నారని ఆరోపించారు. ఇది ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న ఉగ్రవాదమని అభివర్ణించారు. వామపక్షాలు నక్సలిజాన్ని ఎప్పుడూ సమర్థించలేదని బేబీ స్పష్టం చేశారు. ఇదిలా ఉంటే, దిమాగీ నక్సల్స్ ఇప్పుడు రాజకీయ రచ్చకు దారి తీసింది.

# పొరపాటు జరిగింది

త్వరలోనే తొలగిస్తాం. దీనికి సంబంధించి ఫిర్యాదులు ఉంటే టోల్‌ఫ్రీ నంబర్ 18005994788కు సంప్రదిం చాలన్నారు. భూములకు సంబంధించి అన్నీ సక్రమంగా ఉన్నవారు ఆందోళన చెందవద్దని పొంగులేటి అన్నారు. 22ఎ వల్ల ఇబ్బంది పడుతున్న ప్రజలకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్షమాపణలు చెప్పారు. దీన్ని బూచిగా చూపి ప్రజలను ఆఫీస్‌ల చుట్టూ తిప్పితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ వ్యవహారంలో సత్వర కేసుల పరిష్కారం కోసం ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు చేస్తామని తెలిపారు. జెన్యూన్ కేసుల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 18005–994788కి ఫిర్యాదు చేయాలని విజ్ఞప్తి చేశారు. మేడ్చల్ జిల్లాలో అత్యధికంగా 511 అప్లికేషన్లు, రంగారెడ్డి జిల్లాలో 146 అప్లికేషన్లు వచ్చాయి. హైదరాబాద్‌లో 49, సంగారెడ్డిలో 38 అప్లికేషన్లు వచ్చాయి. ప్రైవేటు భూమిని 22–ఎ కింద పెట్టారని 757 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇవన్నీ 22–ఎ జాబితాలోకి ఎందుకు వచ్చాయనే అంశంపై చర్చించాం. ప్రైవేటు ఆస్తుల యజమానులను ఇబ్బందిపెట్టాలనే ఉద్దేశం మాకు లేదు. గ్రౌండ్ రియాలిటీ ఎలా ఉందనే అంశంపై సమీక్షించాం. న్యాయంగా ఉన్నవాటిని త్వరలోనే నిషేధిత జాబితా నుంచి తొలగిస్తాం'.. ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదు. కోర్టులకు వెళ్లాల్సిన పనిలేదు. అధికారులకు అప్లికేషన్స్ ఇస్తే చాలని మంత్రి వివరించారు. న్యాయబద్ధమైన మీ ఆస్తులకు తొందరగా క్లియరెన్స్ అభిస్తుంది. ప్రజలు ఆందోళన చెందవద్దు. కొన్ని ప్రాంతాల్లో అధికారుల తప్పిదాలను గుర్తించాం. కోర్టు ఆదేశాలను ఆన్‌లైన్‌లో సబ్‌మిట్ చేయకపోవడం వల్లే సమస్య ఏర్పడింది. అధికారుల తప్పిదాలను సవరణ చేస్తున్నాం.

## అధికారుల పేరు చెప్పి తప్పించుకుంటే కుదరదు

తీవ్ర గందరగోళానికి, అయోమయానికి గురిచేస్తోందని.. బిఆర్ఎస్ నేత, ఎమ్మెల్యే హరీష్ రావు ఆరోపించారు. ఎవరి భూమి 22ఎలో ఉందో, ఎవరిది లేదో తెలియక రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది ప్రజలు బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నారని మాజీ హరీశ్ రావు తెలిపారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్ రావు మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా 1999లోనే అర్బన్ ల్యాండ్ సీలింగ్ చట్టాన్ని రద్దు చేశారు. మన రాష్ట్రంలో 2008లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆ చట్టాన్ని పూర్తిగా ఎత్తేశారు. కానీ ఆనాడు సీలింగ్ పరిధి నుంచి బయటపడి, క్లియర్ అయిన భూములను కూడా ఈ ప్రభుత్వం ఇప్పుడు మళ్లీ తీసుకొచ్చి సీలింగ్ యాక్ట్ కింద 22ఎలో పెట్టడం ఏ రకమైన న్యాయం..ఈ ప్రభుత్వానికి కనీస అవగాహన, పాలనపై పట్టు లేదనడానికి ఇదే నిదర్శనమన్నారు. ఏకంగా ఎయిర్‌పోర్ట్, ఔటర్ రింగ్ రోడ్డు లాంటి ప్రభుత్వ భూములను కూడా 22ఎ నిషేధిత జాబితాలో పెట్టారంటే ఈ అధికారుల పనితీరు ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. హైదరాబాద్ నగరంలో లక్షలాది ప్రాపర్టీలను రాత్రికి రాత్రి ప్రొహిబిషన్ లిస్ట్‌లో చేర్చారు. శ్రీనగర్ కాలనీ సర్వే నంబర్ 8, 9లలో గత 20 ఏళ్ళుగా ఇళ్లు కట్టుకుని ప్రశాంతంగా నివసిస్తున్న ప్రజల ప్రాపర్టీలను కూడా ఇప్పుడు 22ఎలో పెట్టడం దుర్మార్గం. 30 ఏళ్ల క్రితం కొనుక్కున్న అపార్ట్‌మెంట్ ఎ÷–లాట్లను కూడా నిషేధిత జాబితాలో పెడితే ఆ ప్రజలు ఇప్పుడు ఎక్కడికి పోవాలని హరీశ్ రావు ప్రశ్నించారు. తమ ప్రాపర్టీ 22ంలో ఉందన్న విషయం చాలామంది సామాన్యులకు తెలియడం లేదు. తీరా రిజిస్ట్రేషన్ కోసం చలాన్లు కట్టి, డబ్బులు చెల్లించిన తర్వాత.. చివర్లో మీ భూమి 22ఎ లో ఉందని చెప్పి రిజిస్ట్రేషన్ ఆపేస్తున్నారు. పైగా రిజిస్ట్రేషన్ కోసం కట్టిన చలాన్ డబ్బులు కూడా వాపస్ ఇవ్వకుండా ప్రభుత్వం ప్రజల సొమ్మును నిలువునా దోచుకుంటోందని మండిపడ్డారు.

## భాజపా కొత్త టీం

ఎంపిక చేసిన వారి జాబితాలను విడుదల చేసింది. భాజపా జాతీయ ఉపాధ్యక్షుల జాబితాలో కేంద్ర మాజీ మంత్రి, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి (ఆంధ్రప్రదేశ్), మాజీ సీఎం వసుంధర రాజే సింధియా(రాజస్థాన్)తో పాటు తీరథ్ సింగ్ రావత్ (ఉత్తరాఖండ్), రామ్ మాధవ్ (ఢిల్లీ), బైజయంత్ జయ్ పాండా (ఒడిశా), రేఖా వర్మ, వర్షాబెన్ నరేంద్రభాయ్ దోషీ (గుజరాత్), డాక్టర్ భారతీ ప్రవీణ్ పవార్ (మహారాష్ట్ర), సర్దార్ మన్‌ప్రీత్ సింగ్‌బాదల్ (పంజాబ్), లాల్ సింగ్ ఆర్య (మధ్యప్రదేశ్), ప్రొఫెసర్ ఎం.నాగరాజ (కర్ణాటక), ప్రొఫెసర్ తారిఖ్ మన్సూర్ (ఉత్తర్‌ప్రదేశ్), డాక్టర్ మధుచంద్ర కర్ (పశ్చిమబెంగాల్) చోటు దక్కించుకున్నారు. వీరంతా భాజపా జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ సారథ్యంలో పనిచేయనున్నారు. అలాగే, కేంద్ర మాజీమంత్రి స్మృతి ఇరానీ జాతీయ ప్రధాన కార్యదర్శుల్లో ఒకరిగా నియమితులై పార్టీలోని కీలకమైన సంస్థాగత బాధ్యతల్లోకి తిరిగి వచ్చారు.

భాజపా కొత్త టీమ్ ఇదే..

పార్టీ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత): బీఎల్ సంతోష్ (ఢిల్లీ).జాతీయ సంయుక్త ప్రధాన కార్యదర్శులు: శివ్‌ప్రకాశ్ (ముంబయి), సౌదన్ సింగ్ (చండీగఢ్).జాతీయ ప్రధాన కార్యదర్శులు: వినోద్ తావ్డే (మహారాష్ట్ర), సునీల్ బన్సాల్ (ఢిల్లీ), బిప్లబ్ కుమార్ దేబ్ (త్రిపుర), స్మృతి ఇరానీ (ఉత్తర్‌ప్రదేశ్), డా.సతీష్ పూనియా (రాజస్థాన్), గజేంద్ర పటేల్ (మధ్యప్రదేశ్), హరీష్ ద్వివేది (ఉత్తర్‌ప్రదేశ్), సంజయ్ భాటియా (హరియాణా)

జాతీయ కార్యదర్శులు: కవిత పటిదార్ (మధ్యప్రదేశ్), సురేంద్రన్ (కేరళం), డా.భోలా సింగ్ (ఉత్తర్‌ప్రదేశ్), డా ప్రదీప్ వర్మ (ఝార్ఖండ్), జగదీశ్ ఈశ్వర్‌భాయ్ పటేల్ (గుజరాత్), డా సందీప్ పాఠక్ (ఢిల్లీ), ఫాంగ్నాన్ కొన్యాక్ (నాగాలాండ్), సంగీత యాదవ్ (ఉత్తర్‌ప్రదేశ్), అనిల్ ఆంటోనీ (కేరళం), డా ఎం.వెంకటేశన్ (తమిళనాడు), మనోజ్ తిగ్గ (పశ్చిమబెంగాల్), సిద్ధార్థ్ శంభు (బిహార్), డా.స్వదేశ్ సింగ్ (ఢిల్లీ), మృగంకా దేవ్ బర్మన్ (అస్సాం), రోహన్ గుప్తా (గుజరాత్), జయప్రకాశ్ (ఢిల్లీ).జాతీయ కోశాధికారి: పీయూష్ గోయల్ (మహారాష్ట్ర).జాతీయ సంయుక్త కోశాధికారి: రాజేశ్ మంగల్ (రాజస్థాన్).సెంట్రల్ ఆఫీస్ ఇన్‌ఛార్జి: తరుణ్ చుగ్ (పంజాబ్).సెంట్రల్ ఆఫీస్ కార్యదర్శి : మహేంద్ర పాండే (ఉత్తరాఖండ్).నార్త్ ఈస్ట్ కోఆర్డినేటర్– డా సంబిత్ పాత్రా (ఒడిశా).నార్త్ ఈస్ట్ జాయింట్ కోఆర్డినేటర్ – రాజీవ్ బబ్బర్ (ఢిల్లీ).ఆల్ సెల్స్ కోఆర్డినేటర్: విష్ణుదత్ శర్మ (మధ్యప్రదేశ్).ఆల్ సెల్స్ జాయింట్ కోఆర్డినేటర్స్: రితురాజ్ సిన్హా (బిహార్), విష్ణువర్ధన్ రెడ్డి (ఆంధ్రప్రదేశ్).

## రూల్స్ పాటించని విమానాలు నిలిపివేయండి

న్యూఢిల్లీ(జనంసాక్షి):విమాన ఛార్జీల పెరుగుదల అంశంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. రద్దీగా ఉండే సమయాల్లో విమాన ఛార్జీలు అడ్డూ అదుపూ లేకుండా పెరగడాన్ని తప్పుపట్టింది. ఛార్జీల విషయంలో ప్రభుత్వ ఆదేశాలను పాటించని విమానయాన సంస్థల సేవలను నిలిపివేయాలంటూ ఘాటు వ్యాఖ్యలు చేసింది. విమాన ఛార్జీల అసాధారణ పెరుగుదలను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది. విమాన టికెట్ ధరల్లో భారీ హెచ్చుతగ్గులు, విమానయాన సంస్థలు విధిస్తున్న అదనపు ఛార్జీలపై సామాజిక కార్యకర్త ఎస్.లక్ష్మీనారాయణన్ పిటిషన్ దాఖలు చేశారు. రద్దీ వేళ ఈ ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయని తన పిటిషన్‌లో పేర్కొన్నారు. దీనిపై తాజాగా సుప్రీంకోర్టులో మరోసారి విచారణ జరిగింది. విమానయాన సంస్థలు ప్రస్తుత నిబంధనలను కూడా సక్రమంగా పాటించడం లేదని పిటిషనర్ కోర్టు దృష్టికి తీసుకొచ్చారు.

## దక్షిణ కొరియాతో సంయుక్త సైనిక విన్యాసాలను గణనీయంగా తగ్గించండి

- అమెరికా రక్షణ శాఖను ఆదేశించిన ట్రంప్
- కిమ్ జోంగ్ ఉన్‌తో ఉన్న బంధం కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడి

వాషింగ్టన్(జనంసాక్షి):ఇరాన్ విషయంలో అమెరికాకు మద్దతుగా నిలవడానికి మిత్రదేశం దక్షిణ కొరియా విముఖత వ్యక్తం చేసింది. దీంతో తీవ్ర అసంతృప్తికి గురైన అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దక్షిణకొరియాకు షాకిచ్చారు. ఆ దేశంతో నిర్వహించే సంయుక్త సైనిక విన్యాసాలను గణనీయంగా తగ్గించాలని తమ రక్షణ శాఖను ఆదేశించారు. ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్‌తో ఉన్న బంధం కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ట్రంప్ చెప్పడం గమనార్హం. ఈ మేరకు ఆయన తన ట్రూత్ ఖాతాలో పేర్కొన్నారు."కిమ్‌తో నాకున్న మంచి స్నేహ బంధం దృష్ట్యా దక్షిణ కొరియాతో అమెరికా చేపట్టాల్సిన సంయుక్త సైనిక చర్యలను తగ్గించాలని అనుకుంటున్నా. ఈ విన్యాసాలు ఖర్చుతో కూడుకున్నవి. అందుకు వెచ్చించాల్సిన మొత్తంలో ఎక్కువ వ్యయాన్ని అమెరికానే భరిస్తోంది. ఇప్పటికే ఈ నిర్ణయం తీసుకోవడం ఆలస్యమైంది. ఇక, ఇరాన్ అణు కార్యక్రమాన్ని అడ్డుకునే చర్యల్లో అమెరికాతో కలిసి రావాలని దక్షిణ కొరియా అధ్యక్షుడిని కోరగా.. ఆయన రాలేమని చెప్పారు" అని ట్రంప్ రాసుకొచ్చారు. కాగా.. ఈ పోస్ట్‌కు కొద్ది గంటల ముందు కిమ్‌తో 2019లో దిగిన ఓ ఫొటోను ట్రంప్ పంచుకున్నారు. ఇక, జపాన్, ఫ్రాన్స్, బ్రిటన్ వంటి మిత్రదేశాలు కూడా ఇరాన్ విషయంలో అమెరికాకు పూర్తిస్థాయిలో మద్దతు ఇవ్వడంపై వెనుకంజ వేస్తున్నాయని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు.కాగా.. 'ఉల్చి ఫ్రీడం షీల్డ్' పేరుతో అమెరికా–దక్షిణ కొరియా ఇటీవల సంయుక్త సైనిక విన్యాసాలు ప్రకటించాయి. సోమవారం నుంచి 11 రోజులపాటు ఇవి జరగనున్నాయి. ఇందులో సుమారు 18 వేల మంది దక్షిణ కొరియా సైనికులు పాల్గొంటారు. అయితే ఈ విన్యాసాలు షెడ్యూల్ ప్రకారమే కొనసాగుతాయని సియోల్ స్పష్టం చేసింది. ఇదిలా ఉండగా.. 2018లో కిమ్‌తో అణు చర్చలు జరిపిన సమయంలోనూ ట్రంప్.. అమెరికా–దక్షిణ కొరియా సైనిక విన్యాసాలను నిలిపివేశారు. తాజాగా కిమ్‌తో మళ్లీ స్నేహపూర్వక సంబంధాలపై మాట్లాడటం, సైనిక విన్యాసాలను తగ్గించాలని ఆదేశించడంతో ఉత్తర కొరియాతో చర్చలకు ట్రంప్ ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది.

# బీసీలకు 33 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలి

- బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర



**న్యూఢిల్లీ, ఆగస్టు 17 (జనంసాక్షి):** బీసీలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించడంతో పాటు, కేంద్రంలో ప్రత్యేక ఓబీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సెన్సెస్-2027లో చేపట్టనున్న కులగణనలో మున్నూరు కాపులతో పాటు బీసీలందరూ తప్పనిసరిగా తమ కులాన్ని నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. అదే విధంగా పేదింటి ఆడబిడ్డలకు అండగా నిలిచే కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను కొనసాగించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారు. 1931లో బ్రిటీష్ పాలనలో కులగణన జరిగిందని, తిరిగి సెన్సెస్-2027లో ఈ ప్రక్రియ చేపడుతున్నారని రవిచంద్ర తెలిపారు. బీసీల వాస్తవ జనాభాతో పాటు వారి సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక పరిస్థితులపై సమగ్ర సమాచారం ఉంటేనే రిజర్వేషన్లు, సంక్షేమ, అభివృద్ధి పథకాలను సమర్థవంతంగా అమలు చేయడం సాధ్యమవుతుందన్నారు. కులగణనలో ఎలాంటి సంకోచం లేకుండా ప్రతి ఒక్కరూ పాల్గొని తమ కులాన్ని నమోదు చేసుకోవాలని మున్నూరుకాపులతో పాటు బీసీలకు సూచించారు. చట్టసభల్లో మహిళలతో పాటు ఓబీసీలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ 2014 జూన్ 14న అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి సిఫార్సు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. చట్టసభల్లో 33 శాతం, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ల కోసం బీఆర్ఎస్ పోరాడిందని తెలిపారు. ఎస్సీ, ఎస్టీల మాదిరిగానే ఓబీసీలను ప్రత్యేక కేటగిరీగా పరిగణించి శాస్త్రీయంగా, పారదర్శకంగా నమోదు చేయడానికి కేంద్రం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ కొనసాగించాలి**

పేదింటి ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు 2014 అక్టోబర్ 2న ప్రారంభించిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను కొనసాగించాలని ఎంపీ రవిచంద్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో ఈ పథకాల ద్వారా 13 లక్షల మందికి పైగా ఆడబిడ్డలకు వివాహ సహాయం అందిందన్నారు. ఎన్నికల సమయంలో తులం బంగారం జోడిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, అధికారంలోకి వచ్చిన తర్వాత హైకోర్టు తీర్పును సాకుగా చూపుతూ పథకాలను రద్దు చేసేందుకు ప్రయత్నించడం బాధాకరమన్నారు.

**బీసీల హక్కుల కోసం బీఆర్ఎస్ పోరాటం**

బీసీలకు సముచిత రాజకీయ ప్రాతినిధ్యం, రిజర్వేషన్లు, సంక్షేమం కోసం బీఆర్ఎస్ పార్లమెంట్ లోపల, బయట పోరాటం కొనసాగిస్తుందని రవిచంద్ర స్పష్టం చేశారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి ప్రజా సంక్షేమ పథకాలను రద్దు చేయకుండా కొనసాగించాలని, బీసీలకు న్యాయం జరిగేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# కొత్తగూడలో కొమురం భీమ్ భవనానికి శంకుస్థాపన



- ప్రజా సమస్యల పరిష్కారం దిశగా 'ప్రజావాణి'
- అర్జీలు స్వీకరించిన మంత్రి ధనసరి సీతక్క

**కొత్తగూడ ఆగస్టు 17 (జనంసాక్షి) :** మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండల కేంద్రంలో రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) సోమవారం విస్తృతంగా పర్యటించారు. ప్రజా సమస్యల తక్షణ పరిష్కారమే ధ్యేయంగా నిర్వహించిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆమె పాల్గొన్నారు. 1.5 కోట్లతో పోరాట యోధుడు అమరుడు కొమురం భీమ్ స్మారక భవన నిర్మాణ పనులకు మంత్రి సీతక్క శంకుస్థాపన చేశారు. అదేవిధంగా మోకాళ్ళ పల్లి లో సైతం 50 లక్షలతో నిర్మాణం. మొత్తం రూ. 2 కోట్లు అంచనా వ్యయంతో నిర్మించనున్న ఈ భవనానికి అధికారులు, ప్రజాప్రతినిధులతో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... కొమురం భీమ్ కన్న కలలను, ఆయన ఆశయాలను నిజం చేయడానికి ప్రజా ప్రభుత్వం సంపూర్ణంగా కట్టుబడి ఉందని, గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు.

**రైతు వేదికలో ప్రజావాణి.. అర్జీల స్వీకరణ**

మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన "ప్రజావాణి" కార్యక్రమంలో మంత్రి సీతక్క పాల్గొన్నారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు, రైతుల నుంచి వినతి పత్రాలను స్వయంగా స్వీకరించారు. సమస్యల తీవ్రతను బట్టి అధికారులతో మాట్లాడి, బాధితులకు త్వరితగతిన న్యాయం చేయాలని, అర్జీలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ?ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# ఉర్దూ అకాడమీ భూమి లీజు రద్దు

- జీఓ ఎంఎస్ నెం.20 రద్దు చేస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం
- మైనారిటీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండి యాకూబ్ పాషా



**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణ ఉర్దూ అకాడమీకి చెందిన కోట్ల రూపాయల విలువైన భూమిని ప్రైవేట్ సంస్థకు 30 ఏళ్లపాటు లీజుకు ఇచ్చేందుకు జారీ చేసిన జీఓ ఎంఎస్ నెం.20 అమలును ప్రభుత్వం రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడం పట్ల రాష్ట్ర మైనారిటి సంఘం అధ్యక్షుడు ఎండి యాకూబ్ పాషా సోమవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. రంగారెడ్డి జిల్లా, శేరిలింగంపల్లి మండలం, దర్గా హుస్సేన్ షా వలీ గ్రామంలోని సర్వే నంబర్ 29లో ఉన్న 1 ఎకరం 04 గుంటల (5,220 చదరపు గజాలు) ఉర్దూ అకాడమీ భూమిని హైదరాబాద్‌కు చెందిన ఎన్.ఎన్. ఇన్‌ఫ్రా అండ్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థకు 30 ఏళ్ల లీజుకు ఇచ్చేందుకు ప్రభుత్వం గతంలో జూలై 16న జీఓ ఎంఎస్ నెం.20 ద్వారా అనుమతించిందని, కోట్ల రూపాయల విలువైన అకాడమీ భూమిని అతి తక్కువ రేటుకు లీజు రుసుముతో ప్రైవేట్ సంస్థకు దీర్ఘకాలికంగా అప్పగిం చడంపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమ య్యాయి. ప్రజా ప్రకటన, పోటీ టెండర్లు లేదా బిడ్ల ప్రక్రియ లేకుండా లీజు కేటాయించడంపై కూడా పలు వర్గాలు ప్రశ్నలు లేవనెత్తాయన్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర మైనారిటీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ మహమ్మద్ యాకూబ్ పాషా ముఖ్యమంత్రి, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఉర్దూ అకాడమి చైర్మన్లకు కి లేఖలు పంపి ఉర్దూ అకాడమీ ఆస్తులను పరిరక్షించాలని విజ్ఞప్తి చేయటంతో పాటు పలువురు కోర్టును ఆశ్రయించటంతో వారి అభ్యంతరాల నేపథ్యంలో ప్రభుత్వం తాజాగా జీఓ ఎంఎస్ నెం.20 అమలును రద్దు చేస్తున్నట్లు తాజాగా జీఓఎంఎస్ నెంబర్ 23తో ఉత్తర్వులను జారీ చేసిందని అన్నారు. ఉర్దూ అకాడమీ భూములు, వక్ఫ్ భూములు, జామియా నిజామియా భూములను భాష, సాహిత్యం, విద్యా, సాంస్కృతిక అభివృద్ధితో పాటు పేద ముస్లింల సంక్షేమం కొరకు వినియోగించేలా చర్యలు తీసుకోవాలని మైనారిటీ సంఘం ప్రభుత్వాన్ని కోరింది.

# రాష్ట్ర వ్యాప్తంగా విజయవంతంగా మండలస్థాయి ప్రజావాణి

- 565 మండల ప్రజా పరిషత్ కార్యాలయాల్లో నిర్వహణ
- మొత్తం 5,410 వినతుల స్వీకరణ ..10,753 మంది అధికారుల హాజరు
- జిన్నారం మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలోనూ ప్రజావాణి
- ప్రజావాణి రాష్ట్ర ఇంచార్జ్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి వెల్లడి



**హైదరాబాద్, ఆగస్ట్17 (జనంసాక్షి) :** రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమం విజయవంతమైంది. ప్రజల సమస్యలను వారి మండల స్థాయిలోనే నేరుగా స్వీకరించి, వాటికి పరిష్కారం చూపించాలనే ఉద్దేశంతో రాష్ట్రంలోని అన్ని మండలాల్లో ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు. రాష్ట్రంలోని మొత్తం 565 మండల ప్రజా పరిషత్ కార్యాలయాల్లో మండల స్థాయి ప్రజావాణి నిర్వహించగా, సంగారెడ్డి జిల్లాలోని జిన్నారం మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో కూడా ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 566 మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాలు నిర్వహించినట్లయిందని ప్రజావాణి రాష్ట్ర ఇంచార్జ్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి కే. విద్యాసాగర్ తెలిపారు. మండల స్థాయి ప్రజావాణికి రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల నుంచి మొత్తం 5,410 వినతులు (పిటిషన్లు) అందాయి. ప్రజలు తమ సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి నేరుగా తీసుకువచ్చి, వాటి పరిష్కారం కోసం వినతులను సమర్పించారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి వినతిని అధికారులు స్వీకరించి, సమస్య స్వభావాన్ని పరిశీలించి, సంబంధిత శాఖల ద్వారా పరిష్కరిం చేందుకు చర్యలు తీసుకునే విధంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల ప్రజావాణి కోసం అధికారులు శాఖ వారిగా డెస్క్ లు, హెల్ప్ డెస్క్ ను, మంచినీటి సౌకర్యాలు కల్పించారు. మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాలకు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 10,753 మంది అధికారులు హాజరయ్యారు. ప్రజలు సమర్పించిన వినతులను నేరుగా స్వీకరించడంతో పాటు, ఆయా సమస్యలకు సంబంధించిన వివరాలను తెలుసుకుని పరిష్కారానికి అవసరమైన చర్యలపై అధికారులు దృష్టి సారించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒక జిల్లాకు సగటున 164 వినతులు అందాయి. జిల్లాల వారీగా అత్యధికంగా వినతులు అందిన జిల్లాగా కరీంనగర్ జిల్లా నిలిచింది. కరీంనగర్ జిల్లాలో మొత్తం 704 వినతులు స్వీకరించబడ్డాయి. అలాగే, ఒక మండలానికి సగటున అత్యధిక వినతులు అందిన జిల్లాగా కూడా కరీంనగర్ జిల్లా ముందంజలో ఉంది. కరీంనగర్ జిల్లాలో ఒక్కో మండలానికి సగటున 47 వినతులు అందాయి. మండల స్థాయిలోనే ప్రజల నుంచి నేరుగా వినతులను స్వీకరించడం ద్వారా సమస్యల పరిష్కార పక్రియను ప్రజలకు మరింత చేరువ చేయడం సాధ్యమవుతుందని అధికారులు తెలిపారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం జిల్లా లేదా రాష్ట్ర స్థాయి కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా, స్థానిక స్థాయిలోనే సంబంధిత అధికారులకు తమ సమస్యలను వివరించే అవకాశం మండల స్థాయి ప్రజావాణి ద్వారా లభించింది. ప్రజల నుంచి వచ్చిన వినతులను సంబంధిత శాఖలకు పంపించి, వాటిని పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోనున్నారు. మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా ప్రజల నుంచి, అధికారుల నుంచి విశేష స్పందన లభించింది. పెద్ద సంఖ్యలో ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి వినతులు సమర్పించగా, అధికారులు కూడా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేశారు. కొత్తగా రాష్ట్రవ్యాప్తంగా 566 మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించబడి, 5,410 వినతులు స్వీకరించబడ్డాయి. ప్రజలు, అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమం విజయవంతంగా కొనసాగింది.

# కరీంనగర్ పాల డైరీ భూములను రైతుల ప్రయోజనాలకు వినియోగించాలి

- భూ భారతి రికార్డుల్లో తెలంగాణ ఫెడరేషన్ పేరుపై మార్పుపై డైరీ పాలకవర్గం అభ్యంతరం
- పాల ఉత్పత్తిదారులకు పెండింగ్‌లో ఉన్న రూ.4 కోట్ల ప్రోత్సాహకం విడుదల చేయాలి
- 50 శాతం సబ్సిడీపై ప్రతి పాల ఉత్పత్తిదారుడికి రెండు పశువులు ఇవ్వాలి: చైర్మన్ చల్మెడ రాజేశ్వరరావు



**కరీంనగర్ టౌన్, ఆగస్టు 17 (జనంసాక్షి) :** కరీంనగర్ పాల డైరీకి సంబంధించిన భూములను డైరీ అభివృద్ధికి, పాల ఉత్పత్తిదారుల సంక్షేమానికి వినియోగించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కరీంనగర్ డైరీ చైర్మన్ చల్మెడ రాజేశ్వరరావు కోరారు. డైరీకి సంబంధించిన భూముల విషయంలో ధరణి రికార్డుల్లో ఉన్న పేరును భూ భారతి రికార్డుల్లో తెలంగాణ ఫెడరేషన్ పేరుపై మార్చడంపై డైరీ పాలకవర్గం అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ మేరకు కరీంనగర్ డైరీ చైర్మన్ చల్మెడ రాజేశ్వరరావు ఆధ్వర్యంలో పాలకవర్గ సభ్యులు, పాల ఉత్పత్తిదారులు కలిసి కరీంనగర్ జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. డైరీకి సంబంధించిన భూములపై సమగ్రంగా పరిశీలన జరిపి, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం వాస్తవాలను గుర్తించి న్యాయం చేయాలని వారు కలెక్టర్‌ను కోరారు. ఈ సందర్భంగా చైర్మన్ చల్మెడ రాజేశ్వరరావు మాట్లాడుతూ.. కరీంనగర్ పాల డైరీకి సంబంధించిన భూములు పాల ఉత్పత్తిదారుల ప్రయోజనాలకు ఉపయోగపడేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. డైరీ అభివృద్ధితో పాటు పాల ఉత్పత్తిదారుల సంక్షేమ కార్యక్రమాలను మరింత విస్తరించేందుకు ఈ భూములు ఉపయోగపడే అవకాశం ఉందని తెలిపారు. ధరణి రికార్డుల్లో కరీంనగర్ డైరీ పేరుతో నమోదై ఉన్న భూములను ప్రస్తుతం భూ భారతి రికార్డుల్లో తెలంగాణ ఫెడరేషన్ పేరుపై మార్చడం వల్ల భవిష్యత్తులో పాల ఉత్పత్తిదారులకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. భూముల రికార్డుల మార్పు విషయంలో పూర్తి స్థాయిలో వాస్తవాలను పరిశీలించి, డైరీకి సంబంధించిన హక్కులు, ప్రయోజనాలను పరిరక్షించాలని కోరారు. కరీంనగర్ పాల డైరీ అభివృద్ధి చెందితే ప్రత్యక్షంగా వేలాది మంది పాల ఉత్పత్తిదారులకు ప్రయోజనం కలుగుతుందని చల్మెడ రాజేశ్వరరావు పేర్కొన్నారు. పాల ఉత్పత్తిదారులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ.4 కోట్ల పెండింగ్ ప్రోత్సాహకాన్ని వెంటనే విడుదల చేయాలని చైర్మన్ కోరారు. పాల ఉత్పత్తిదారులకు ప్రోత్సాహకాలు సకాలంలో అందితే పాడి పరిశ్రమను మరింత అభివృద్ధి చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. పెరుగుతున్న పశువుల దాణా, నిర్వహణ ఖర్చుల నేపథ్యంలో ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలు రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. పాల ఉత్పత్తిని పెంచడంతో పాటు రైతుల ఆదాయాన్ని మెరుగుపరిచేందుకు ప్రతి పాల ఉత్పత్తిదారుడికి 50 శాతం సబ్సిడీపై రెండు పశువులను ప్రభుత్వం అందించాలని కోరారు. ఈ పథకం అమలైతే గ్రామీణ ప్రాంతాల్లో పాడి పరిశ్రమకు ఊతం లభించడంతో పాటు రైతులకు అదనపు ఆదాయ వనరులు ఏర్పడతాయని అన్నారు. పాల ఉత్పత్తిదారుల సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి పరిష్కరించాలని చల్మెడ రాజేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. డైరీ భూముల విషయంలో రికార్డులను సమగ్రంగా పరిశీలించి న్యాయం చేయడంతో పాటు పెండింగ్ ప్రోత్సాహకాలను విడుదల చేయాలని, పశువుల కొనుగోలుకు సబ్సిడీ అందించాలని కోరారు. కార్యక్రమంలో కరీంనగర్ డైరీ పాలకవర్గ సభ్యులు, పాల ఉత్పత్తిదారులు, తదితరులు పాల్గొన్నారు.



# ప్రకృతి వ్యవసాయానికి ప్రోత్సాహం

- ఈదులపూసపల్లి ఏఇఓ పున్నమికి ఫోన్‌లో అభినందనలు తెలిపిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు..



**మహబూబాబాద్ ప్రతినిధి, ఆగస్టు 17 (జనం సాక్షి):** రైతుల సమస్యలు, ప్రకృతి వ్యవసాయం, వ్యవసాయ రంగంలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, వారికి అందుతున్న ప్రభుత్వ సహాయం తదితర అంశాలపై ఇటీవల వెలువడిన పత్రికా కథనాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరిశీలించారు. పత్రికలో వచ్చిన కథనాన్ని చూసిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గారు వెంటనే ఈదులపూసపల్లి వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఇఓ) పున్నమికి ఫోన్ చేసి అభినందనలు తెలిపారు. రైతుల సమస్యలను గుర్తించి, వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు కృషి చేయాలని మంత్రి సూచించినట్లు తెలిపారు. రైతులకు అవసరమైన ప్రభుత్వ పథకాలు, సాంకేతిక సహాయం, వ్యవసాయ సలహాలు అందేలా క్షేత్రస్థాయిలో మరింత చురుగ్గా పనిచేయాలని మంత్రి సూచించినట్లు సమాచారం. పత్రికా కథనాన్ని పరిశీలించి, వెంటనే స్పందించి ఏఈఓ పున్నమిని మంత్రి అభినందించడం పట్ల రైతులు, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. రైతుల సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో మీడియా చేస్తున్న కృషికి ఇది ప్రోత్సాహకరమని వారు పేర్కొన్నారు.

# విద్యుత్ కనెక్షన్ల వ్యవహారంపై విజిలెన్స్ విచారణ

- నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు
- టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్

**ముషీరాబాద్, ఆగస్టు 17 (జనం సాక్షి):** విద్యుత్ కనెక్షన్లు, అనుమతులకు సంబంధించి పలు ప్రాంతాల్లో చోటుచేసుకున్న అంశాలపై కొన్ని పత్రికల్లో వెలువడిన కథనాలను టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్ తీవ్రంగా పరిగణించారు. ఈ వ్యవహారంపై పూర్తిస్థాయి విజిలెన్స్ విచారణకు ఆదేశాలు జారీ చేసినట్లు సీఎండీ తెలిపారు. విచారణలో వాస్తవాలు, బాధ్యతలు, విధి నిర్వహణలో జరిగిన లోపాలను సమగ్రంగా పరిశీలిస్తామని చెప్పారు. అధికారులు, ఉద్యోగులు ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్లు తేలితే, వారి హోదాతో సంబంధం లేకుండా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సంస్థ ప్రతిష్ఠకు భంగం కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమన్నారు. ప్రజలకు నాణ్యమైన, పారదర్శకమైన విద్యుత్ సేవలు అందించడమే టీజీఎస్పీడీసీఎల్ ప్రధాన లక్ష్యమని, ప్రజల విశ్వాసమే సంస్థకు అతిపెద్ద బలమని సీఎండీ పేర్కొన్నారు. పారదర్శకత, జవాబుదారీతనం, అవినీతి రహిత పరిపాలనకు సంస్థ కట్టుబడి ఉందన్నారు. విచారణ పూర్తయిన అనంతరం వాస్తవాలను ప్రజల ముందుంచి, అవసరమైన పరిపాలనా చర్యలు తీసుకుంటామని తెలిపారు. వినియోగదారుల ఫిర్యాదులను మరింత పారదర్శకంగా స్వీకరించి, వేగంగా పరిష్కరించేందుకు కస్టమర్ రిలేషన్ మేనేజర్ సెల్ ఏర్పాటు చేయనున్నట్లు సీఎండీ వెల్లడించారు. ఇటీవల మౌలాలి-ఉప్పల్ ఐసీఎస్‌సీ కేంద్రాన్ని తనిఖీ చేసిన సందర్భంగా వినియోగదారులు విద్యుత్ సేవలకు సంబంధించిన అవకతవకలు, ఫిర్యాదులు, ఇబ్బందులను నేరుగా తెలియజేసేలా ప్రత్యేక వ్యవస్థ అవసరమని గుర్తించినట్లు చెప్పారు. కొండాపూర్ ప్రాంతానికి సంబంధించిన అంశంలోనూ వాస్తవాలను వెలికితీసి, బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవడంలో సంస్థ ఎలాంటి వెనుకంజ వేయదని సీఎండీ స్పష్టం చేశారు. "సంస్థ ప్రతిష్ఠను కాపాడటం, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టడం మా ప్రథమ కర్తవ్యం. ఎవరైనా తప్పు చేసి ఉంటే శాఖాపరంగా కఠిన చర్యలు తప్పవు" అని జితేష్ వి. పాటిల్ స్పష్టం చేశారు.

## రిటైర్‌మెంట్ డబ్బులపై భార్యాభర్తల గొడవ

**భర్తను రోకలిబండతో కొట్టి చంపిన భార్య**

**సిద్దిపేట, ఆగస్ట్17 (జనంసాక్షి) :** సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలో దారుణం చోటు చేసుకుంది. రిటైర్మెంట్ డబ్బుల కోసం భర్తను భార్య రోకలిబండతో కొట్టి హతమార్చడం కలకలం రేపింది. వివరాల్లోకి వెళ్తే..స్థానిక హనుమాన్ నగర్‌లో చెందిన వెంకటేశం- రాజమణి దంపతులు నివసిస్తున్నారు. వెంకటేశం ఆసిఫాబాద్ కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్‌గా పని చేస్తున్నాడు. రాజమణి ఏఎన్ఎంగా విధులు నిర్వర్తిస్తున్నది. అయితే ఈ నెలలో వెంకటేశం పదవీ విరమణ చేయాల్సి ఉండగా, రిటైర్మెంట్ డబ్బులు, ఆస్తి విషయంలో దంపతులు గొడవపడ్డారు. ఈ గొడవ పెద్దదిగా మారడంతో ఆగ్రహించిన రాజమణి భర్తను రోకలిబండతో కొట్టి దారుణంగా హతమార్చింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని రాజమణిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## రోడ్డు ప్రమాదంలో వెంకంపాడు యువ సర్పంచ్ మృతి



**మరిపెడ, ఆగస్టు 17 (జనం సాక్షి) :** బొలెరో ట్రాలీ వాహనం ఢీకొని సర్పంచ్ మృతి చెందిన ఘటన మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం గిరిపురం గ్రామంలో సోమవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వెంకంపాడు సర్పంచ్ ఉప్పల సోమన్న యాదవ్ (36) ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్ గా ఎన్నికయ్యారు. పనుల్లో భాగంగా మండల కేంద్రానికి వచ్చి తిరిగి స్వగ్రామానికి బైకుపై వెళ్తుండగా గిరిపురం గ్రామంలో ట్రాలీ వేగంగా ఢీకొట్టడంతో తీవ్ర గాయాలు అయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో చనిపోయినట్లు తెలుస్తోంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సాఫ్ట్‌వేర్ ఉద్యోగి బలవన్మరణం

**హైదరాబాద్, ఆగస్ట్17 (జనంసాక్షి) :** హైదరాబాద్‌లోని మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని బోడుప్పల్ శ్రీ సాయిరామ్ నగర్‌లో విషాద ఘటన చోటుచేసుకుంది. 29 ఏళ్ల సాఫ్ట్‌వేర్ ఉద్యోగి రేగు మహేశ్ బలవన్మరణానికి పాల్పడ్డాడు. బేగంపేటలోని ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్న మహేశ్.. కొన్ని రోజులుగా ముభావంగా ఉంటున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. శనివారం మహేశ్ కుటుంబ సభ్యులు సొంతూరుకు వెళ్లారు. దీంతో మహేశ్ ఇంట్లో ఒంటరిగా ఉన్నాడు. ఈ క్రమంలో తల్లిదండ్రులు, చెల్లిని మిస్ అవుతున్నానంటూ తన చెల్లికి మెసేజ్ పంపించాడు. ఆ మెసేజ్‌పై అనుమానం వచ్చిన చెల్లి.. సమీప బంధువు గిరిబాబుకు సమాచారం అందించి ఇంటికి వెళ్లి చూడాలని కోరింది. గిరిబాబు మహేశ్ ఇంటికి వెళ్లి పరిశీలించగా.. పడక గదిలో ఉరివేసుకున్న స్థితిలో మహేశ్ కనిపించాడు. వెంటనే కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న మేడిపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మహేశ్ బలవన్మరణానికి గల కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. వ్యక్తిగత, కుటుంబ లేదా ఉద్యోగ సంబంధిత కారణాలు ఏమైనా ఉన్నాయా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు పోలీసుల విచారణ అనంతరం వెల్లడికానున్నాయి.

# అణు ప్రమాదం నష్టం.. రూపాయల్లో కొలవగలమా?

అణు విద్యుత్ ప్రమాదంలో జరిగే నష్టాన్ని రూ.3,000 కోట్లు, రూ.30,000 కోట్లు అంటూ రూపాయల్లో కొలవడం సాధ్యమేనా? యంత్రం పాడైతే దాని నష్టం లెక్కించవచ్చు. వాహన ప్రమాదంలో పరిహారం నిర్ణయించవచ్చు. కానీ రేడియేషన్ వల్ల భూమి, నీరు, గాలి దశాబ్దాల పాటు కలుషితమైతే.. ప్రజల ఆరోగ్యం, జీవనోపాధి, భవిష్యత్ తరాలు ప్రభావితమైతే ఆ నష్టానికి ధర ఎలా నిర్ణయిస్తాం? సుప్రీంకోర్టు తాజాగా కేంద్రాన్ని ప్రశ్నించిన అసలు అంశం ఇదే.

హిరోషిమా, నాగసాకి నుంచి చెర్నోబిల్, ఫుకుషిమా వరకు అణు ప్రమాదాల ప్రభావం ఎంత తీవ్రమో ప్రపంచం ఇప్పటికే చూసింది. సాంకేతికంగా అత్యంత అభివృద్ధి చెందిన దేశమైన జపాన్ కూడా ఫుకుషిమా విషాదాన్ని పూర్తిగా అధిగమించలేకపోయింది. అంటే అణు ప్రమాదం ఒక కర్మాగారానికో, ఒక ప్రాంతానికో పరిమితమయ్యే విషయం కాదు.

భారత్‌లో అణు విద్యుత్‌ను విస్తరించాల్సిన అవసరం ఉండొచ్చు. పెరుగుతున్న విద్యుత్ డిమాండ్, కర్బన ఉద్గారాల తగ్గింపు వంటి కారణాలతో అణుశక్తికి ప్రాధాన్యం పెరుగుతోంది. కానీ ప్రాజెక్టులను పెంచడం ఎంత ముఖ్యమో, వాటి భద్రతకు అంతకంటే ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడం అవసరం.

ప్రమాదం జరిగితే నిర్వాహకుల బాధ్యతను ముందుగానే ఒక పరిమితికి కట్టిపడేస్తే, బాధితులకు పూర్తి న్యాయం జరుగుతుందా? నిర్లక్ష్యం వల్ల నష్టం జరిగితే పరిహారం కూడా వాస్తవ నష్టానికి అనుగుణంగా ఉండాల్సిందే. పెట్టుబడులను ఆకర్షించేందుకు పరిహార బాధ్యతను తగ్గించడం ఒక కారణం కావచ్చు. కానీ అది ప్రజల హక్కులను దెబ్బతీయకూడదు.

అంతేకాదు, అణు భద్రతను పర్యవేక్షించే సంస్థలు పూర్తిగా స్వతంత్రంగా ఉండాలి. పర్యవేక్షించాల్సిన సంస్థలతో ప్రయోజనాల సంఘర్షణ ఉంటే భద్రతా వ్యవస్థపై ప్రజలకు నమ్మకం ఎలా కలుగుతుంది?

అణు విద్యుత్ దేశ భవిష్యత్ ఇంధన అవసరాలకు ఉపయోగపడొచ్చు. కానీ ప్రజల ప్రాణాలు, ఆరోగ్యం, భవిష్యత్ తరాల భద్రత కంటే ఏ ప్రాజెక్టూ గొప్పది కాదు. ప్రమాదం జరిగిన తర్వాత పరిహారం లెక్కించడం కంటే ప్రమాదమే జరగకుండా చూడటం ముఖ్యం. అయినా ప్రమాదం జరిగితే బాధితులకు పరిమితులు లేని న్యాయమైన పరిహారం అందించే వ్యవస్థ ఉండటం ప్రజాస్వామ్య బాధ్యత.

సంపాదకీయం

జనంసాక్షి

# బీసీల హక్కులకు రాజ్యాంగ కవచాలు - ఆచరణలో ఇబ్బందులు

భారత రాజ్యాంగం సామాజిక న్యాయాన్ని కేవలం ఒక రాజకీయ నినాదంగా కాకుండా, చారిత్రకంగా వెనుకబడిన వర్గాలకు సమాన అవకాశాలు కల్పించే బాధ్యతగా స్వీకరించింది. ఆ ప్రయాణంలో జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్ కీలకమైన సంస్థ. అయితే ఈ కమిషన్ చరిత్రను చూస్తే, బీసీలకు రిజర్వేషన్లు కల్పించడం కంటే వాటి అమలు, ప్రాతినిధ్యం, కులాల గుర్తింపు, రాష్ట్రాల హక్కులు వంటి ప్రశ్నలే మరింత సంక్లిష్టంగా మారినట్లు కనిపిస్తుంది. 1953లో జవహర్‌లాల్ నెహ్రూ ప్రభుత్వం కాకా సాహెబ్ కేల్కర్ అధ్యక్షతన తొలి వెనుకబడిన తరగతుల కమిషన్‌ను ఏర్పాటు చేసింది. 1951 జనాభా లెక్కల ఆధారంగా దేశ జనాభాలో వెనుకబడిన తరగతుల వాటా సుమారు 52 శాతంగా కమిషన్ అంచనా వేసింది. వేలాది కులాలు సామాజికంగా, విద్యాపరంగా వెనుకబాటుతనాన్ని ఎదుర్కొంటున్నాయని గుర్తించి రిజర్వేషన్లు సహా పలు చర్యలను సూచించినప్పటికీ, ఆ నివేదికను కేంద్ర ప్రభుత్వం అమలు చేయలేదు. అక్కడే ఒక ముఖ్యమైన గుణపాఠం ఉంది. బీసీ కమిషన్‌లు ఏర్పాటు చేయడం మాత్రమే సామాజిక న్యాయాన్ని సాధించదు. వాటి సిఫారసులకు రాజకీయ సంకల్పం, ఆచరణలో అమలు చేయటం అవసరం.

ఈ సమస్యను మళ్లీ జాతీయ రాజకీయాల కేంద్రంలోకి తీసుకొచ్చింది బి.పి. మండల్ కమిషన్. 1979లో ఏర్పడిన ఈ రెండో వెనుకబడిన తరగతుల కమిషన్ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యా సంస్థల్లో ఇతర వెనుకబడిన తరగతులకు 27 శాతం రిజర్వేషన్ సిఫారసు చేసింది. 1990లో వి.పి. సింగ్ ప్రభుత్వం దాని అమలుకు చర్యలు ప్రారంభించడంతో దేశవ్యాప్తంగా తీవ్ర రాజకీయ, సామాజిక చర్చ మొదలైంది. చివరకు ఇందిరా సహానీ కేసులో సుప్రీంకోర్టు 1992లో రిజర్వేషన్లను సమర్థించినప్పటికీ, 'క్రీమీ లేయర్'ను మినహాయించడం, సాధారణ పరిస్థితుల్లో రిజర్వేషన్లు 50 శాతాన్ని మించకూడదనే సూత్రం వంటి పరిమితులను స్పష్టం చేసింది.ఆనాడు బీసీ రిజర్వేషన్లు వ్యతిరేక ఉద్యమం పెద్ద ఎత్తున చేసింది ఈ ఆరెస్సెస్ నేతల జనసంఘ్ (బీజేపీ) నేతలే.

ఇందిరా సహానీ తీర్పు తరువాత 1993లో పార్లమెంట్ చట్టం ద్వారా జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్ ఏర్పడింది. అయితే దానికి రాజ్యాంగ ప్రతిపత్తి రావడానికి మరో పావు శతాబ్దం పట్టింది.



2018లో 102వ రాజ్యాంగ సవరణ ద్వారా రాజ్యాంగంలోని 338-బి అధికరణ కింద జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్‌కు రాజ్యాంగ హోదా లభించింది. ఇక్కడ ఒక స్పష్టత అవసరం: దీనికి అధికారిక పేరు 'నేషనల్ కమిషన్ ఫర్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్' లేదా (జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్); 'జాతీయ విద్యా, సామాజిక వెనుకబడిన తరగతుల కమిషన్' అనే పేరు అధికారికంగా అమలులోకి రాలేదు. కమిషన్ రాజ్యాంగంలో 'సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతులు' అనే విస్తృత పరిధిలో పనిచేస్తుంది. రాజ్యాంగ హోదా రావడంతో కమిషన్ బాధ్యతలు కూడా విస్తరించాయి. బీసీలకు కల్పించిన రాజ్యాంగ, చట్టపరమైన రక్షణలను పరిశీలించడం, వాటి అమలును పర్యవేక్షించడం, హక్కుల ఉల్లంఘనలపై ఫిర్యాదులను విచారించడం, ప్రభుత్వాలకు సలహాలు ఇవ్వడం, సామాజిక-ఆర్థిక అభివృద్ధిపై నివేదికలు సమర్పించడం వంటి బాధ్యతలు దానికి ఉన్నాయి. అవసరమైన సందర్భాల్లో సివిల్ కోర్టుకు సమానమైన కొన్ని అధికారాలను ఉపయోగించే అవకాశం కూడా ఉంది. అయితే 102వ సవరణ మరో కీలకమైన రాజ్యాంగ వివాదానికి దారి తీసింది. 342-ఏ అధికరణలోని మార్పుల వల్ల రాష్ట్రాల స్వంత బీసీ జాబితాలను రూపొందించే అధికారం పరిమితమైందా అనే ప్రశ్న తలెత్తింది. చివరకు 105వ రాజ్యాంగ సవరణ ద్వారా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు తమ స్వంత సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాల జాబితాలను గుర్తించే అధికారాన్ని స్పష్టంగా పునరుద్ధరించారు. ఇది భారత సమాఖ్య వ్యవస్థలో సామాజిక న్యాయ విధానాన్ని కేంద్రీకరించడం ఎంత సున్నితమైన అంశమో చూపిస్తుంది.

ఇక తమిళనాడులో 69 శాతం రిజర్వేషన్ల ఉదాహరణ మరో రాజ్యాంగ సంక్లిష్టతను వెల్లడిస్తుంది. 76వ సవరణ ద్వారా ఆ చట్టాన్ని 9వ, షెడ్యూల్‌లో చేర్చినా, ఐ.ఆర్. కోయెల్హో తీర్పు తరువాత తొమ్మిదో షెడ్యూల్ కూడా సంపూర్ణ న్యాయపరిశీలనకు అతీతం కాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అంటే సామాజిక న్యాయం పేరుతో చేసిన చట్టం కూడా రాజ్యాంగ మౌలిక నిర్మాణానికి విరుద్ధంగా ఉంటే న్యాయ పరిశీలనను తప్పించుకోలేదన్న మాటను మనం అర్థం చేసుకోవాలి.

అందువల్ల జాతీయ బీసీ కమిషన్ అసలు సవాలు కేవలం కులాలను జాబితాలో చేర్చడం లేదా తొలగించడం కాదు. దేశవ్యాప్తంగా బీసీల విద్య, ఉపాధి, ఆదాయం, భూమి, వృత్తి, ఉన్నత విద్య, ప్రభుత్వ సేవల్లో ప్రాతినిధ్యం వంటి అంశాలపై నిరంతర, శాస్త్రీయ డేటా ఆధారిత మూల్యాంకనం చేయడం. కేంద్ర జాబితాలో రాష్ట్రాల వారీగా కులాలు, సమూహాల వివరాలు ఇప్పటికే అందుబాటులో ఉన్నప్పటికీ, వాటి సామాజిక-ఆర్థిక పురోగతిపై సమగ్ర ప్రభావాల అధ్యయనాలు మరింత బలపడాల్సిన అవసరం ఉంది.

బీసీల జనాభా ఎంత అన్న ప్రశ్నతో పాటు, రిజర్వేషన్ ప్రయోజనాలు ఎవరికెంత చేరాయి, ఏఏ వర్గాలు ఇంకా అట్టడుగునే ఉన్నాయి, క్రీమీ లేయర్ విధానం ఎంత సమర్థంగా పనిచేస్తోంది?, ప్రభుత్వ ఉద్యోగాలు, ఉన్నత విద్యలో వారికి వాస్తవ ప్రాతినిధ్యం ఎంత ఉంది ? అనే ప్రశ్నలకు సమాధానాలు వెతకాలి. సరైన లెక్కలు లేని సామాజిక న్యాయం రాజకీయ నినాదంగా మిగిలిపోతుంది. విశ్వసనీయమైన డేటాతో కూడిన సామాజిక న్యాయం మాత్రమే విధానంగా మారుతుంది. అందుకే జాతీయ బీసీ కమిషన్ స్వతంత్రత, పరిశోధనా సామర్థ్యం, పారదర్శకత, సమాఖ్య సమన్వయం బలోపేతం కావాలి. రాజ్యాంగ హోదా బీసీ కమిషన్‌కు కవచాన్ని ఇచ్చింది. ఆ కవచం నిజంగా బీసీల హక్కులను రక్షించాలంటే దానికి స్వతంత్ర నిర్ణయశక్తి, ఖచ్చితమైన గణాంకాలు, నిరంతర పర్యవేక్షణ అనే ఆయుధాలు కూడా అవసరం.




డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.

**దోమ నీతి**

**ఓ దోమ నీ కోసం**
**కడుపు నిండ రక్తం తీసుకో**
**మరో చోటుకి జారుకో... ఓ బాబు**
**మీలా జీవితాన్ని ఆశించను**
**దోచి దాచి పెట్టుకో లేను**
**నా కష్టంతో**
**నా ఆకలి తీర్చు కుంటా**
**స్వేచ్ఛ గా తిరుగుతూ**
**నీతి గా బతుకు తా**

రేడియమ్
9291527757
(ఒక ఆంగ్ల కార్టూన్ చూసి)

# స్వేచ్ఛా ప్రణయ గీతం



" ఇది యవ్వన ప్రేమ ప్రవాహం
వయసు వస్తే వంకలన్నీ తీరుతాయి.
ఏ వయసుకు ఆ ముచ్చట ఇష్ట పడుతారు
భావాలు భావోద్వేగాలు పంచుకుంటారు.
కలుసుకుంటారు. కలలు కంటారు
నచ్చితే కలిసి వుంటారు.
నచ్చక పోతే విడి పోతారు.
ఇది యవ్వన ప్రేమ ప్రవాహం
ఇది టీనేజ్తో మొదలై, నిరుద్యోగం,
ఉద్యోగ దశల గుండా ప్రయాణిస్తుంది
ఈ క్రమాన్ని లివింగ్ ఇన్ రిలేషన్ షిఫ్ అంటారు"

సుచిత్ర వినిపించిన కవిత పదే పదే గుర్తుకు వస్తోంది సరితకు.

సరిత మెట్రో స్టేషన్ చేరే సరికి జనసందోహంతో కిక్కిరిసి పోయింది. ఐటి కారిడార్ వైపు వెళ్లే రైలు కోసం వందలాది మంది యువతీ యువకులు.

ఆ జనసముద్రంలో ఒకరి ముఖం ఒకరికి పట్టదు, ఒకరి గమ్యంతో మరొకరికి సంబంధం లేదు. అందరి కళ్లూ మొబైల్ స్క్రీన్లకే పరిమితమై ఉన్నాయి. కానీ, ఆ వేగవంతమైన కాల ప్రవాహంలో కూడా కొన్ని నిశ్శబ్ద బంధాలు నిగూఢంగా మొలకెత్తుతాయి.

సరిత నిలబడి ఉంది. ఆమె వయసు ఇరవై ఆరేళ్లు. ఒక డిజిటల్ కంపెనీలో హెచ్ ఆర్ గా పనిచేస్తోంది. చేతిలో ఆఫీస్ బ్యాగ్, చెవుల్లో ఇయర్‌ఫోన్స్ ఉన్నప్పటికీ ఆమె మనసంతా ఏదో ఉత్సాహం. సంతోషం. సుచిత్ర ఎంత బాగా చెప్పింది. !

మెట్రో ట్రైన్ ప్లాట్‌ఫారమ్ మీదకు వచ్చి తలుపులు తెరుచుకోగానే జనమంతా ఒకేసారి లోపలికి తోసుకుంటూ వెళ్లారు. సరిత కూడా ఆ యాంత్రిక తోపులాటలోనే లోపలికి ప్రవేశించి, ఒక పోల్ పట్టుకుని నిలబడింది.

ట్రైన్ కదిలింది. కూర్చోవడానికి సీట్లు దొరకడం మెట్రోలో ఒక అదృష్టం. సరిత ఉత్సాహంగాపక్కకు చూసింది. సరిగ్గా ఆమెకు మూడు అడుగుల దూరంలో శరత్ నిలబడి ఉన్నాడు. అతను ఒక సాఫ్ట్‌వేర్ సంస్థలో క్లౌడ్ ఆర్కిటెక్ట్‌గా చేస్తున్నాడు. శరత్, సరిత.. ఒకే సమయానికి, ఒకే కోచ్‌లో ప్రయాణిస్తుంటారు. . మొదట్లో అది కేవలం యాదృచ్ఛికం అనుకున్నారు. కానీ రోజులు గడుస్తున్న కొద్దీ, ఒకరినొకరు చూసుకోవడం, ఆ చూపుల్లో ఒక చిన్న ఆత్మీయ గుర్తింపు లభించడం వారి దినచర్యలో భాగమైపోయింది.

మెట్రో కిటికీల గుండా నగర భవనాలను చూసే సందుల్లో ఒకరినొకరు గమనించుకోవడంలో ఒక తెలియని హాయి . సరిత ముఖంలో ఆనందం వెల్లి విరుస్తుంటే శరత్ కళ్లల్లో ఒక మెరుపు. మాటలు లేని నిశ్శబ్ద భాష. సమకాలీన నగర జీవితంలో ఒక అద్భుతమైన ఆకర్షణ ప్రవాహం.

ట్రైన్ అమీర్‌పేట్ వద్ద మలుపు తిరుగుతుండగా జనాల రద్దీ మరింత పెరిగింది. ఒక పెద్ద తోపులాట జరగడంతో సరిత అదుపుతప్పి శరత్ వైపు బ్యాలెన్స్ కోల్పోయింది. శరత్ వెంటనే ఆమె చేతిని పట్టుకుని కింద పడకుండా ఆపాడు. ఆ స్పర్శ ఇద్దరిలోనూ ఒక తెలియని కంపనాన్ని సృష్టించింది. వారి పరిచయం చిన్నదే. దాని వెనుక ఉన్న భావ ప్రసారం చాలా లోతైనది. ఆ కళ్లు హృదయపు లోతులను స్పర్శిస్తాయి. గిలిగింతలు పెడుతాయి.

వారి పరిచయం కేవలం స్నేహంగానే ఆగలేదు, రెండు హృదయాల మేళవింపుగా మారింది. ఒకరోజు శరత్, సరిత ఇద్దరూ ఆఫీస్ అయిపోయాక ఫోన్‌లో మాట్లాడుకుని, సాయంత్రం మాదాపూర్‌లోని ఒక ప్రశాంతమైన హోటల్‌లో కలుసుకున్నారు. ఆ సాయంత్రం ఇద్దరూ ఎదురెదురుగా కూర్చున్నారు. స్నాక్స్ తీసుకుని సరితకు ఆఫర్ చేస్తూ ఆమె కళ్ల లోకి చూశాడుశరత్.

" ఏంటి ? అలా కొత్తగా చూస్తున్నారు. " ఆ సాక్సు తీసుకుంటూ నవ్వుతూ జుటు సవరించుకుంది సరిత.

" మిమ్మల్ని చూస్తుంటే ఎంతో ఆత్మీయులను చూస్తున్నట్టు అనిపిస్తుంది. ,"

శరత్ సంభాషణను ఆత్మీయంగా ప్రారంభించాడు.

" మిమ్మల్ని చూస్తుంటే నాక్కూడా అలాగే అనిపిస్తుంది. ఈ నగర జీవితం పైన చూడటానికి చాలా రంగులమయంగా, ఆకర్షణీయంగా ఉంటుంది కానీ, లోపల ఉండే ఒత్తిడి, కుటుంబ బాధ్యతలు మనల్ని రోజూ ఏదో ఒక యుద్ధం చేసేలా చేస్తాయి. నీ గురించి చెప్పు?" అంది సరిత.

శరత్ తన గ్రామీణ నేపథ్యం, తన సాఫ్ట్‌వేర్ ఉద్యోగం, రూమ్‌మేట్స్‌తో ఉండే యాంత్రిక జీవితం గురించి చెప్పాడు. సరిత కూడా తన ఉద్యోగం, సవాళ్లను పంచుకుంది.

అలా వారంలో రెండు మూడు సార్లు కలుసుకోవడం, ఆఫీస్ విషయాలు, వ్యక్తిగత ఇష్టాలు, నచ్చిన పుస్తకాలు, సామాజిక సిద్ధాంతాలు...

సుచిత్ర సంప్రదాయ పెళ్లి గురించి లేవనెత్తే చర్చలు... అలా ఎన్నో విషయాలు మాట్లాడుకునేవారు. అలా నెలలు గడిచిపోయాయి. ఈ మూడు నెలల్లో వారి మధ్య కేవలం పరిచయం మాత్రమే పెరగలేదు, ఒకరినొకరు పూర్తిగా శ్వాసించేంత గాఢమైన ప్రేమానురాగాలు మొలకెత్తాయి. శరత్ సామీప్యం సరితకు ఒక మానసిక ఉల్లాసం ఇస్తే, సరిత స్వతంత్ర ఆలోచనలు శరత్‌ను అమితంగా ఆకట్టుకున్నాయి.

ఒకరోజు రాత్రి సరిత రూమ్‌కి రాగానే బెడ్‌పై కూర్చుని మొబైల్ చూస్తూ మురిసిపోతోంది సుచిత్ర.

"ఏం విశేషం! చాలా ఉత్సాహంగా ఉన్నావు? సుధీర్ ఓకే అన్నాడా? " ఉత్సాహంగా అడిగింది సరిత.

" వాడా? దొంగ నాటకాలు. మేల్ చావనిస్ట్ పిగ్. వాడొక వరకట్న పిశాచి. వాడికి ఇరవై లక్షలు కట్నంతో భారీ పెళ్లి సంబంధం వచ్చిందట,! వాడి మొహానికి కట్నం కావాలని డైరెక్టుగా చెప్పకుండా వాళ్ల నాన్న అన్నాడని చెప్తాడు. వాడొక శాడిస్టులే! వాడిది ప్రేమ కాదు. దోమ కాదు. నెల నెల సంపాదిస్తున్నాను కదా! నా జీతం మీద ఆశ. నువ్వు చదివినంత నేను చదువుకున్నాను. పెళ్లయ్యాక కూడా నా జీతం నాకే. మా ఇంటికి పంపిస్తా అన్నాను. దొంగ వెధవ బయట పడి పోయాడు" అంది సుచిత్ర.

" మరి ఇంత ఉత్సాహం దేనికి?"

" వాడి స్వభావం ముందే తెలిసినందుకు."

"ఇంకా ఏదో విశేషం ఉందిలే !" అంటూ సెల్ఫోన్ లో ఏముందో అని లాక్కుంది సరిత.

" ఎవరమ్మా ఇతగాడు? చూడ చక్కని పిల్ల వాడు? " కవ్వించింది సరిత.

" ఇతడు నవీన్ అనే ఫ్రెండ్ లే! ప్రపోజల్ చేశాడు. ఈ సండే మన రూంకు వస్తానన్నాడు . నా తరఫున అన్ని వివాలు నువ్వే అడగాలి." అంటూ మరికొన్ని ఫోటోలు బయోడాటా చూపించింది సుచిత్ర.

" అది సరే గాని శరత్ తో నీలవ్ ట్రాక్ ఎక్కడి దాకా వచ్చింది?" అని తన సెల్ఫోన్ తీసుకొంది.

" అలాంటిదేం లేదు, ఇప్పటికైతే జస్ట్ ఫ్రెండ్స్ అంతే," అంది సరిత.

"అవునులే, జస్ట్ ఫ్రెండ్స్! ఆ తరువాతే కద ప్రేమ".. సుచిత్ర నవ్వు.

ఇద్దరు కలిసి నవ్వుల పువ్వులు. కాసేపటికి అమ్మ పంపింది అంటూ సెల్ ఫోన్ లో చూపించింది సరిత.

" రెండు ఫోటోలతో పాటు సరిత వాళ్ల అమ్మ వాట్సాప్‌లో ఒక మెసేజ్. అబ్బాయి అమెరికా వీసా ఫోటో.

" అమ్మా! సరితా! మీ నాన్నగారి ఫ్రెండ్ తెచ్చిన సంబంధం ఇది. అబ్బాయి అమెరికాలో మంచి ఉద్యోగంలో ఉన్నాడు. జాతకాలు, గణాలు అన్నీ కుదిరాయి అన్నారు వాళ్లు పెద్ద మనుషులను పంపిస్తున్నారు. వెంటనే ఒప్పుకుంటే వచ్చే ముహూర్తానికే పెళ్లి చేసేయొచ్చు."

" ఒక అపరిచిత వ్యక్తి ఫోటో, అతని జీతం, అతని ఆస్తి వివరాలు చూసి, అతనితో జీవితం పంచుకోవాలా? అతని వ్యక్తిత్వం ఏంటి? అతని అలవాట్లు ఏంటి? ఏమీ తెలియకుండా ఎలా? కేవలం ఒక బయోడేటాను నమ్మి పెళ్లి చట్రంలోకి దూకాలా?" సుచిత్ర సూటిగా అడిగింది.

ఆ బయోడాటా చూడగానే సరితకు క్లోజ్ ఫ్రెండ్ రాధిక గుర్తొచ్చింది. ఆమె విషాద గాథ చెప్పుకొచ్చింది.

" సుచీ! నాది కూడ నీ అభిప్రాయమే. రాధికకు డిగ్రీ చదువుతుండగానే ఇంట్లో వాళ్లు బలవంతంగా సంబంధాలు చూసి, జాతకాలు బాగున్నాయంటూ ఒక బడా వ్యాపారవేత్త కొడుక్కి ఇచ్చి భారీగా కట్న కానుకలు పోసి పెళ్లి చేశారు. తీరా పెళ్లయ్యాక తెలిసింది... ఆ భర్త తిరుగుబోతు, నానా రకాల తాగుడు వ్యసనాలకు బానిస అని.వాడు శాడిస్టు. రోజూ రాత్రి తాగి వచ్చి రాధికను శారీరకంగా, మానసికంగా నానా బాధలు పెట్టేవాడు. ఆ నరకయాతన అనుభవిస్తూనే, ఆ బాధల్లోనే రాధిక ఒక ఆడ శిశువుకు జన్మనిచ్చింది. ప్రసూతి కోసం పురిటికని తల్లిగారింటికి వచ్చిన రాధిక, భర్త పెట్టే హింసలు భరించలేక మళ్లీ అత్తగారింటికి వెళ్లనని ఏడుస్తూ అమ్మానాన్నల వద్దే ఉండిపోయింది.

" ముందే జాగ్రత్త పడాల్సింది. పెళ్లయి ఏడాది తిరగక ముందే కాన్పు లేంటి? వెంటనే విడాకులు తీసుకుని మళ్లీ పెళ్లి చేసుకోవాల్సింది". అలవోకగా తన అభిప్రాయం చెప్పింది సుచిత్ర.

" అది అంత తేలిక కాదు. ఏడాది తిరగకముందే కళ్లముందే తమ బిడ్డ బతుకు ఇలా అయిందని రాధిక తల్లిదండ్రులు కుమిలిపోయారు. చివరకు విధిలేక కోర్టు మెట్లు ఎక్కారు. పెళ్లిలో పెట్టిన వరకట్నం, బంగారం, పెళ్లి ఖర్చులు వెనక్కి ఇవ్వాలని, పాప సంరక్షణ కోసం మనోవర్తి ఇవ్వాలని కేసు వేశారు. భర్త, అతని కుటుంబం కోర్టులో విడాకులు ఇవ్వడానికి నిరాకరించారు. రాధికను మానసికంగా మరింత వేధించడానికి కేసును కావాలనే సాగదీస్తున్నారు. అటు సంసార జీవితం లేదు, ఇటు విడాకులు రావు...మూడేళ్లు గడిచాయి. ఆ చట్టాల చుట్టూ తిరుగుతూ రాధిక జీవితం ..! చివరకు విడాకులయ్యాయి. ఇపుడు ఒక బిడ్డ తల్లికి మళ్లీ పెళ్లి చెయ్యాలని తల్లిదండ్రుల ఆరాటం. రాధిక నా కన్నా ఆరు నెలలు చిన్న. "

రాధిక బతుకును కళ్లారా చూసిన సరితకు అమ్మ పంపిన ఫోటో బయోడాటా చూస్తుంటే ఏదో తెలియని భయం. ముక్కు మొహం తెలియని ఒక అపరిచిత వ్యక్తిని భర్తగా ఊహించుకోవడమే భయంగా అనిపించింది.

" పెళ్లి చూపుల్లో అంతా బాగున్నట్లే నటిస్తారు... పెళ్లయ్యాక కదా అసలు వ్యక్తిత్వాలు బయటపడేది? ఆ తర్వాత విడాకులు తీసుకోవడం మళ్లీ పెళ్లి కావడం ఎంత కష్టమో చూస్తూనే వున్నావు గద!" అంది సచిత్ర.

ఆ రోజు రాత్రి ఇద్దరు కలిసి లెక్కలు వేసారు.

సరిత తండ్రి ఒక ప్రైవేట్ క్లర్క్‌గా పనిచేస్తున్నారు. ఆయనకు వచ్చే అరకొర సంపాదనతోనే ఇల్లు గడవడం. చెల్లెలు కీర్తి ఇంకా డిగ్రీ చదువుతోంది. సరిత డైరీ తీసి, నేటి కాలంలో ఒక సాంప్రదాయ పెళ్లికి అయ్యే ఖర్చుల లెక్కలు వేసారు. వరకట్నం, కళ్యాణమండపం, కేటరింగ్, బంగారం... అన్నీ కలిపితే కనీసం ఇరవై లక్షల పైనే లెక్క తేలింది.

" ఇరవై లక్షలు! ఊళ్లో ఉన్న ఒక్క చిన్న పెంకుటిల్లు అమ్మినా ఆ అప్పు తీరదు. అయినా పెద్ద సంబంధం ఇంట్లో ఆరాటం"

" ఈ చాదస్తపు సంప్రదాయ పెళ్లి వల్ల. ఎవరికి సుఖ శాంతులుండవు, " కుండ బద్దలు కొట్టినట్టు అంది సుచిత్ర.

" సుచీ! నా పెళ్లి కోసం తండ్రి అప్పుల పాలు కావాలా? నా చెల్లెలి చదువు ఆగిపోవాలా? కేవలం సమాజం కోసం, నలుగురు వచ్చి తిని వెళ్లే భారీ పెళ్లి కోసం కుటుంబం రోడ్డున పడాలా?' సరిత ఆవేశంగా అంది.

ఈ పాత కాలపు పెళ్లి పద్ధతులు, ఈ కట్న కానుకల లెక్కల మీద ఆమెకు తీవ్రమైన అసహ్యం పుట్టింది. అందుకే ఆమె ప్రస్తుతానికి పెళ్లి వాయిదా వేస్తున్నట్లు ఇంట్లో చెప్పేసింది సరిత.

కానీ ఊళ్లో చుట్టాలు సూటిపోటి మాటలు. బిడ్డ లక్షలు సంపాదిస్తోంది . సంపాదనకు ఆశపడి పెళ్లి చేయడం లేదు," అని ఒకరంటే... " పిల్ల వయసు దాటిపోతోంది, రేపు ముసలిదయాక ఎవరు చేసుకుంటారు? " అని ఇంకొకరు.

ఓ రోజు సుచిత్ర సుచిత్ర ఆఫీస్ స్నేహితులు ఒక వీకెండ్ ట్రిప్ ప్లాన్ చేశారు. అందరూ కలిసి ఒక పదిహేను మంది నాగార్జున సాగర్ విహారయాత్రకు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. సుచిత్ర చిత్రంగా, ఆ ట్రిప్‌లో శరత్ కూడా ఉన్నాడు. ఒక ట్రావెలర్ బస్సులో అందరూ కలిసి పాటలు పాడుకుంటూ, జోకులు వేసుకుంటూ నాగార్జున సాగర్ వైపు ప్రయాణమయ్యారు.


నాగార్జున సాగర్ డ్యామ్ అందాలు, ఆ నీటి ప్రవాహాలు . గల గలలు. వాతావరణం నగరానికి భిన్నంగా ఎంతో ప్రశాంతంగా, నిశ్శబ్దంగా ఉంది. చుట్టూ కొండలు, కృష్ణమ్మ నది అలల సవ్వడి, సాగర్ అంచున కోట్ల రూపాయాలతో కొత్తగా నిర్మించిన బుద్ధ వనం చేరుకునే సరికి అది మరొక ప్రశాంత నిలయం.

స్నేహితులందరూ ఒకవైపు గ్రూప్ ఫోటోలు దిగుతూ సందడి చేస్తుండగా... సరిత నెమ్మదిగా నడుస్తూ జపాన్ వారు నిర్మించిన మినియేచర్ బుద్ధ వనం వైపు వచ్చింది. అది జపనీస్ శైలిలో కట్టబడిన ఒక చిన్న అందమైన కట్టడం. అక్కడ చుట్టూ నిశ్శబ్దం కొలువై ఉంది. సరిత అక్కడ కూర్చుంది. . శరత్ ఆమె దగ్గరకు వచ్చాడు."శరత్..నాకు ఒక సంబంధం వచ్చింది. అమెరికా అబ్బాయి. మా ఇంట్లో పెళ్లి చేసుకోమని ఒత్తిడి చేస్తున్నారు." ఊరకే ఏమంటాడో అని అడగింది సరిత. శరత్ గుండె ఒక్కసారిగా ఆగినట్లయింది. అతని ముఖం తెల్లబారిపోయింది.

"మరి... నువ్వేమన్నావు ?" అని అడిగాడు లోపలి భయాన్ని దాచుకుంటూ.

" నచ్చ లేదు అని చెప్పేసాను."

మిగితా తరువాయి సంచికలో..



- బి ఎస్ రాములు
సామాజిక తత్వ వేత్త
ఫో: 8331966987

# దేశమంటే మనుషులోయ్...

## నేటి రాజకీయాల్లో మారిన దేశభక్తి అర్థం!



గురజాడ అప్పారావు గారు తన అమర గీతంలో దేశమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుషులోయ్ అని మహోన్నతంగా రాసినప్పుడు, ఆయన అమూల్యమైన మనసులో ఉన్నది ఒక అత్యంత సూటి నిత్యసత్యం. దేశం అంటే కేవలం భౌగోళిక భూభాగం కాదు, సరిహద్దులు కాదు, పటంలో గీసిన రేఖలు అంతకన్నా కానే కాదు. దేశం అంటే అందులో అనునిత్యం జీవించే సామాన్య మనుషులు, వారి కష్టసుఖాలు, వారి ఆత్మగౌరవం, వారి ఉజ్వల భవిష్యత్తు. ఈ ఒక్క దివ్య వాక్యం తెలుగు జాతి హృదయపు లోతుల్లో వందేళ్లుగా సజీవంగా ప్రతిధ్వనిస్తూనే ఉంది. కానీ ఈనాటి సమకాలీన రాజకీయాల్లో ఈ పవిత్రమైన మాటకు నిజంగా అదే అర్థం మిగిలి ఉందా అన్నది ప్రతి ఆలోచనాపరుడైన పౌరుడూ వేసుకోవాల్సిన మూల ప్రశ్న.గతంలో అసలైన దేశభక్తి అంటే ఏమిటి? స్వాతంత్ర్య పోరాట కాలంలో దేశభక్తి అంటేనే నిస్వార్థ ఆత్మత్యాగం. సొంత ఆస్తులు, ఉద్యోగాలు వదులుకోవడం, జైళ్లకు వెళ్లడం, ప్రాణాలు సైతం అర్పించడం. ఆనాటి మహానాయకులకు దేశం అంటే సామాన్య ప్రజలు తప్ప మరొకటి కానే కాదు. పేద రైతు కడుపు నింపడం, నేత కార్మికుడి చేతికి పని దొరకడం, పేదవాడికి నాణ్యమైన విద్య అందడం ఇవే అసలైన సార్థకమైన దేశసేవగా ఆ కాలంలో భావించేవారు. గురజాడ తన గీతంలో చెప్పినట్టు, పరుల కలిమికి పొంగిపోకుడు, పరుల విత్తులకు వాకిలి కాకుడు అనే స్ఫూర్తి ఆనాటి రాజకీయ నాయకత్వానికి స్పష్టమైన దిక్సూచిగా ఉండేది. దేశం కోసం పనిచేయడం అంటే ప్రజల శ్రేయస్సు కోసం పనిచేయడం ఈ ప్రాథమిక సమీకరణం అప్పట్లో చాలా స్పష్టంగా నిలబడేది.

నేటి రాజకీయాల్లో మారిన అర్థం కానీ ఈనాటి రాజకీయ రంగంలోకి తొంగిచూస్తే, దేశభక్తి అనే పదం ఒక కొత్త రూపు సంతరించుకున్నట్టు స్పష్టంగా కనిపిస్తుంది. అది ఇప్పుడు ప్రజాసేవకు నిదర్శనంగా కాక, ఒక ప్రభావవంతమైన రాజకీయ ఆయుధంగా వాడుకలోకి వచ్చింది. ఎన్నికల ప్రచారాల్లో దేశభక్తి నినాదాలు విపరీతంగా మారుమోగుతాయి, కానీ ఎన్నికలు ముగిశాక సామాన్యుడి దైనందిన బతుకు పోరాటం మాత్రం అక్కడే ఉండిపోతుంది. తీవ్రమైన నిరుద్యోగం, నింగినంటే నిత్యావసర ధరల పెరుగుదల, రైతుల ఆత్మహత్యలు, బతుకుదెరువు వలసలు ఈ కఠిన వాస్తవాల మధ్య దేశభక్తి నినాదాలు ఒక డాబుసరిగా మిగిలిపోతున్నాయా అన్న తీవ్రమైన సందేహం సామాన్య ప్రజల్లో రోజురోజుకూ బలపడుతోంది.రాజకీయ పక్షాలు తమ ప్రత్యర్థులను విమర్శించడానికి, నిలదీయడానికి దేశద్రోహి అనే ముద్ర వేయడం ఒక సాధారణ వ్యూహంగా మారింది. ప్రభుత్వ లోపభూయిష్ట విధానాలను ప్రశ్నించడం, అవినీతిని ఎండగట్టడం, ప్రాథమిక హక్కుల కోసం గొంతెత్తడం ఇలాంటి ప్రజాస్వామిక చర్యలను సైతం కొన్నిసార్లు దేశవ్యతిరేకతగా చిత్రీకరించే ప్రమాదకర ధోరణి స్పష్టంగా కనిపిస్తోంది. నిజానికి ప్రశ్నించడం అనేది ప్రజాస్వామ్యానికి ఊపిరి వంటిది. అదే లేకపోతే, ఏ ప్రభుత్వమైనా తన జవాబుదారీతనం పూర్తిగా కోల్పోతుంది. ఇక్కడ గమనించాల్సిన ముఖ్యాంశం ఏమిటంటే, ఈ ధోరణి ఏదో ఒక నిర్దిష్ట పార్టీకో, ఒక సిద్ధాంతానికో పరిమితం కాదు అధికారంలో ఉన్న ఏ పక్షమైనా, తన స్థానాన్ని నిలబెట్టుకోవడానికి ఈ మార్గాన్ని ఆశ్రయించడం మనం స్పష్టంగా గమనించవచ్చు.జెండాలు, నినాదాల వెనుక ఉన్న వాస్తవం జాతీయ జెండాను భుజాన వేసుకోవడం, వేదికలపై వందేమాతరం అని నినాదాలు ఇవ్వడం అత్యంత సులభమైన పని. కానీ ఆ జెండా నీడన జీవిస్తున్న కోట్లాది మంది పేదల కడుపు నింపడం నిజంగా కష్టమైన పని. ఈ రెండింటి మధ్య అంతరం రోజురోజుకూ పెరిగిపోతోందని అనేకమంది సామాజిక విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక వైపు అభివృద్ధి గణాంకాలు, జీడీపీ లెక్కలు గొప్పగా ప్రకటిస్తుంటే, మరోవైపు గ్రామాల్లో తాగునీళ్ల కోసం, ఆసుపత్రుల కోసం, పాఠశాలల్లో కనీస వసతుల కోసం ప్రజలు ఇంకా నిరంతరం పోరాడుతూనే ఉన్నారు. ఈ వైరుధ్యాన్ని చూసినప్పుడు, దేశభక్తి అనేది కేవలం ఆకర్షణీయమైన రాజకీయ ఉపన్యాసాలకే పరిమితమైందా అనిపించక మానదు.

అయితే ఇదంతా ఒకే కోణంలో చూసి నిరాశపడాల్సిన అవసరం ఎంతమాత్రమూ లేదు. రాజకీయాల్లో దేశభక్తిని స్వార్థానికి ఆయుధంగా వాడే ధోరణి పెరిగినప్పటికీ, నిజాయితీగా నిశ్శబ్దంగా ప్రజాసేవ చేస్తున్న నాయకులు, కార్యకర్తలు ఇప్పటికీ మన భారతీయ సమాజంలో నిరంతరం ఉన్నారు. మారుమూల ప్రాంతాల్లో అంకితభావంతో పనిచేసే ప్రభుత్వ ఉద్యోగులు, సరిహద్దు సైనికులు, వైద్యులు, ఉపాధ్యాయులు వీరంతా ఆర్భాటపు ప్రచారానికి దూరంగా ఉండి నిజమైన దేశసేవ చేస్తున్న అమూల్యమైన రత్నాలు. దేశభక్తి అనే విశాల భావనను కేవలం రాజకీయ నాయకుల మాటలతో మాత్రమే కొలవలేము.ప్రజలే అసలైన న్యాయమూర్తులు చివరకు, ఈ ధర్మసందేహానికి సరైన సమాధానం చెప్పాల్సింది ప్రజాస్వామ్యంలో ప్రజలే. ఏ నినాదం వెనుక ఎంత చిత్తశుద్ధి ఉందో, ఏ వాగ్దానం వెనుక ఎంత చేయగలిగే శక్తి ఉందో సరిగ్గా బేరీజు వేసుకోవాల్సిన గురుతర బాధ్యత ఓటర్లదే. దేశభక్తి అంటే జెండా ఊపడం మాత్రమే కాదు, పన్నులు నిజాయితీగా చెల్లించడం, చట్టాన్ని గౌరవించడం, తోటి పౌరుడి పట్ల సహనం చూపడం, సమాజం కోసం చిన్న చిన్న బాధ్యతలు నిర్వర్తించడం కూడా పరిపూర్ణమైన నిజమైన దేశభక్తే అవుతుంది. గురజాడ చెప్పినట్టు ఈసురోమని మనుషులుంటే దేశమేగతి బాగుపడునోయ్ ప్రజలు కష్టాల్లో ఉన్నంత కాలం ఏ దేశమూ నిజంగా అభివృద్ధి చెందదు.నేటి రాజకీయాల్లో దేశభక్తి పదం అర్థం పూర్తిగా మారిపోయిందని చెప్పలేము, కానీ దాని వాడకంలో మాత్రం గణనీయమైన స్వార్థపూరిత మార్పు వచ్చిందని కాదనలేము. ఈ మార్పును పౌరులు స్పష్టంగా గుర్తించి, అసలైన దేశభక్తి అంటే ఏమిటో మళ్ళీ మళ్ళీ గుర్తుచేసుకోవడం, రాబోయే తరాలకు ఆ స్వచ్ఛమైన స్ఫూర్తిని అందించడం నేటి ఆధునిక సమాజం ముందున్న ఒక అత్యంత గొప్ప సవాలు. దేశమంటే మట్టి కాదు, మనుషులే అనే నిత్యసత్యాన్ని రాజకీయాలు మరిచిపోకుండా చైతన్యవంతంగా చూసుకోవాల్సిన బాధ్యత కేవలం పాలకులదే కాదు, సమాజంలోని ప్రతి ఆలోచనాపరుడైన పౌరుడిదీను. ఈ నిత్య సత్యాన్ని నిలబెట్టుకున్నప్పుడే మన ప్రజాస్వామ్య వ్యవస్థ వర్ధిల్లుతుంది. నవభారత నిర్మాణానికి నిసర్గమైన మానవీయ విలువల కంటే మిన్నయైనది మరొకటి లేదు.

- డా .సూర్యదేవర రామకృష్ణ 9490754169

## కీర్తిలాల్స్ 'సిందూరం' బ్రైడల్ కలెక్షన్ ఆవిష్కరణ



**ఖైరతాబాద్, ఆగస్ట్ 17 (జనం సాక్షి) :** ప్రముఖ సహజ వజ్రాల ఆభరణాల బ్రాండ్ కీర్తిలాల్స్ సోమా జిగూడ స్టోర్‌లో 'సిందూరం' పేరుతో బ్రైడల్ జ్యు వెలరీ కలెక్షన్‌ను ఆవిష్కరించింది.ప్రకృతి సౌంద ర్యం,పుష్పాలు,మందారాలు,నెమళ్ల స్ఫూర్తితో రూపొందించిన ఈ కలెక్షన్‌లో సహజ వజ్రాలు, విలువైన లోహాలు, రంగురంగుల రత్నాలను వినియోగించినట్లు కీర్తిలాల్స్ బిజినెస్ స్ట్రాటజీ డైరెక్టర్ సూరజ్ శాంతకుమార్ తెలిపారు. రిటైల్ జ్యువెల్లర్ ఇండియా అవార్డ్స్ 2026లో కీర్తిలాల్స్ బ్రైడల్ కలెక్షన్‌కు 'బెస్ట్ బ్రైడల్ జ్యువెలరీ ఆఫ్ది ఇయర్' అవార్డు లభించిందని, అవార్డు పొందిన ఆభరణం సోమాజిగూడ స్టోర్‌లో ప్రదర్శనకు ఉంచినట్లు చెప్పారు.సాంప్రదాయ వైభవాన్ని సమకాలీన డిజైన్‌తో మేళవించిన 'సిందూరం' వధువుల ప్రత్యేక రోజును మరింత చిరస్మరణీ యంగా నిలిపేలా రూపొందించినట్లు సూరజ్ శాంతకుమార్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కీర్తిలాల్స్ రిటైల్ విభాగ ఉపాధ్యక్షులు రఘునాథ్ ,ఏపీ తెలంగాణ సేల్స్ హెడ్ శ్రీనివాసరావు, క్లస్టర్ హెడ్ రమణ సాయి, ఏజీఎం విగ్నేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పథకాలు ఎత్తివేస్తే ప్రజా ఆగ్రహం తప్పదు

- మండల పార్టీ అధ్యక్షులు గండిచర్ల గోవర్ధన్ రెడ్డి
- కళ్యాణ లక్ష్మి చెక్కుల విడుదలకు డిమాండ్ చేస్తూ బిఆర్ఎస్ ధర్నా



**శంకర్‌పల్లి, ఆగస్టు 17 (జనం సాక్షి) :** పేదల సంక్షేమ పథకాలను ఎత్తివేస్తే ప్రజా ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని బిఆర్ ఎస్ మండల పార్టీ అధ్యక్షులు గండిచర్ల గోవర్ధన్ రెడ్డి,మాజీ ఎంపీపీలు ధర్మన్న గారి గోవర్ధన్ రెడ్డి,మాల చిన్న నరసింహులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ పథకాల చెక్కుల నిలుపుదల వాటిని రద్దు చేసే కుట్ర జరుగుతోందని ఆరోపిస్తూ..సోమవారం తాసిల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా,నిరసన కార్యక్రమాలు చేపట్టారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఆగిపోయిన కళ్యాణ లక్ష్మి ,షాదీ ముబారక్ చెక్కులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.పేదల పెళ్లిలకు అప్పటి కెసిఆర్ ప్రభుత్వం తీసుకువచ్చిన ప్రతిష్టాత్మక పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేయాలని చూడడం దుర్మార్గపు చర్య అని నాయకులు దుయ్యబడ్డారు. అనంతరం ఉప తాసిల్దార్ బాలకృష్ణారెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎరుకల శేఖర్, మాజీ సర్పంచులు నరసింహారెడ్డి,శ్రీనివాస్ రెడ్డి,సత్యనారాయణ రెడ్డి, శ్రీధర్ నాయకులు విజయ్ కుమార్, ఉపేందర్ రెడ్డి,లక్ష్మీ నరసింహ రెడ్డి,లింగం ముదిరాజ్,రవీందర్ రెడ్డి,వాసుదేవ్ కన్నా, శ్రీకాంత్ రెడ్డి,రాజు నాయక్, మహేందర్ రెడ్డి, సుధాకర్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పాము కాటుకు చిన్నారి బలి



**రాజోలి, ఆగస్టు 17 (జనంసాక్షి) :** మండలంలోని పెద్దతాండ్రపాడు గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. కవిత ప్రకాష్ దంపతుల రెండో కుమార్తె శ్రావ్య (8)ఇంట్లో నిద్రిస్తుండగా పాము కాటుకు గురైంది. పాప ఏడవడంతో గమనించిన తండ్రి, అప్పటికే శ్రావ్య వేలు పాము నోట్లో ఉండటాన్ని గుర్తించి చేతులతో పామును పట్టుకుని వేలును బయటకు తీశారు. అనంతరం పామును చంపినట్లు స్థానికులు తెలిపారు. వెంటనే కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే శ్రావ్య మృతి చెందినట్లు తెలిపారు. చిన్నారి మృతితో గ్రామంలో విషాదం నెలకొంది.

## కళ్యాణలక్ష్మి పథకం అమలు చేసే వరకు పోరాడుతాం

- మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



**మహేశ్వరం, ఆగస్టు 17 (జనం సాక్షి) :** సీఎం రేవంత్ రెడ్డి ప్రజా సంక్షేమ పథకాలను ఆపుతున్నాడాని మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు.బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం మహేశ్వరం మండల కేంద్రంలో కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ పథకాలను యధావిధిగా కొనసాగించాలని బీఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి ధర్నా చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ...కేసీఆర్ ఆడబిడ్డల సంక్షేమం కోసం కృషి చేశారన్నారు.కేసీఆర్ హయంలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను సీఎం రేవంత్ రెడ్డి నిర్వీర్యం చేస్తున్నారన్నారు.కాంగ్రెస్ పార్టీ రెండున్నర సంవత్సరాల కాలంలో ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాలు చేయలేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకానికి సంబంధించిన డబ్బులు పెండింగ్ లో ఉన్నప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు.కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ తో పాటు తులం బంగారం హామీని మర్చిపోయిందన్నారు.కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ పథకానికి సంబంధించిన కోర్టు వ్యవహారంలో ప్రభుత్వం వెంటనే స్పందించాలన్నారు.పేద ప్రజల ప్రయోజనాలను కాపాడే విధంగా కౌంటర్ దాఖలు చేసి పథకాన్ని నిరంతరాయంగా కొనసాగించాలన్నారు. ఆడబిడ్డల ప్రయోజనాల కోసం గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు చిలుకమర్రి నర్సింహ,పీఏసీఎస్ వైస్ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రాజు నాయక్, నాయకులు కర్రోల్ల చంద్రయ్య ముదిరాజు,పోతర్ల అంబయ్య యాదవ్,ఆనందం,నాగారం గ్రామ సర్పంచ్ లింగం ముదిరాజ్,మహేశ్వరం గ్రామశాఖ అధ్యక్షుడు కటికల మహేష్ ముదిరాజ్,పలువురు బీఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 1న ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

- ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

**చేవెళ్ల, ఆగస్టు 17 (జనంసాక్షి) :** రైతులు, యువత, విద్యార్థులు, కార్మికులు, పేదల సమస్యలపై నిరంతర పోరాటాలు కొనసాగిస్తామని సీపీఐ శాసనమండలి సభ్యులు నెల్లికంటి సత్యం అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సెప్టెంబర్ 1న నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. చేవెళ్లలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించిన అనంతరం సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజా చైతన్య యాత్రను నెల్లికంటి సత్యం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతులు, కార్మికులు, యువత, విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని విమర్శించారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తామని ఇచ్చిన హామీలు అమలు కాలేదని, వ్యవసాయ రంగం సంక్షోభంలో ఉందని అన్నారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉపాధి



కల్పించలేకపోయిందని ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించే విధానాలను సీపీఐ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని తెలిపారు. పోటీ పరీక్షల్లో అవకతవకలు, ప్రశ్నపత్రాల లీకేజీలతో విద్యార్థులు నష్టపోతున్నారని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలను, స్వతంత్ర సంస్థలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని సత్యం డిమాండ్ చేశారు. పెన్షన్ల పెంపు, రైతుల సమస్యల పరిష్కారం, యువతకు ఉద్యోగాలు, మహిళలకు ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వం స్పష్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు. రంగారెడ్డి జిల్లా, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో భూసేకరణ విషయంలో రైతులకు నష్టం కలగకుండా చూడాలని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఐ నిరంతరం పోరాడుతుందని, ప్రజా ఉద్యమాలను మరింత బలోపేతం చేస్తామని సత్యం స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్రచారి, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు పుస్తకాల నర్సింగ్‌రావు, రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు, కే.రామస్వామి, బుద్ధుల జంగయ్య, ఓ.యాదయ్య, టి.రామకృష్ణ, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.ప్రభులింగం, సామెడి శేఖర్ రెడ్డి, వడ్ల సత్యనారాయణ, యాదగిరి, పల్నాటి యాదయ్య, శ్రీదేవి, ప్రజానాట్యమండలి నాయకులు సుధాకర్, క్రాంతి, వంశీవర్ధన్ రెడ్డి, మంజుల, మల్గారి సత్తిరెడ్డి, కే.శ్రీనివాస్, పాలమాకుల శ్రీశైలం, పి. సుధీర్, సుధాకర్‌గౌడ్, మక్బూల్, కే.చంద్‌యాదవ్, కే.వెంకటస్వామి, ఎస్.మల్లేష్, జె. అంజయ్య, బాబురావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## చోరీకి గురైన 8 ద్విచక్ర వాహనాలు స్వాధీనం



**మొయినాబాద్, ఆగస్టు 17 (జనం సాక్షి) :** వాహన చోరీ కేసులపై ప్రత్యేక దర్యాప్తు చేపట్టిన మొయినాబాద్ పోలీసులు 8 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు మహ్మద్ షహబాజ్ (19)తో పాటు ఇద్దరు బాల నిందితులను అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఆదివారం ఉదయం అజీజ్‌నగర్ పాత రహదారిపై అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారించగా వాహన చోరీల వ్యవహారం వెలుగులోకి వచ్చింది. వారి సమాచారం మేరకు హైదరాబాద్‌లోని కాలాపత్తర్ ప్రాంతంలో తనిఖీలు నిర్వహించి మరో ఐదు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వాహనాల రిసీవర్‌గా ఉన్న మహ్మద్ ఇంతియాజ్ (26) వద్ద నుంచి మరో పల్సర్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.
మొత్తం స్వాధీనం చేసుకున్న వాహనాల్లో మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌కు చెందిన ఐదు, చేవెళ్లకు చెందిన రెండు, షాబాద్ పోలీస్‌స్టేషన్‌కు చెందిన ఒక వాహనం ఉన్నట్లు పోలీసులు తెలిపారు. హోండా డియోకు సంబంధించిన ఇంజిన్, రెండు చక్రాలను కూడా స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసులు నమోదు చేసి తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు మొయినాబాద్ పోలీసులు తెలిపారు. వాహన చోరీల్లో మరెవరైనా ఉన్నారా? అనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోందని పేర్కొన్నారు.

## మహబూబ్‌నగర్‌లో అభివృద్ధి ఉండాలి

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 17 (జనంసాక్షి) :** మహబూబ్‌నగర్‌లో అభివృద్ధి ఉండాలి తప్ప రాజకీయాలు ఉండకూడదని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. హైటెక్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ ఎక్సైజ్ కాంట్రాక్టర్ వాల్దాస్ ప్రతాప్ గౌడ్, వారి మిత్రబృందం, వివిధ పార్టీలకు చెందిన సుమారు 2 వేల మంది నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్‌ను గ్రామగ్రామాన బలోపేతం చేసి, ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి కుటుంబానికి చేరేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారం, నియోజకవర్గ అభివృద్ధి, యువతకు అవకాశాలు, విద్య, వైద్యం, మౌలిక వసతుల కల్పనే తమ లక్ష్యమన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం కాకుండా ప్రజలకు మంచి చేయాలనే ఉద్దేశంతోనే పార్టీలోకి ఆహ్వానిస్తున్నామని తెలిపారు. ప్రతాప్ గౌడ్, బాగన్న గౌడ్, జగన్మోహన్ గౌడ్ తదితరుల సేవలను అభినందించారు.



ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, నగర మేయర్ శ్రీమతి గుమ్మాల మమత శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బెక్కరి అనిత మధుసూదన్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వినోద్ కుమార్, ఎన్‌పి వెంకటేష్, సిరాజ్ ఖాద్రి, సిజె బెనహర్, హన్వాడ మండల కాంగ్రెస్ అధ్యక్షులు మహేందర్, గొర్రెల కాపరుల సహకార సంఘం చైర్మన్ శాంతన్న యాదవ్, నాయకులు మైత్రి యాదయ్య, ఓబీసీ సెల్ చైర్మన్ రాజు గౌడ్, ఎస్సీ సెల్ చైర్మన్ బాలయ్య, మహబూబ్‌నగర్ నగర కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలు రద్దు చేయొద్దు

- గద్వాల ఆర్డీవో కార్యాలయం ముందు బిఆర్ఎస్ భారీ ధర్నా



**గద్వాల, ఆగస్టు 17 (జనం సాక్షి) :** తెలంగాణలో బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, తులం బంగారం, రైతు బీమా, రైతు బంధు వంటి సంక్షేమ పథకాలను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం క్రమంగా రద్దు చేసే కుట్ర చేస్తోందని ఆరోపిస్తూ గద్వాల పట్టణ బి ఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు శనివారం భారీ నిరసన ప్రదర్శన చేపట్టారు.గద్వాల ఆర్డీవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి, వెంటనే అన్ని పథకాలను పునరుద్ధరించి పెండింగ్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పేద ఆడపిల్లల పెళ్లిళ్లకు ఆర్థిక భరోసా ఇచ్చిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను, రైతుల జీవనాధారమైన రైతు బంధు, రైతు బీమా పథకాలను నిలిపివేయడం తీవ్ర అన్యాయమని నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన 420 హామీలను గాలికి వదిలేసి, ఇప్పటికే ప్రజలకు మేలు చేస్తున్న పథకాలను కూడా రద్దు చేయాలని చూస్తోందని విమర్శించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ నాయకులు "సంక్షేమ పథకాలు ఆపొద్దు", "రైతు వ్యతిరేక ప్రభుత్వం గద్దె దిగాలి" అంటూ నినాదాలు చేశారు. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పేదలు, రైతుల నడ్డి విరుస్తున్నాయని ఆరోపించారు. ఈ ధర్నాలో వాసు హనుమంత నాయుడు, మాజీ మున్సిపల్ చైర్మన్ బి.ఎస్. కేశవ్, గంజిపేట రాజు, బాసు శ్యామల తో పాటు పట్టణంలోని అన్ని వార్డుల బి ఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్ బకాయిలు చెల్లించి, అన్ని సంక్షేమ పథకాలను యధావిధిగా కొనసాగించాలని లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా మరింత ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# ఖర్గేను అవమానిస్తే కాంగ్రెస్ చూస్తూ ఊరుకోదు

**వికారాబాద్, ఆగస్టు 17 (జనంసాక్షి) :** ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని హల్ద్వానిలో కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే సమావేశం నిర్వహించిన ప్రదేశాన్ని గంగాజలంతో శుద్ధి చేసిన ఘటనను నిరసిస్తూ సోమవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఎన్టీఆర్ చౌరస్తా నుంచి ఎన్నెపల్లి అంబేద్కర్ మార్గం వరకు ర్యాలీ చేపట్టి అనంతరం ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా వికారాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ధారాసింగ్ మాట్లాడుతూ.. బీజేపీ నాయకులు నేటికీ కుల వివక్ష ధోరణితో వ్యవహరిస్తూ అవమానకర సంఘటనలకు పాల్పడటం సిగ్గుచేటని అన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 80 సంవత్సరాలు పూర్తవుతున్న సమయంలో కూడా ఇలాంటి వివక్షపూరిత ఘటనలు చోటుచేసుకోవడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు.కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే పట్ల బీజేపీ నాయకులు వ్యవహరించిన తీరును తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. వివక్ష భావజాలాన్ని దేశంలో పెంచిపోషిస్తూ సమాజాన్ని విభజించే విధానాలను అవలంబిస్తున్న బీజేపీని చూస్తే ఛీ అనిపిస్తోందని ధారాసింగ్ మండిపడ్డారు. ఒకవైపు దేవుళ్ల పేరుతో రాజకీయాలు చేస్తూ.. మరోవైపు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల పట్ల వివక్ష చూపడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. దేశంలో ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు, గౌరవం కల్పించాల్సిన బాధ్యత రాజకీయ పార్టీలపై ఉందన్నారు.ఇలాంటి వివక్ష ధోరణులను కొనసాగిస్తే కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోదని,



ప్రజల పక్షాన నిలబడి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని బీజేపీని ధారాసింగ్ హెచ్చరించారు. కుల, మత వివక్షలకు తావులేకుండా ప్రజలందరూ ఐక్యంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాకేష్ రెడ్డి, వివిధ మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# యువతను దేశాభివృద్ధిలో భాగస్వాములను చేయాలి

- మేరా యువభారత్ పోర్టల్‌లో యువత నమోదు చేసుకోవాలి
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**గద్వాల నడిగడ్డ, ఆగస్టు 17 (జనం సాక్షి) :** యువతకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తూ, మంచి పౌరులుగా తీర్చిదిద్దేందుకు సమిష్టి కృషి అవసరమని, యువతను దేశాభివృద్ధిలో భాగస్వామ్యం చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. సోమవారం ఐడిఓసి సమావేశపు మందిరంలో మై భారత్ ప్రతినిధులు సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. యువతను దేశాభివృద్ధిలో భాగస్వాములను చేయడంతో పాటు, వారిని బాధ్యతాయుతమైన మంచి పౌరులుగా తీర్చిదిద్దేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని యువజన శాఖ ప్రతినిధులను కలెక్టర్ కోరారు. జిల్లాలో యువజన కార్యక్రమాల నిర్వహణ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై యువతకు వివిధ శాఖల సహకారంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం యువజన శాఖ ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. ప్రతి సంవత్సరం



జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, విద్య, పంచాయతీరాజ్, పరిశ్రమలు, తదితర శాఖలను సమన్వయం చేసుకుని యువతకు ఉపయోగకరమైన కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. యువతలో ఆరోగ్యం, విద్య, ఉపాధి, సామాజిక బాధ్యత, ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంపొందించేందుకు ఆయా శాఖల అధికారులు తమ సూచనలు, సహకారం అందించాలని కోరారు. యువతను వివిధ కార్యక్రమాల్లో భాగస్వాములను చేయడం ద్వారా వారిలో నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత పెంపొందించవచ్చని పేర్కొన్నారు. వికసిత్ భారత్ లక్ష్య సాధనలో యువత కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని తెలిపారు. యువతను దేశ నిర్మాణంలో భాగస్వాములను చేసి, వారికి సరైన మార్గనిర్దేశం అందించడం ద్వారా భవిష్యత్ తరాలను మరింత బాధ్యతాయుతంగా తీర్చిదిద్దవచ్చన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంలో యువతను భాగస్వాములను చేయడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. యువతకు అందుబాటులో ఉన్న అవకాశాలు, కార్యక్రమాలను వినియోగించుకునేందుకు మేరా యువ భారత్ పోర్టల్‌లో యువత తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గ్రామ పంచాయతీలు, పరిశ్రమల శాఖతో పాటు ఇతర శాఖలు కూడా తమ పరిధిలోని యువతకు పోర్టల్‌పై అవగాహన కల్పించి, రిజిస్ట్రేషన్ చేయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా అభివృద్ధి కోసం అన్ని శాఖలు, యువజన సంఘాలు, గ్రామ పంచాయతీలు, యువత సమన్వయంతో పనిచేస్తే మరింత మెరుగైన ఫలితాలు సాధించవచ్చని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మధుమోహన్, మై భారత్ జిల్లా సమన్వయకర్త కోటా నాయక్, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి www.janamsakshi.org | మంగళవారం 18 ఆగస్టు 2026

# స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీలో తెలంగాణ నంబర్‌వన్

- పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం
- మంత్రి వివేక్ వెంకటస్వామి

**మెదక్ బ్యూరో, ఆగస్టు 17 (జనం సాక్షి) :** దేశంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీలో తెలంగాణ రాష్ట్రం నంబర్ వన్‌గా నిలిచిందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. సోమవారం మెదక్ కలెక్టరేట్‌లో మహిళలకు స్మార్ట్ రేషన్ కార్డులను మంత్రి వివేక్ వెంకటస్వామి, మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్‌రావు, జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో మహిళలు, పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో పావలా వడ్డీ రుణాల పథకం ప్రారంభమైందని గుర్తుచేశారు. ఇప్పటివరకు మహిళలకు రూ.23 వేల కోట్ల రుణాలు అందించామని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో పాటు ఈవీ వాహనాలను కూడా అందిస్తున్నామని పేర్కొన్నారు. పేదలకు సన్నబియ్యం అందిస్తున్నామని, పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తున్నామని మంత్రి తెలిపారు. త్వరలో విద్యార్థులకు ఉచిత టిఫిన్ అందించే కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు వెల్లడించారు. ప్రతి సంక్షేమ పథకం పేదలకు ఉపయోగపడేలా చూడడమే ప్రజా ప్రభుత్వ



సంకల్పమన్నారు. గత ఏడాది 3 వేల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని, ఈ ఏడాది మరో 2,500 ఇళ్లు అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోని ఏ గ్రామంలోనూ పెంకుటిళ్లు కనిపించకుండా పక్కా ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10 లక్షల వరకు ఉచిత వైద్యం అందిస్తున్నామని, విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు, తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. పేదలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని తెలిపారు. స్మార్ట్ రేషన్ కార్డుల్లో కుటుంబ సభ్యుల పూర్తి వివరాలు పొందుపరిచామని, దేశంలో ఇలాంటి విధానం ఎక్కడా అమలులో లేదని మంత్రి పేర్కొన్నారు. గతంలో రేషన్ కార్డుల విషయంలో జరిగిన అవకతవకలకు ఇకపై అవకాశం ఉండదన్నారు. భూగర్భ గనుల శాఖ ద్వారా రూ.1,000 కోట్ల ఆదాయం సమకూర్చామని తెలిపారు. మహిళలకు నెలకు రూ.2,500 అందిస్తామని ఇచ్చిన హామీని తప్పకుండా అమలు చేస్తామని పునరుద్ఘాటించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని మంత్రి అన్నారు.

### ప్రజా సంక్షేమానికి పెద్దపీట

మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్‌రావు మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. గత ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డు కూడా మంజూరు చేయలేదని ఆరోపించారు. ఇందిరమ్మ ప్రభుత్వంలో మహిళలకు మహాలక్ష్మి పథకం, పేదలకు సన్నబియ్యం, ఉచిత విద్యుత్, సబ్సిడీ సిలిండర్ వంటి పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి అంబాదాస్ రాజేశ్వర్, అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసిని రెడ్డి, ట్రైనీ ఆర్డీవో అహ్మద్ మొహమ్మద్, మెదక్, రామాయంపేట, తూప్రాన్ మున్సిపల్ చైర్‌పర్సన్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## శిశు గృహంలో ఉన్న అనాథ పిల్లలను దత్తత తీసుకున్న దంపతులు



**సిద్దిపేట బ్యూరో, ఆగస్టు 17 (జనంసాక్షి) :** జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యం లో సిద్దిపేట జిల్లాలో సోమవారం రోజున సిద్దిపేట శిశు గృహాలో ఉన్న పిల్లలను కేరళ, కర్ణాటక, తెలంగాణ,రాష్ట్రాలకు చెందిన దంపతులకు సిద్దిపేట జిల్లా కలెక్టర్ కే. హైమావతి చేతుల మీదుగా అధికారికంగా దత్తతను ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమం సిద్దిపేట జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కలెక్టర్ తల్లిదండ్రులతో మాట్లాడుతూ పిల్లలను బాగా చదివించాలి తనకు ఇష్టమైన రంగంలో ప్రోత్సహం ఇవ్వాలి పిల్లలకు బంగారు భవిషత్ కు బాట వేసే పూర్తి బాధ్యత మీదే అని చెప్పడం జరిగింది మరియు జిల్లాలోని పిల్లలు లేని దంపతులు దత్తత తీసుకోవాలనుకుంటే సిద్దిపేటలో గల శిశు గృహ/ జిల్లా బాలల పరిరక్షణ విభాగం ద్వారా అధికారికంగా దరఖాస్తు చేసుకోవాలని తద్వారా ఎలాంటి న్యాయపరమైన ఇబ్బందులు ఉండవని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి, శారద , జిల్లా బాలల పరిరక్షణ అధికారి రాము మరియు శిశు గృహ మేనేజర్ రాజు, సామాజిక కార్యకర్త రాజారాం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## డీసీసీ ఎన్నికకు ప్రణాళికను సిద్ధం చేయాలి



**సంగారెడ్డి, ఆగస్టు 18 (జనం సాక్షి) :** ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున కర్గే ఆదేశాల అనుసరం డిసిసి ఎన్నికల ప్రణాళిక కోసం జిల్లాల వారీగా కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు నాయకులు ప్రణాళిక ప్రక్రియ సిద్ధం చేసి ఇవ్వాలని సంగారెడ్డి జిల్లా 5 నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ నాయకుల అభిప్రాయ సేకరణ చేసేందుకు డిసిసి ఎన్నికల బృందం ప్రతి నియోజకవర్గంలో పూర్తిస్థాయిలో ప్రణాళికను సిద్ధం చేసే విధంగా రూపకల్పన చేపట్టి దాని అన్నారు. సోమవారం సంగారెడ్డి పట్టణంలోని డిసిసి ఎన్నికల బృందం ఇంచార్జ్ దీపక్ రాథోడ్ విలేకరుల సమావేశంలో ఆయన వివరించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసిసి ఎన్నికల భాగంగా కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులకు నాయకులకు మరియు ఎలాంటి కులమత వేయడం లేకుండా డిసిసి ఎన్నికల ప్రణాళిక కోసం సిద్ధం కావాలని అభిప్రాయ సేకరణ ద్వారా డిసిసి ఎన్నుకోబడుతుందని అన్నారు ప్రణాళిక పత్రాలను తీసుకొని పూర్తిస్థాయిలో అభిప్రాయాన్ని తెలుపాలని కోరారు అక్టోబర్ 6న అభిప్రాయ సేకరణ ఏఐసిసి పంపిస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో బృందం నాయకులు శ్రీనివాస్ ,శారద, డాక్టర్ రియాజ్ పాల్గొన్నారు.

## మెదక్ ఖిల్లాకు అరుదైన గౌరవం

- ప్రత్యేక పోస్టల్ కవర్ ఆవిష్కరణ

**మెదక్ టౌన్, ఆగష్టు 17 (జనం సాక్షి) :** మెదక్ తెలంగాణ చారిత్రక వైభవానికి ప్రతీకగా నిలిచిన మెదక్ ఖిల్లాకు మరో అరుదైన గౌరవం దక్కింది. భారతీయ తపాలా శాఖ మెదక్ కోట చారిత్రక ప్రాధాన్యతను గుర్తిస్తూ ప్రత్యేక పోస్టల్ కవర్‌తో పాటు స్మారక ముద్రను ఆవిష్కరించింది. ఈ సందర్భంగా మెదక్ ఖిల్లా విశిష్టతను దేశవ్యాప్తంగా, అంతర్జాతీయ స్థాయిలో పరిచయం చేయాలనే లక్ష్యంతో ఈ ప్రత్యేక కవర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. తెలంగాణలోని ప్రముఖ కొండకోటల్లో ఒకటైన మెదక్ ఖిల్లాకు మరింత విస్తృత గుర్తింపు తీసుకురావడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని తెలిపారు. ప్రత్యేక పోస్టల్ కవర్ ద్వారా మెదక్ కోట చరిత్ర, కాకతీయుల శిల్పకళా వైభవం దేశవ్యాప్తంగా ఉన్న ప్రజలకు, ఫిలాటెలిస్టులకు, పర్యాటకులకు చేరువవుతుందని పేర్కొన్నారు.

### కాకతీయుల శిల్పకళకు ప్రతీక

మెదక్ ఖిల్లా సుమారు 12వ శతాబ్దంలో కాకతీయుల కాలంలో నిర్మించబడినట్లు చారిత్రక ఆధారాలు చెబుతున్నాయి. ఎత్తైన కొండపై సహజసిద్ధమైన రక్షణతో నిర్మించిన ఈ కోట అప్పటి సైనిక వ్యూహాలకు ప్రతీకగా నిలుస్తోంది. కోటలోని సింహద్వారం, ఏనుగుద్వారం వంటి నిర్మాణాలు కాకతీయుల



శిల్పకళా నైపుణ్యాన్ని చాటుతున్నాయి.

మెదక్ ఖిల్లా ప్రత్యేక పోస్టల్ కవర్‌పై చోటు దక్కించుకోవడం జిల్లా చరిత్రకు గర్వకారణమని జిల్లా ప్రజలు, చరిత్రకారులు, పర్యాటక ప్రియులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కవర్ ద్వారా మెదక్ జిల్లా చారిత్రక, సాంస్కృతిక ప్రాధాన్యత ప్రపంచవ్యాప్తంగా మరింతగా పరిచయం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

స్థానికంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో మెదక్ ఎంపీ రఘునందన్ రావు, ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు, తపాలా శాఖ అధికారి విజయ్ కుమార్‌తో పాటు డీటీఓ, ఆర్డీఓ, మున్సిపల్ కమిషనర్, మేనేజర్, మున్సిపల్ చైర్మన్ కానుగు రాధిక భూపతి రాజు, మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్ తదితరులు పాల్గొని ప్రత్యేక పోస్టల్ కవర్‌ను అధికారికంగా ఆవిష్కరించారు.

## ఉపాధ్యాయ విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

- తపస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీధర్ రెడ్డి



**మల్దకల్, ఆగష్టు 17 (జనంసాక్షి) :** తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ధరూర్ మండల కేంద్రంలోని సోమవారం పాఠశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది.ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షులు ఐ శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ పిఆర్సి ని వెంటనే ప్రకటించి పెండింగ్లో ఉన్న ఆరు డిఏలతో సహా పెండింగ్ బిల్లును వెంటనే సత్వరం పరిష్కారం చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.వార్షిక ప్రమోషన్ క్యాలెండర్ ను విడుదల చేయాలి కోరారు. సిపిఎస్ ను రద్దు చేయాలి. 190 జీవోనువిద్యాశాఖలో తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు,సహా అధ్యక్షులు జగన్ మోహన్ రెడ్డి,తపస్ మండల అధ్యక్షులు ఆంజనేయులు,ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్,తపస్ బాధ్యులు వెంకటేష్,రాఘవాచారి,రవి రాము,సురేష్ లు పాల్గొన్నారు.

## రెండేళ్ల చిన్నారిపై లైంగిక దాడికి యత్నం

**అమీన్పూర్, ఆగస్టు 17 (జనం సాక్షి) :** రెండేళ్ల చిన్నారిపై ఓ వ్యక్తి లైంగిక దాడికి యత్నిస్తుండగా స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించిన సంఘటన అమీన్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గండిగూడలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. అమీన్పూర్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ రెడ్డి తెలిపిన వివరాలు ప్రకారం ఆదివారం రాత్రి సమయంలో, నిందితుడు ఉత్తరప్రదేశ్ కాన్పూర్ నగర్, ఘటంపూర్ కు చెందిన రఘునాథ్ 48 ప్రస్తుతం దీపక్ బ్రిక్స్ బ్లాక్ కంపెనీ ఉంటున్నాడు. గండిగూడెం చౌరస్తాకు చెందిన 2 ఏళ్ల చిన్నారిని, ఆమె ఇంటి ముందు ఆడుకుంటుండగా అక్కడి నుండి తీసుకువెళ్లాడు. అతను ఆ చిన్నారిని ఇలాపూర్ తండా శివార్లలోని ఒక నిర్మానుష్య ప్రాంతానికి తీసుకువెళ్లి, ఆమెపై లైంగిక దాడికి యత్నించాడు. అదే సమయంలో, చిన్నారి ఏడుపు విని, బొల్లారం గ్రామంలో పని ముగించుకుని ఇంటికి వెళ్తున్న శశి కుమార్ సంఘటనా స్థలానికి వెళ్లాడు. అక్కడ నిందితుడు చిన్నారిపై లైంగిక దాడికి ప్రయత్నించడాన్ని అతను గమనించాడు. శశి కుమార్ ఆ చిన్నారిని రక్షించి, నిందితుడిని అతని చర్య గురించి ప్రశ్నించాడు. అలాగే తన స్నేహితుడు నవీన్‌కు ఫోన్ చేసి, చిన్నారిని రక్షించాడు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడికి చేరుకొని అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు పోలీసులు నిదితుడు రఘునాథ్ ను అదుపులోకి తీసుకుని పోక్సో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యే లక్ష్యం

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- తెల్లాపూర్‌లో రూ.48 కోట్లతో క్యూర్ అర్బన్ స్కూల్‌కు శంకుస్థాపన..

**రామచంద్రాపురం, అగస్టు 17 (జనం సాక్షి) :** పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులకు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యమని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం తెల్లాపూర్ డివిజన్‌లోని సర్వే నంబర్ 323లో రూ.48 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న క్యూర్ అర్బన్ స్కూల్‌కు ఆయన శంకుస్థాపన చేశారు. ఎకరా విస్తీర్ణంలో నిర్మించనున్న పాఠశాలలో ప్రీ-ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు ఒకే ప్రాంగణంలో విద్యాబోధన కొనసాగుతుందని ఎమ్మెల్యే తెలిపారు. డిజిటల్ తరగతి గదులు, ఆధునిక సైన్స్, కంప్యూటర్ ల్యాబ్‌లు, గ్రంథాలయం, విశాలమైన ఆటస్థలాలు తదితర సౌకర్యాలు కల్పించనున్నట్లు చెప్పారు.

### సమగ్ర వికాసానికి ప్రాధాన్యం

చదువుతో పాటు క్రీడలు, సాంకేతిక పరిజ్ఞానం, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, సృజనాత్మకతకు ప్రాధాన్యం ఇస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. విద్యార్థుల ఆర్థిక పరిస్థితి వారి భవిష్యత్తుకు అడ్డంకి కాకూడదన్న ఉద్దేశంతో విద్యారంగానికి ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు.

### పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా..



తెల్లాపూర్, పరిసర ప్రాంతాల్లో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆధునిక పాఠశాల అవసరం ఉందన్నారు. పాఠశాల అందుబాటులోకి వస్తే వందలాది మంది పేద, మధ్యతరగతి విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు.

### నాణ్యతతో పనులు పూర్తి చేయాలి

నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. పనుల్లో ఎలాంటి నాణ్యతా లోపాలకు తావివ్వకూడదని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సోమిరెడ్డి, రాములు గౌడ్, దేవేందర్‌యాదవ్, మల్లారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ బుచ్చిరెడ్డి, మాజీ కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను కొనసాగించాలి



**ధన్వాడ, ఆగస్టు 17 (జనం సాక్షి) :** బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కల్వకుంట్ల తారక రామారావు, నారాయణపేట జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు ఎస్. రాజేందర్‌రెడ్డి పిలుపు మేరకు ధన్వాడ మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో సోమవారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ముందుగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విగ్రహం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల నాయకులు మాట్లాడుతూ కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ఈ పథకాలపై హైకోర్టు నాలుగుసార్లు గడువు ఇచ్చినప్పటికీ ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని ఆరోపించారు. పేదల సంక్షేమానికి ఉపయోగపడుతున్న ఈ పథకాలను రద్దు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని విమర్శించారు. కేవలం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై కక్షతో ఆయన హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను కనుమరుగు చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని నాయకులు ఆరోపించారు. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. పథకాలను కొనసాగించకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ధన్వాడ మండల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగ విలువలను కాపాడాలి

- డిసీసీ అధ్యక్షులు కె. ప్రశాంత్ కుమార్ రెడ్డి
- హల్ద్వానీ ఘటనపై పేటలో కాంగ్రెస్ సత్యాగ్రహం

**నారాయణపేట జిల్లా బ్యూరో, ఆగస్టు 17 (జనం సాక్షి) :** ఉత్తరఖాండ్ రాష్ట్రం లోని హల్ద్వానీ లో జరిగిన కులావివక్ష ఘటనకు నిరస నగా ఏఐసీసీ, టిపిసిసి కమిటీ పిలుపు మేరకు సోమవారం నారాయణ పేట జిల్లా కేంద్రంలో డీసీసీ అధ్యక్షులు కె.ప్రశాంత్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ సత్యాగ్రహ మహాధర్నా నిర్వహించా రు.సీవీఆర్ భవన్ నుంచి కాంగ్రెస్ నాయకు లు,కార్యకర్తలు భారీ ర్యాలీగా అంబేద్కర్ చౌరస్తా వరకు పాదయాత్ర నిర్వ హించారు.అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళుల ర్పించిన అనంతరం అక్కడే సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షులు కె.ప్రశాంత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ హల్ద్వానీలో కాంగ్రెస్ జాతీ య అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే పాల్గొన్న సభ అనంత రం జరిగిన ఘటన అత్యం త బాధాకరమన్నారు.ప్రజా సభ జరిగిన ప్రదేశాన్ని 'శుద్ధీకరణ' పేరుతో బిజెపి పార్టీ కి చెందిన కొందరు సానుభూతి పరులు గంగ జాలం తో శుభ్రం చేయడం కుల వివక్షకు సంబంధిం చిన ఆలోచనలకు తావిచ్చే చర్యగా కనిపిస్తోందన్నా రు.ఈ ఘటనను తీవ్రంగా ఖండించారు.రాజకీయ విభేదాలు ఎన్ని ఉన్నా ఒక వ్యక్తి కులం ఆధారంగా అతని గౌరవాన్ని కించపరిచే చర్యలు జరగడం బాధా కరమన్నారు.అంటరానితనాన్ని రాజ్యాంగం నిషేధించి నప్పటికీ ఇలాంటి ఘటనలు బిజెపి పార్టీ ప్రోత్సహిం చడంసిగ్గుచేటన్నారు.మల్లికార్జున్ ఖర్గే గారికి జరిగిన అవమానం ఒక్క వ్యక్తికి జరిగిన అవమానం కాదని,కుల వివక్షకు వ్యతి రేకంగా పోరాడుతున్న ప్రతి ఒక్కరికీ జరిగిన అవమాన మని అన్నారు.ఈ ఘటన కు బీజేపీకి చెందిన కొందరు సానుభూతిపరుల ప్రమే యం ఉందని దీనిపై బీజేపీ నాయకత్వం ఘటనను బహిరంగంగా ఖండిం చి,సమగ్ర విచారణకు సహకరించాలని డిమాండ్ చేశారు.కుల వివక్షను ప్రోత్సహించే చర్యలకు ఎవరి మద్దతు ఉన్నా కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని స్పష్టం చేశారు.ఘటనకు బాధ్యు లు ఎవరైనా చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఇలాంటి సంఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ సత్యాగ్రహ దీక్షను జిల్లా కేంద్రానికే పరిమితం చేయ కుండా ప్రతి మండలం,ప్రతి గ్రామానికి తీసుకెళ్లాలి ఈ ఘటన ను ఖండించాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపు నిచ్చారు. ముసాయిదా ఓటర్ల జాబితా వచ్చినప్పుడు కాంగ్రెస్ శ్రేణులు అప్రమ త్తంగా ఉండాలని సూచించారు. అర్హులైన ఒక్క ఓట రు పేరు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా నిబంధనల ప్రకారం పరిశీలించాలని కోరారు.బూత్ స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని పిలుపునిచ్చారు.బీఎల్ఏలు ఒక్కరే అన్నీ



చేయలేరని, ప్రతి కాంగ్రెస్ నాయకుడు ఇందులో భాగస్వామి కావాలన్నారు. ఈ కార్యక్రమంలో పేట,కోస్గి, మక్తల్ మార్కెట్ చైర్మన్ లు శివారెడ్డి, భీము లు,రాధ లక్ష్మరెడ్డి,జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి. సలీం,జిల్లా అధికార ప్రతినిధి సంతోష్,క్రమశిక్షణ సంఘం జిల్లా అధ్యక్షులు గాజుల శివకుమార్,ఎస్సి సెల్ జిల్లా అధ్యక్షులు వెంకటయ్య,మండల, పట్టణ అధ్యక్షులు కోట్ల.రవీందర్ రెడ్డి,వెంకటేష్ గౌడ్,అనంద్, విజ్జప్ప గౌడ్,సూర్య ప్రకాష్రెడ్డి, శివరాంరెడ్డి,బాలయ్య,మాజీ మార్కెట్ చైర్మన్లు బండి వేణుగోపాల్, సుధాకర్, ఎండి.గౌస్, నరహరి, వైస్ చైర్మన్ కె. హన్మం తు, బోయ.శరణప్ప,పళ్ళ అనిల్,పిఏసిఎస్ చైర్మన్ ఈదప్ప,నిరంజన్ రెడ్డి కౌన్సిలర్లు రాజేష్ ఘూట్, కుర్వ మనోజ్,శంకర్,ఉగ్గు రాజు,ఆర్టివో బోర్డ్ డైరెక్టర్ పోషల్ రాజేష్,యూత్ జిల్లా అధ్యక్షులు కోట్ల.మధుసూదన్ రెడ్డి,యూత్ మండల అధ్యక్షులు మహేష్, సర్ఫరాజ్, వేణు గౌడ్,అఖిల్ రెడ్డి,యస్సి సెల్ మండల అధ్యక్షులు చంద్రయ్య,శ్రీను,చందర్, రాజేష్,రాములు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల సమస్యలు పరిష్కరించాలి

- ప్రజావాణిలో ప్రధానోపాధ్యాయులు వినతి




**కృష్ణ, ఆగస్టు 17 (జనం సాక్షి) :** కృష్ణ మండలం ముడుమాల్, పాఠశాలలో ఉన్న సమస్యలు పరిష్కరించి విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలని కోరుతూ ప్రధానోపాధ్యాయులు దండు శేఖర్ వినతి. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో వినతి పత్రం సమర్పించారు.శిథిలావస్థకు చేరి కూలుటకు సిద్ధంగా ఉన్న స్లాబ్ లను తొలగించాలని,విద్యార్థుల సంఖ్యను అనుగుణంగా అదనపు తరగతి గదులను నిర్మించాలని, మూత్రశాలల మంజూరు చేయాలని విద్యావాలంటీర్లను నియమించాలని,పాఠశాల ప్రాంగణ ముందు భాగంలో శిథిలమైన భవనం నుండి క్రిమీ కీటకాలు సంచరిస్తున్నాయని అభవనాన్ని తొలగించి శుభ్రం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్పర్సన్ జయమ్మ పాల్గొన్నారు.

# దొంగల ఆటకు టైగర్స్ టాస్క్‌ఫోర్స్ చెక్



- 25 చోరీ కేసుల్లో ఐదుగురి హస్తం..
- 16 కేసుల్లో సొత్తు రికవరీ : ఏఎస్పీ సాయి కిరణ్

**నిర్మల్ బ్యూరో, ఆగస్టు 17 (జనంసాక్షి) :** జిల్లాలో వరుసగా జరుగుతున్న ఆలయాలు, ఇళ్ల చోరీలకు టైగర్స్ టాస్క్‌ఫోర్స్ ద్వారా చెక్ పెట్టినట్లు భైంసా ఏఎస్పీ సాయి కిరణ్, తెలిపారు. సోమవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లా ఎస్పీ డాక్టర్ జి.జానకి షర్మిల ఆదేశాలతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి చోరీ కేసులపై దర్యాప్తు చేపట్టినట్లు చెప్పారు. సీసీ కెమెరా ఫుటేజీలు, సాంకేతిక ఆధారాలు, నిందితుల కదలికలు, గత నేరాల వివరాలను విశ్లేషించి ఐదుగురు నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వీరికి జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో నమోదైన 25 దొంగతనం కేసులతో సంబంధం ఉన్నట్లు గుర్తించామని, ఇప్పటికే 16 కేసుల్లో చోరీ సొత్తును రికవరీ చేసినట్లు వెల్లడించారు. నిందితులు రాజశేఖర్, రాజేశ్వర్, శ్రీకాంత్, రామ్‌చరణ్, క్రాంతిగా గుర్తించినట్లు ఏఎస్పీ తెలిపారు. వారి వద్ద నుంచి 3 ద్విచక్ర వాహనాలు, 7.5 గ్రాముల బంగారం, 300 గ్రాముల వెండి, 5 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిర్మల్ పట్టణంతో పాటు రూరల్, మామడ, సారంగాపూర్, లోకేశ్వరం, లక్ష్మణచాంద, తానూర్ ప్రాంతాల్లో జరిగిన పలు ఆలయ చోరీలు, హౌస్ బ్రేకింగ్ కేసులను ఛేదించినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని గన్నవరం, ఏలూరు ప్రాంతాల్లో జరిగిన ఆలయ చోరీల్లోనూ నిందితుల ప్రమేయాన్ని గుర్తించినట్లు వెల్లడించారు. టైగర్స్ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసిన అనంతరం గత పది రోజుల్లోనే పలు చోరీ కేసులను ఛేదించామని, కాపర్ వైర్, మొబైల్ ఫోన్, బైక్ చోరీలతో పాటు హౌస్ బ్రేకింగ్ కేసుల్లోనూ నిందితులను అరెస్టు చేసి సొత్తును స్వాధీనం చేసుకున్నామని ఏఎస్పీ తెలిపారు. దొంగతనాల నియంత్రణకు ప్రత్యేక నిఘా కొనసాగుతుందని, ఆలయాలు, ఇళ్లు, దుకాణాలను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సాయి కిరణ్ స్పష్టం చేశారు.

# కల్లుగీత కార్మికుల హక్కులకు పోరాడుతాం

- కేజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రమణ గౌడ్




**ములుగు,ఆగస్టు17(జనం సాక్షి):** కల్లుగీత కార్మికుల సమస్యలే ధ్యేయంగా కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఆగస్టు 2 నుండి 18 వరకు జరుగు రాష్ట్ర చైతన్యములుగు బస్సు యాత్రలో భాగంగా సోమవారం రోజున ములుగు జిల్లాకు రావడం జరిగింది.ఈ సందర్భంగా డిఎల్ఆర్ ఫంక్షన్ హాల్ నుండి 400 మంది కల్లుగీత కార్మికులతో భారీ యాత్ర నిర్వహిస్తూ తంగేడు గ్రౌండ్ లోని రైతు వేదిక కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహిస్తూ రైతు వేదికలో సభను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు గుండబోయిన రవి గౌడ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన కేజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.వి.రమణ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మూడు సంవత్సరాల క్రితం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఇప్పటికైనా అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే పెండింగ్లో ఉన్న 20 కోట్ల ఎక్స్‌గ్రేసియాలు తక్షణమే విడుదల చేయాలని ఏజెన్సీ ఏరియాలో రద్దయిన సొసైటీలను తక్షణమే ముఖ్యమంత్రి సమీక్ష జరిపి సొసైటీలను పునరుద్ధరణ చేయాలని వృత్తిపించెను అందరికీ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ములుగు జిల్లా కేంద్రంలో సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహం ఏర్పాటు చేయాలని జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న పేరు పెట్టాలని వారు కోరారు.ప్రభుత్వం ఇప్పటికైనా కల్లుగీత కార్మికుల సమస్యలపై స్పందించ కుంటే బస్సు యాత్ర స్ఫూర్తితో కల్లుగీత కార్మికుల హక్కులపై పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు జిల్లా సంఘం జిల్లా అధ్యక్షులు గొల్లపల్లి రాజేందర్ గౌడ్,ఇంచర్ల సర్పంచ్ ముసినిపల్లి కుమార్ గౌడ్,ములుగు జిల్లా కార్యదర్శి బుర్ర శ్రీనివాస్ గౌడ్,సోషల్ మీడియా కన్వీనర్ ఉయ్యాల మధుకర్ గౌడ్, జిల్లా గౌరవాధ్యక్షులు పులి నరసయ్య గౌడ్,జిల్లా కమిటీ సభ్యులు జిల్లా ఉపాధ్యక్షులు రంగు సత్యనారాయణ గౌడ్,గాజుల ఈశ్వర్ గౌడ్, పులి రమేష్ గౌడ్,లోడే శ్రీనివాస్ గౌడ్, నక్క యాకయ్య గౌడ్,పాలకుర్తి శ్రీధర్ గౌడ్,తాటి లచ్చులు గౌడ్,తిర్రి సంపత్ గౌడ్, వత్సవాయి సారయ్య గౌడ్,రుద్ర బోయిన మల్లేష్ గౌడ్,మునిగాల సురేష్ గౌడ్, కూనూరు సాగర్ గౌడ్,చేవుగాని స్వప్న గౌడ్, గట్టు శంకర్ గౌడ్,గట్టు శ్రీనివాస్ గౌడ్ మెరుగు మల్లయ్య గౌడ్, బుర్ర సదానందం గౌడ్ లు తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్ ఎదుట బీఆర్ఎస్ నాయకుల ధర్నా



**నస్పూర్ (జనంసాక్షి):** కాంగ్రెస్ ప్రభుత్వం కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను నిలిపి వేస్తుందంటూ నిరసిస్తూ జిల్లా కార్యాలయం ముందు బిఆర్ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నడిపెల్లి విజిత్ కుమార్ సోమవారం రోజున ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన 420 హామీలు మరచి కేవలం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని అన్నారు.గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన కళ్యాణ లక్ష్మి,షాది ముబారక్ పథకాలలో నిలిపివేయడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తుందని అన్నారు.కళ్యాణ లక్ష్మి,షాది ముబారక్ పథకాలను యధావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ పథకాలను కొనసాగించకపోతే ప్రజల పక్షాన బిఆర్ఎస్ పార్టీ ప్రభుత్వంపై పోరాడుతుందని తెలిపారు.అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ కళ్యాణ లక్ష్మి,షాది ముబారక్ పథకాలపై జిల్లాలో జరుగుతున్న నిరసనలను కలెక్టర్ తో మాట్లాడి ప్రభుత్వానికి తెలియజేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు,మాజీ ప్రజా ప్రతినిధులు, మహిళా నాయకులు, టీబీజీకేఎస్ నాయకులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, విద్యార్థి విభాగం నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



## 30 క్వింటాళ్ల బియ్యం పట్టివేత

**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 17(జనంసాక్షి ):** కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో సోమవారం విశ్వసనీయ సమాచారం ప్రకారం రాజ్ కుమార్ డిటి ఎన్ఫోర్స్మెంట్, అనిల్ కుమార్ ఎస్సై పెంచికలపేట సంయుక్తంగా తనిఖీలు నిర్వహించగా దహేగాం మండలంలోని చిన్న రాసపల్లి చుట్టుపక్కల గ్రామాల కార్డుదారుల నుండి కొనుగోలు చేసిన 60 బస్తాలు సుమారు 30 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యాన్ని టాటా పికప్ వాహనం ద్వారా అక్రమంగా తరలిస్తుండగా పెంచికల పేట వద్ద పట్టుకోవడం జరిగింది. నిందితులు కాగజ్ నగర్ కు చెందిన ఖాజా,అస్లాం హుస్సేన్ లపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ప్రభుత్వం ద్వారా ఉచితంగా అందించబడుతున్న పిడిఎస్ బియ్యాన్ని దుర్వినియోగం చేసినట్లయితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది అని, ఇటువంటి కార్యక్రమాలకు పాల్పడిన వారికి కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.

## బెస్తవారిపేటలో 56 కోతులు పట్టివేత



**నిర్మల్ టౌన్, ఆగస్టు 17 (జనంసాక్షి) :** పట్టణ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న కోతుల బెడద నివారణకు మున్సిపల్ అధికారులు చేపట్టిన ప్రత్యేక కోతుల పట్టివేత కార్యక్రమం రెండో రోజూ విజయవంతంగా కొనసాగింది. నిర్మల్ పట్టణంలోని 25వ వార్డు బెస్తవార్పేట్‌లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో మొత్తం 56 కోతులను పట్టుకున్నారు. అనంతరం వాటికి రంగులు చల్లి గుర్తింపు చేసి, కవ్వాల్ అటవీ ప్రాంతానికి సురక్షితంగా తరలించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక కౌన్సిలర్ లక్కాకుల హరీష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్, కాలనీ వాసులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు. కోతుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా చర్యలు కొనసాగుతాయని అధికారులు తెలిపారు.

# 19న ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ భూపాలపల్లి పర్యటన

- అధికారులతో సమీక్షిస్తామని కలెక్టర్ వెల్లడి..

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ అధ్యక్షుడు బక్కి వెంకటయ్య ఈ నెల 19న జిల్లాలో పర్యటించనున్నట్లు కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. 19న ఉదయం 11 గంటలకు కలెక్టరేట్ లో ఎస్సీ, ఎస్టీ సంక్షేమం, దాడుల కేసుల విచారణ, రోస్టర్ అమలు, బ్యాక్ లాగ్ ఖాళీల భర్తీపై సమీక్షిస్తామన్నారు. అన్ని శాఖల అధికారులు నివేదికలతో హాజరు కావాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, డిఆర్వో వసంత కుమారి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# వట్టివాగు ప్రాజెక్ట్ నీళ్లు విడుదల చేయాలని రైతుల ధర్నా

- రైతులకు మద్దతుగా ఎమ్మెల్యే కోవా లక్ష్మీ
- నీళ్ల కోసం కదం తొక్కిన రైతులు




**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 17(జనంసాక్షి ):** కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలోని వట్టివాగు ప్రాజెక్ట్ నీళ్లను రైతుల వరి పొలాల కోసం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు సోమవారం భారీ ఎత్తున ధర్నా కార్యక్రమం నిర్వహించారు. రైతుల ధర్నాకు మద్దతు తెలిపిన ఆసిఫాబాద్ శాసన సభ్యురాలు కోవ లక్ష్మి. ధర్నా స్థలానికి చేరుకొని రైతులతో కలిసి నినాదాలు చేస్తూ, రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శాసన సభ్యురాలు కోవ లక్ష్మీ మాట్లాడుతూ వరి పంట కాపాడుకో వడానికి నీళ్లు ప్రాణాధారం అని,ప్రభుత్వం వెంటనే స్పందించి వట్టివాగు ప్రాజెక్ట్ నుండి నీళ్లు విడుదల చేయాలి అని,రైతుల పక్షాన నేను అండగా ఉంటాను అని అన్నారు. ధర్నాలో ఆసిఫాబాద్ ప్రాంత రైతులు, బీ అర్ ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని రైతులు హెచ్చరించారు.

# జిల్లాలో పని చేసే ప్రతి ఉద్యోగి 'మీ ప్రమాణం' యాప్‌లో నమోదు కావాలి

- సెన్సస్ హ్యాండ్ బుక్‌కు తగిన సమాచారం ఇవ్వాలి
- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



**నిర్మల్ బ్యూరో, ఆగస్టు 17 (జనంసాక్షి) :** జిల్లాలోని ప్రభుత్వ శాఖల్లో పనిచేసే ప్రతి ఉద్యోగి మీ ప్రమాణం ముఖ గుర్తింపు హాజరు యాప్ లో నమోదు కావాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం ఆయన మీ ప్రమాణం యాప్ నమోదు, జిల్లా సెన్సస్ హ్యాండ్ బుక్ రూపకల్పన అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల్లో పనిచేసే ప్రతి స్థాయి రెగ్యులర్, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు మీ ప్రమాణం యాప్ ద్వారానే హాజరు నమోదు చేసుకోవాలన్నారు. ఇప్పటివరకు నమోదు కాని శాఖలు వెంటనే నమోదు చేసుకోవాలని ఆదేశించారు. మీ ప్రమాణం హాజరు నమోదులో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాఖాధిపతులు తప్పనిసరిగా ఎప్పటికప్పుడు సిబ్బంది హాజరు వివరాలు పర్యవేక్షిస్తూ ఉండాలని సూచించారు. జిల్లా సెన్సస్ హ్యాండ్ బుక్ రూపకల్పన కోరకు, సంబంధిత శాఖల అధికారులు నిర్దేశిత సమాచారం అందించాలని ఆదేశించారు. శాఖల వారిగా అందించే ప్రతి సమాచారం పక్కాగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, డిఆర్ఓ రాథోడ్ రమేష్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# జాతీయస్థాయి ఫుట్‌బాల్ క్రీడల్లో ప్రతిభ కనబరిచిన గిరీష్ వర్ధన్‌కు ఉత్తమ అవార్డు



**స్టేషన్ ఘన్‌పూర్, ఆగస్టు 17 (జనంసాక్షి) :** స్టేషన్ ఘన్పూర్ పట్టణ కేంద్రంలోని టీజీ డబ్ల్యూ ఆర్ ఎస్ లో ఎంపీసీ సెకండ్ ఇయర్ చదువుతు న్న మారపాక రాజయ్య (కబడ్డీ) కుమారుడు మారపాక గిరీష్ వర్ధన్ జనగామ జిల్లా కలెక్టర్ రేటులో జరిగిన స్వాతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని 2025-2026 సంవత్సరానికి గాను జనగామ జిల్లా నుండి జమ్ము ఁ కాశ్మీర్ రాష్ట్రంలో జాతీయస్థాయి ఫుట్ బాల్ క్రీడల్లో పాల్గొని అత్యంత ప్రతిభ కనబరిచిన సందర్భంగా ఎంఎల్ఏ, ప్రభుత్వ చీఫ్ విప్ బీర్ల ఐలయ్య, జిల్లా కలెక్టర్. సందిప్ కుమార్ ఝా ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి చేతుల మీదుగా ఉత్తమ అవార్డు ప్రశంస పత్రం అందుకున్నారు. జాతీయస్థాయి ఫుట్ బాల్ క్రీడల్లో పాల్గొని అత్యంత ప్రతిభ కనబరిచి జిల్లా కలెక్టర్ ఎమ్మెల్యేల చేతుల మీదు గా ప్రశాంశ పత్రం అందుకున్న మారపాక గిరీష్ వర్ధన్ ను కళాశాల యాజమాన్యంతోపాటు, గ్రామ ప్రజలు అభినందనలు తెలిపారు.

# నడికూడ మండలంలో అడ్డగోలుగా ఇసుక దందా?

- ప్రభుత్వ ఖజానాకు గండి పెడుతున్న ఇసుక మాఫియా
- ఎలాంటి అనుమతులు లేకుండా విచ్చలవిడిగా ఇసుక తరలింపు



**నడికూడ ఆగస్టు 17 (జనంసాక్షి) :** ప్రభుత్వ ఖజానాకు గండి పెడుతూ మండలంలోని ప్రభుత్వ అధికారుల నుండి ఎలాంటి అనుమతులు లేకుండా విచ్చలవిడిగా నడి కూడ మండలంలో ఇసుక దందా మూడు పువ్వులు వారు కాయలుగా జోరుగా కొనసాగుతున్నది. ఇసుకమాఫియా ఆగడాలు రోజురోజుకు ఎక్కువై విచ్చలవిడిగా పెరిగిపోతున్నాయి. ఇసుక దందాకు కేరాఫ్ నడికుడ మండలం అనే పేరు ఉమ్మడి పరకాలలో ప్రతి ఒక్కరి నోటా చర్చనీయాంశంగా వినబడుతున్నది. ఈ ఇసుక మాఫియా కు అడ్డుకట్ట లేదా.! ఈ ఇసుక బకాసురులు రాత్రి పగలు అనేది లేకుండా యదేచ్చంగా ఇసుక మాఫియా నడిపిస్తూ అధిక రేట్లకు విక్రయిస్తూ ఉంటే వీరిని అడ్డుకునే నాధుడే లేడా అని ప్రజల నోట పలు విమర్శలు వినబడుతున్నాయి. ఈ మాఫియా కు ఏ బడా నేత హస్తం ఉందో అనే విమర్శలు వెలువెత్తుతున్నాయి. మండలంలోని ఓ గ్రామ శివారులో వాగు కూత వేటు దూరంలో ఉండడంతో ఆ గ్రామం నుండే ఇసుక దందా కొనసాగుతున్నది.

# తెలంగాణలో రైస్‌మిల్ పరిశ్రమను కాపాడాలి

- రైస్ మిల్ అసోసియేషన్ ములుగు జిల్లా అధ్యక్షుడు బాదం ప్రవీణ్
- సీఎం రేవంత్ రెడ్డికి వినతి



**ములుగు ప్రతినిధి, ఆగస్టు17 (జనంసాక్షి):** తెలంగాణలో రైస్ మిల్ పరిశ్రమను కాపాడాలని రైస్మిల్లర్ అసోసియేషన్ ములుగు జిల్లా అధ్యక్షుడు బాదం ప్రవీణ్ అన్నారు.వివిధ అభివృద్ధి పనుల నేపథ్యంలో ఆదివారం ములుగు జిల్లాలో పర్యటించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ములుగు జిల్లా రైస్ మిల్లర్ అసోసియేషన్ సభ్యులతో కలిసి బాదం ప్రవీణ్ వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా బాదం ప్రవీణ్ మాట్లాడారు పేద ప్రజలకు సన్న బువ్వ పెట్టాలనే గొప్ప సంకల్పంతో తెలంగాణలో రైతులకు సన్న ధాన్యం పండించే విధంగా క్వింటా కి రూ.500 బోనస్ ఇస్తుండటం తోపాటు సదురు పథకంలో మిల్లర్లను సైతం భాగస్వామ్యం చేసినందుకు ఆయన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.అయితే ధాన్యం సేకరణ నుండి బియ్యం డెలివరీ చేసే వరకు రైస్ మిల్లర్లు అనేక సమస్యలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ ద్వారా రైతుల నుండి కొనుగోలు చేసే ధాన్యం మిల్లులకు ఇచ్చినంతవేగంగా కేంద్ర ప్రభుత్వం ఎఫ్సిఐ బియ్యం తీసుకోకపోవడం వలన మిల్లర్లు ఆర్థికంగా నష్టపోతున్నారని అన్నారు. మిల్లుల వద్ద దిగుమతి చేసుకున్న ధాన్యం 60 రోజుల తరువాత నిల్వ ఉంచిన ధాన్యం వెయిట్ లాస్ అవుతుందని వెయిట్ లాస్ అవ్వడం వలన దించుకున్న ధాన్యంలో 10% నష్టం వస్తుందని తెలిపారు.దిగుమతి చేసుకున్న ధాన్యం 60 రోజుల తర్వాత వెయిట్ లాస్ తో పాటు డ్యామేజ్ డీప్ కలర్ అవుతుందని,డ్యామేజ్ అవడం వలన స్టార్టు మిషన్ ద్వారా బియ్యం శుభ్రం చేయాల్సి వస్తుందని పేర్కొన్నారు. అందువలన డ్యామేజ్ 10% వరకు రికవరీ ఫ్యాక్టరీలకు డ్యామేజ్ బియ్యంను అమ్ముకోవాల్సి వస్తుందని , అందువలన ఒక క్వింటల్ బియ్యంకు రూ.600 రూపాయల నుండి రూ.750 రూపాయల వరకు నష్టం జరుగుతుందని తెలిపారు.అంతేకాకుండా స్టార్టు వేయడం వలన విద్యుత్ వినియోగం 60 హెచ్పి అదనంగా వాడడం వలన ఒక క్వింటాల్ బియ్యానికి 60 నుండి 75 రూపాయలు అదనపు ఖర్చు అవుతుందని పేర్కొన్నారు. దిగుమతి చేసుకున్న ధాన్యంకు 90 రోజుల లోపు బియ్యం 67% మరియు 91వ రోజు నుంచి 60% -64% బియ్యం పెట్టుటకు రాష్ట్ర ప్రభుత్వం నిబంధనలు సడలించాలని కోరారు.ఎప్పుడో 20 సంవత్సరముల క్రితం క్వింటాల్ ధాన్యం కు రా రైస్ బియ్యం పెట్టుటకు 10 రూపాయలు బాయిల్డ్ బియ్యం పెట్టుటకు 20/- రూపాయలు నిర్ణయించినారని, అప్పుడు విద్యుత్తు వాడకం 50 హెచ్టి నుండి 60హెచ్టి వరకు వాడకం అయ్యేదని, ఇప్పుడు ఒక రా రైస్ మిల్ నడవాలంటే 150హెచ్టి నుండి 200 హెచ్టి వరకు విద్యుత్తు వాడకం జరుగుతుందని పేర్కొన్నారు. పెరిగిన విద్యుత్తు వాడకం, లేబర్ చార్జీలు, మిషనరీ చార్జీలు, స్టార్టు వలన జరిగే నష్టం వల్ల ఆర్థికంగా మిల్లర్లు చితికి పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.బయట రాష్ట్రాలలో స్టార్టు వేసి ఇచ్చే బియ్యం క్వింటాల్ కు 150/- రూపాయలు చెల్లిస్తున్నారని,అదేవిధంగా మన రాష్ట్రంలో కూడా మిల్లింగ్ చార్జీలు పెంచాలని కోరారు.రా రైస్ మిల్లర్లకు విద్యుత్ కెటగిరి 124 హెచ్పి వరకు కెటగిరిలో ఉందని,కానీ బియ్యం పాలిష్ మరియు స్టార్టు మిషన్ వాడడం వలన హెచ్టి కెటగిరిలోకి వెళ్ళడం జరుగుతుందని, దాని వలన అధిక విద్యుత్ చార్జీలు మరియు స్టార్టు మిషన్ వాడడం వలన హెచ్టి కెటగిరిలోకి వెళ్ళడం వలన అధిక విద్యుత్ చార్జీలు చెల్లించి ఆర్థికంగా నష్టపోతున్నారని అన్నారు.కావున 124హెచ్పి నుండి 199 హెచ్పి వరకు ఎల్టి కెటగిరి లోనే ఉండే విధంగా విద్యుత్ టారిఫ్ ను సవరించాలని కోరారు. పాత గన్ని సంచుల లో ధాన్యం మిల్లులకు వస్తుంది, వచ్చిన పాత గన్ని సంచులు రిపేర్ చేయించి మళ్లీ ధాన్యం కొనుగోలు సెంటర్లకు పంపించడం వలన రెండు సీజన్లకే గన్ని సంచి పనికిరాకుండా పోతుంది. పాత గన్ని సంచి ధర బహిరంగ మార్కెట్లో 10 నుండి 15 రూపాయలు ఉంటుంది, కానీ ప్రభుత్వం పాత గన్ని రేటును 28 నుండి 35 రూపాయల వరకు మిల్లర్ల మీద వేయడం వలన ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తుంది. ప్రతి సీజన్ కు ఎన్ని పాతగన్ని సంచులలో ధాన్యము మిల్లర్లు దిగుమతి చేసుకుంటారో అందులో నుండి 20% పాత గన్ని సంచులను మిల్లర్లకౌంట్ నుండి తొలగించి మిల్లర్లు ఆర్థికంగా నష్టపోకుండా చూడాలని అన్నారు. జిల్లాలో రైతులు పండించిన ధాన్యము మరియు మిల్లర్లు పంపించే బియ్యం నిల్వ చేయుటకు జిల్లాలో గోదాములు నిర్మించాలని, గోదాముల కొరత వలన ఇతర జిల్లాలకు బియ్యం డెలివరీ చేయడం వలన ట్రాన్స్‌పోర్ట్ చార్జీలు మిల్లర్లపై పడి మిల్లర్ పై, ప్రభుత్వానికి ఆర్థిక భారం అవుతుందని అన్నారు.కాబట్టి జిల్లాలకు కావలసిన గోదాములు నిర్మాణ చేయాలని కోరారు.

# భూపాలపల్లి ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల

- 2 లక్షల 41 వేల 958 మంది ఓటర్లు..

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** 108-భూపాలపల్లి నియోజకవర్గ ముసాయిదా ఓటర్ల జాబితాను కలెక్టర్ రాహుల్ శర్మ సోమవారం విడుదల చేశారు. నియోజకవర్గంలో మొత్తం 2 లక్షల 41 వేల 958 మంది ఓటర్లు ఉండగా 1 లక్ష 18 వేల 991 మంది పురుషులు, 1 లక్ష 22 వేల 961 మంది మహిళలు, 6 మంది థర్డ్ జెండర్ వారు ఉన్నారు. 206 మంది సర్వీస్ ఓటర్లు, 6 మంది విదేశీ ఓటర్లు ఉన్నారని తెలిపారు. జాబితాలో తప్పులు ఉంటే సెప్టెంబర్ 16 లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారు ఓటు నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు.

జనంసాక్షి www.janamsakshi.org మంగళవారం 18 ఆగస్టు 2026

# ప్రజావాణిలో ప్రజలేరీ..!

- అధికారులు మాత్రమే హాజరు.. ఒక్కటే దరఖాస్తు
- ప్రచార లోపంపై మండల ప్రజల ఆగ్రహం

**అన్నపురెడ్డిపల్లి, ఆగస్టు 17 (జనంసాక్షి) :** ప్రజా సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన ప్రజావాణి కార్యక్రమం అన్నపురెడ్డిపల్లి మండలంలో తొలిరోజే వెలవెలబోయింది. మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం తొలిసారిగా నిర్వహించిన ప్రజావాణికి ప్రజల కంటే అధికారులు, సిబ్బందే అధికంగా కనిపించారు. సుమారు 23 శాఖలకు చెందిన అధికారులు గంటల తరబడి ఎదురుచూసినా సమస్యలు విన్నవించేందుకు ప్రజలు ఎవరూ రాకపోవడం చర్చనీయాంశంగా మారింది.

ప్రచారం లేక ప్రజలకు తెలియని ప్రజావాణి

మండలంలో పది గ్రామ పంచాయతీలు, సుమారు 18 వేల మంది జనాభా ఉన్నప్పటికీ ప్రజావాణి కార్యక్రమంపై గ్రామస్థాయిలో సరైన ప్రచారం చేయకపోవడంతో ప్రజలకు సమాచారం అందలేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చివరకు అక్కడికి వెళ్లిన ఓ వ్యక్తి ప్రజావాణి రైతు వేదికలో జరుగుతోందని, సమస్యలను అధికారులకు విన్నవించుకోవచ్చని చెప్పడంతో ఉటుపల్లి పంచాయతీకి చెందిన ఓ వ్యక్తి అక్కడికి చేరుకుని ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ ఒక్క దరఖాస్తు సమర్పించారు. అధికారులు ఆ ఒక్క దరఖాస్తునే స్వీకరించారు.

### వార్డు సభ్యులకే సమాచారం లేదా..?

ప్రతి గ్రామంలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, పాలకవర్గాలు ఉన్నప్పటికీ కొన్ని గ్రామాల్లో వార్డు సభ్యులకు సైతం మండల కేంద్రంలో ప్రజావాణి నిర్వహిస్తున్నారనే సమాచారం తెలియకపోవడం అధికారుల ప్రచార తీరుపై అనేక ప్రశ్నలు రేకెత్తిస్తోంది. గ్రామాల్లో 250 నుంచి 300 మంది ప్రజలు ఎన్నుకునే వార్డు సభ్యులకే కార్యక్రమం గురించి సమాచారం లేకపోతే నిరక్షరాస్యులు, రైతులు, రేషన్ కార్డుల సమస్యలు ఎదుర్కొంటున్న వారు, భూ సమస్యలు ఉన్న సామాన్య ప్రజలకు ప్రజావాణి గురించి ఎలా తెలుస్తుందని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు.



### టాంటాం వేయించి విస్తృత ప్రచారం చేయాలి

తదుపరి ప్రజావాణి నిర్వహించే ముందు ప్రతి గ్రామ పంచాయతీలో కార్యదర్శుల ద్వారా టాంటాం వేయించి, గ్రామస్థులకు ముందస్తు సమాచారం అందించాలని ప్రజలు కోరుతున్నారు. గ్రామాల్లోని సమస్యలను గుర్తించి ప్రజలను ప్రజావాణికి తీసుకువచ్చేలా అధికారులు చర్యలు చేపట్టాలని, లేకపోతే ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన ప్రజావాణి కేవలం అధికారుల కార్యక్రమంగానే మిగిలిపోతుందని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల సమస్యలు వినేందుకు ఏర్పాటు చేసిన వేదికలో ప్రజలే లేకపోవడం అధికారుల ప్రచార వైఫల్యానికి నిదర్శనమని పలువురు బహిరంగంగానే విమర్శిస్తున్నారు.

## ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యను పరిరక్షించాలి



**నల్లగొండ, ఆగస్టు 17 (జనం సాక్షి) :** తెలంగాణలో ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యను ప్రైవేటీకరణ దిశగా తీసుకెళ్లే విధానాలను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల ఎదుట ధర్నాలు నిర్వహించి, అనంతరం నల్లగొండ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఖమ్మంపాటి శంకర్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లం మహేష్ మాట్లాడుతూ జీవో నెం.97ను రద్దు చేయాలని, పాలిటెక్నిక్ విద్యను/ప్రైవేటీకరణకు అప్పగించరాదని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేసే ఉద్దేశం లేదని ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. పాలిటెక్నిక్ విద్యకు కీలకమైన వాదీజును బలోపేతం చేయాలని, విద్యార్థులకు లాటరల్ ఎంట్రీ ద్వారా ఇంజినీరింగ్‌లో చేరే అవకాశాలు కొనసాగించాలని అన్నారు. కళాశాలల్లో మౌలిక వసతులు, ల్యాబ్‌లు, వర్క్‌షాప్‌లు, హాస్టళ్లు, అధ్యాపకుల కొరతను పరిష్కరించాలని, ఫీజులు పెంచకుండా చూడాలని కోరారు. రాజ, గా, దీజ, మైనారిటీ, జుబో విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను పూర్తిస్థాయిలో విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఎం.ఏ. సైఫ్, మారుపాక కిరణ్, ఆదిల్, నందివర్ధన్ రాజు, గౌతమ్, శివాత్మిక, జయప్రకాష్, సాయి, సౌమ్య, అక్షయ, కావ్య, బన్ని, సహస్ర, యశశ్వి తదితరులు పాల్గొన్నారు.

## తుంగతుర్తిలో ప్రజావాణికి స్పందన కరువు

**తుంగతుర్తి, ఆగస్టు 17 (జనం సాక్షి) :** తుంగతుర్తి మండల కేంద్రంలో మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుండి స్పందన కరువైంది, ఈ మేరకు ఐదు ఫిర్యాదులు అందినట్లు ఎంపీడీవో చలపతి తాసిల్దార్ దయానంద్ లు తెలిపారు ఇందులో మూడు రెవెన్యూ శాఖకు సంబంధించి ఉండగా రెండు మండల్ పరిషత్ కు సంబంధించినవిగా ఉన్నాయి ఇందులో 23 శాఖల అధికారులు పాల్గొన్నట్లు తెలిపారు ముఖ్యంగా ప్రజా సమస్యలపై గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలను జిల్లాస్థాయిలో వెళ్లకుండా మండల స్థాయిలో సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వం భావించి రాష్ట్రవ్యాప్తంగా మండల కేంద్రాల్లో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించింది, కానీ ఇట్టి విషయం ప్రజావాణి కార్యక్రమం గురించి గ్రామాల్లోని ప్రజలకు అవగాహన లేకపోవడంతో పాటు వారికి తెలియక హాజరు కాలేదు, ఇప్పటికైనా అధికారులు గ్రామస్థాయిలో నీ ప్రజలకు ప్రజావాణి కార్యక్రమం మండల స్థాయిలో నిర్వహిస్తున్నామని ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.




# భద్రాచలం-వెంకటాపురం రహదారికి మోక్షమెప్పుడూ..?

- రూ.67.58 కోట్లు నిధులు కేటాయించిన పనులు చేపట్టరా..?
- ఇసుక లారీల ధాటికి ఛిద్రమైన రహదారులు

**భద్రాచలం, ఆగస్టు 17 (జనంసాక్షి) :** ఇసుక లారీల ఇష్టారాజ్య రాకపోకలతో భద్రాచలం-చర్ల ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. భారీ వాహనాల నిరంతర రాకపోకల కారణంగా పలుచోట్ల రోడ్డు పైపొర పూర్తిగా లేచిపోయి మట్టి రోడ్డును తలపిస్తోంది. గుంతలు, దుమ్ము, రోడ్డుపై పేరుకుపోయిన మట్టి కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తూరుబాక, తేగడ వద్ద హైలెవల్ వంతెన అప్రోచ్ రోడ్ల పరిసరాల్లోనూ రహదారి పరిస్థితి దారుణంగా మారింది. ఎటపాక, కన్నాయిగూడెం, చింతలగూడెం, రేగుబల్లి, చిన్ననల్లపల్లి తదితర ప్రాంతాల్లో పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. గుంతలను తప్పించుకుని వెళ్లే క్రమంలో వాహనాలు అదుపు తప్పి తరచూ ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటున్నాయి. భారీ వాహనాలపై నియంత్రణ లేకపోవడం, రహదారి మరమ్మతులపై నిర్లక్ష్యం వహించడం అధికారుల పనితీరుపై తీవ్ర విమర్శలకు తావిస్తోంది. సమస్య తీవ్రంగా ఉన్నా సంబంధిత శాఖలు పట్టించుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు.

### పర్ణశాల వచ్చే భక్తులకు సీతమ్మ కష్టాలు వీడేదెన్నడు...

దేశవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయానికి ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో భక్తులు వస్తుంటారు. భద్రాచలం వచ్చిన భక్తులు ఎక్కువ శాతం పర్ణశాలలో రామాలయం దర్శనంకు వస్తుంటారు. వారు సైతం ఇదే మార్గంలో రావాల్సి ఉండటంతో భక్తులు, పర్యాటకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుంతలు, దుమ్ము, భారీ లారీల రాకపోకలతో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. ఇప్పటికే ఈ మార్గంలో పలుచోట్ల ప్రమాదాలు జరిగి ప్రాణనష్టం, గాయపడిన సంఘటనలు చోటు చేసుకున్నాయి. రహదారి పరిస్థితి మరింత దిగజారితే ప్రమాదాల సంఖ్య పెరిగే అవకాశముందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### నిధులు మంజూరైనా పనులు చేపట్టరా..

భద్రాచలం-చర్ల రహదారి అభివృద్ధికి రూ.67.58 కోట్లు కేటాయించినట్లు సమాచారం. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హ్యామ్) కింద రహదారిని అభివృద్ధి చేయాలని ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. భద్రాచలం నుంచి చర్ల వరకు 56.80 కిలోమీటర్ల రహదారి అభివృద్ధికి ఈ నిధులు కేటాయించినట్లు నివేదికలు పేర్కొంటున్నాయి. అయితే రహదారి పరిస్థితి రోజురోజుకూ దిగజారుతున్నా పనులు ఆశించిన స్థాయిలో ముందుకు సాగకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిధులు ఉన్నప్పటికీ పనుల్లో జాప్యం ఎందుకన్న ప్రశ్నకు అధికారులు సమాధానం చెప్పాల్సిన పరిస్థితి నెలకొంది.



## నల్లవాగు నీటిని వెంటనే విడుదల చేయాలి



**నారాయణఖేడ్, ఆగస్టు 17 (జనం సాక్షి) :** నల్లవాగు ప్రాజెక్టులో నీరు అందుబాటులో ఉన్నప్పటికీ రైతుల పంటలకు నీటిని విడుదల చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి ఆరోపించారు. ప్రాజెక్టు నీటిని వెంటనే పంటలకు విడుదల చేసి రైతులను ఆదుకోవాలని కోరుతూ సబ్ కలెక్టర్ ఉమా హారతికి ఆయన వినతిపత్రం అందజేశారు. గత వారం రోజులుగా వర్షాలు లేకపోవడంతో నల్లవాగు ప్రాజెక్టు కింద సాగు చేసిన వరి పంటలు నీటి కోసం ఎదురుచూస్తున్నాయని భూపాల్ రెడ్డి తెలిపారు. రైతులు విత్తనాలు, ఎరువులు, కూలీల కోసం ఇప్పటికే భారీగా పెట్టుబడులు పెట్టారని, పంట కీలక దశలో నీరు అందకపోతే తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ప్రాజెక్టులో నీరు ఉండి కూడా పంటలకు విడుదల చేయకపోవడం రైతుల పట్ల తీవ్ర నిర్లక్ష్యమని ఆయన విమర్శించారు. రైతుల పంటలు ఎండిపోకుండా తక్షణమే నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

### కళ్యాణ లక్ష్మిపై హామీ నిలబెట్టుకోవాలి

కళ్యాణ లక్ష్మి పథకం విషయంలో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని భూపాల్ రెడ్డి కోరారు. పేద కుటుంబాల్లో ఆడబిడ్డల వివాహాలకు ప్రభుత్వం అండగా నిలవాలని, పథకాన్ని ఎలాంటి కోతలు, షరతులు లేకుండా యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రజలను మభ్యపెట్టే రాజకీయాలకు స్వస్తి పలికి, రైతులు, పేదల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, రైతులు, అభిమానులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## మూడు దశాబ్దాల జానపద సేవకు జాతీయ గుర్తింపు

- మునగాల వెంకటరత్నకు వందే భారత్ జాతీయ సమైక్యత అవార్డు



**ఖమ్మం, ఆగస్టు 17 (జనంసాక్షి) :** జానపద కళను సామాజిక చైతన్యానికి వేదికగా మలిచి మూడు దశాబ్దాలుగా ప్రజల్లో అవగాహన కల్పిస్తున్న మునగాల వెంకటరత్నకు జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. ఆయన అందించిన సేవలకు గాను వందే భారత్ జాతీయ సమైక్యత అవార్డును అందుకున్నారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో పైడి జయరాజు ప్రివ్యూ థియేటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సినీ దర్శకుడు రేలంగి నరసింహారావు చేతుల మీదుగా వెంకటరత్న అవార్డు, ప్రశంసాపత్రాన్ని స్వీకరించారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ఆనందలహరి సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఖమ్మం జిల్లాలో సుమారు 30 ఏళ్లుగా ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై జానపద కళారూపాల ద్వారా ప్రజల్లో చైతన్యం కల్పిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణ, కుటుంబ నియంత్రణ, అక్షరాస్యత, అంటరానితనం, బాల్య వివాహాల నిర్మూలన, పరిశుభ్రత, పారిశుద్ధ్యం, మూఢనమ్మకాల నిర్మూలన తదితర అంశాలపై గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో కళా ప్రదర్శనలు నిర్వహించారు. గిరిజన ప్రాంతాల్లో సైతం కాలినడకన వెళ్లి ప్రజలకు వివిధ సామాజిక అంశాలపై అవగాహన కల్పించినట్లు నిర్వాహకులు తెలిపారు. 1992 నుంచి ఇప్పటివరకు వివిధ జిల్లాల అధికారులు, ప్రభుత్వ శాఖల నుంచి ఉత్తమ సేవలకు ప్రశంసాపత్రాలు, పురస్కారాలు అందుకున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనూ నగదు పురస్కారంతో పాటు ప్రశంసాపత్రాన్ని పొందారు. జానపద కళను కేవలం వినోదానికే పరిమితం చేయకుండా ప్రజా సమస్యలపై చైతన్యం కల్పించేందుకు వినియోగిస్తూ వస్తున్న వెంకటరత్నకు జాతీయ సమైక్యత అవార్డు దక్కడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు. వందనం గ్రామానికి చెందిన కళాకారుడికి జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం గ్రామానికి, జిల్లాకు గర్వకారణమని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

## 19న మహాధర్నాను విజయవంతం చేయాలి

**నారాయణపేట, ఆగస్టు 17 (జనం సాక్షి) :** విద్యుత్ ఉద్యోగుల పి.ఆర్.సి, ఆర్టిజన్ కార్మికుల ఏ.పి.ఎస్.ఈ.బి. రూల్స్ మరియు ఈ.పి.ఏ.ఫ్.టూ. జీపీఎఫ్ తదితర ప్రధాన డిమాండ్ లోపై తెలంగాణ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఈ నెల 19 మహాధర్నా కు పిలుపు నిచ్చింది. ఈ ధర్మా గోడ పత్రికను నారాయణపేట సర్కిల్ కార్యాలయం ముందు భోజన విరామ సమయంలో తెలంగాణ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ మొగులప్ప , పి.గోవింద్ రాజు , ( 1104 యూనియన్ ), కే.ఎల్.శ్రీను 327 , వెంకటన్న ( ఎస్.సి, ఎస్టీ) ల ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా



కార్మికులు తమ న్యాయమైన డిమాండ్ లను నేరవేర్చాలని సర్కిల్ కార్యాలయం ముందు నినాదాలు చేశారు. ఈ నెల 19 న హైదరాబాద్ లో జరిగే మహాధర్మాలో కార్మికులు అత్యధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమం విజయవంతం చేయాలని టి. జాక్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈ రఫీ, మహేష్ గౌడ్, జీ. రవీంద్ర చారీ, నజీర్ అహ్మద్, భీమప్ప, బండి ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

## సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ కారిడార్ వచ్చే వరకు పోరాడుతాం



**సూర్యాపేట, ఆగస్టు 17 (జనంసాక్షి) :** సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ కారిడార్ కోసం జరుగుతున్న రిలే నిరాహార దీక్షలో నాలుగోవ రోజు ప్రగతిశీల మహిళా సంఘం వారు పాల్గొన్నారు. సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ వారికి మద్దతు తెలిపి మాట్లాడారు. అభివృద్ధి చెందుతున్న సూర్యాపేటకు రైల్వే కారిడార్ హక్కు అని అన్నారు. బుల్లెట్ ట్రైన్ కారిడార్ వ్యాపార వాణిజ్య కేంద్రాలను కలుపుతూ పోవాల్సి ఉండగా, కొందరి స్వార్థం కోసం ఈ అలైన్మెంట్ ను మార్చాలని చూస్తున్నారని పేర్కొన్నారు. అలాంటి చర్యలను వెంటనే విరమించుకోవాలని, లేని పక్షంలో ప్రజాగ్రహానికి గురికావాల్సి వస్తుందని అన్నారు. అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతున్న సూర్యాపేట, నకిరేకల్ నార్కెట్ పల్లి, కోదాడను విస్మరించడం అంటే అభివృద్ధిని నిరోధించడమే అవుతుందన్నారు. సూర్యాపేట ప్రాంత అభివృద్ధి కోసం రైల్వే కారిడార్ సాధించేంతవరకు అన్ని వర్గాల ప్రజల ఐక్యతతో పోరాటాలను కొనసాగిస్తామని తెలిపారు. ఈ దీక్షకు సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి డేవిడ్ కుమార్, సీపీఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, సిఐటియు జిల్లా అధ్యక్షులు నెమ్మది వెంకటేశ్వర్లు, పీడీఎస్ యు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎర్ర అఖిల్ కుమార్, నాయకులు పేర్ల నాగయ్య, టియుసిఐ జిల్లా అధ్యక్షులు గొడ్డలి నర్సయ్య లు పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈదీక్షలో ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రేణుక, జిల్లా అధ్యక్షులు మారసాని చంద్రకళ, ఉపాధ్యక్షులు సూరం రేణుక, కట్ట కల్పన, ఐతరాజు పద్మ, చందనబోయిన లక్ష్మీ, పావని, భీమనపల్లి పద్మ, గౌరమ్మ, శ్యామల, చెర్కు అరుణ, పర్వీన్, గుండగాని రేణుక తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు శ్రీకారం



**అన్నపురెడ్డిపల్లి, ఆగస్టు 17 (జనంసాక్షి) :** అన్నపురెడ్డిపల్లి మండలంలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డి, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి నూతనంగా నిర్మించిన సిమెంట్ రోడ్లను ప్రారంభించడంతో పాటు డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. యర్రగుంట, రామకృష్ణాపురం గ్రామాల్లో నూతనంగా నిర్మించిన సిమెంట్ రోడ్లను ఎంపీ, ఎమ్మెల్యేలు ప్రారంభించారు. అనంతరం మర్రిగూడెం గ్రామంలో చేపట్టనున్న డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. దీంతో గ్రామాల్లో మౌలిక వసతులు మెరుగుపడనున్నాయని ప్రజాప్రతినిధులు తెలిపారు.

### రూ.11.50 కోట్ల నిధులు మంజూరు

ఈ సందర్భంగా ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డి మాట్లాడుతూ.. అన్నపురెడ్డిపల్లి మండలంలో ఎంపీ నిధుల ద్వారా వివిధ అభివృద్ధి పనుల కోసం సుమారు రూ.11.50 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కేంద్రంగా నిధులను వినియోగిస్తూ ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు.

ఈ కార్యక్రమంలో తహసీల్దార్ స్వర్ణ, ఎంపీడీవో రాజేశ్వరి, ఎంపీవో ఇబ్రహీం, మండల అధ్యక్షుడు పర్స వెంకట్, యువజన అధ్యక్షుడు వేముల నరేష్, దుబాకుల రాము, రమణ, పంచాయతీ కార్యదర్శి సురేష్, నాగేశ్వరరావు, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# మంత్రుల క్యాంపు కార్యాలయాల ముందు విద్యార్థుల నిరసన

**ఖమ్మం కార్పొరేషన్, ఆగస్టు 17 (జనం సాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలైనా నేటికీ ప్రజా పాలన అంటూ ఉదరగొట్టడమే తప్ప విద్యార్థులకు ఇచ్చే రియంబర్స్మెంట్ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నోరు మెదపడం లేదని పిడియస్ యూ రాష్ట్ర అధ్యక్షులు కాంపాటి పృథ్వీ అన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం ఉమ్మడి జిల్లా కమిటీల ఆధ్వర్యంలో ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు క్యాంపు కార్యాలయాల ముందు విద్యార్థులు నిరసన కార్యక్రమం చేపట్టారు. నిరసన కార్యక్రమాన్ని పోలీసులు విచ్చిన్నం చేసి నిరసన చేపట్టిన విద్యార్థి సంఘ నాయకులను అదుపులోకి తీసుకున్నారు. మంత్రుల క్యాంపు కార్యాలయం ముందు ఉద్రిక్తత వాతావరణం ఏర్పడింది. విద్యార్థులు మా స్కాలర్షిప్, రియంబర్స్మెంట్ మాకు ఇవ్వాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు ఇచ్చారు. స్కాలర్షిప్స్ ఉద్యమానికి నాయకత్వం వహించిన పి డి యస్ యూ రాష్ట్ర అధ్యక్షులు కాంపాటి పృథ్వీ, పి డి యస్ యూ ఖమ్మం జిల్లా అధ్యక్షులు టి. లక్ష్మణ్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి మునిగల శివ ప్రశాంత్ తో పాటు మరి కొంతమంది విద్యార్థి నాయకులను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా జరిగిన నిరసన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ స్కాలర్షిప్స్ అంటే పాలక ప్రభుత్వాలు కేవలం ఒక సంక్షేమ పథకంలా చూస్తూ నిర్లక్ష్యం చేస్తున్నరు తప్ప అదొక సామాజిక సమస్యగా, సామాజిక బాధ్యతగా చూడడం లేదని అన్నారు. పాలక ప్రభుత్వాలు రేయంబర్స్మెంట్ విషయంలో ఆలస్యం చేయడం కారణంగా విద్యార్థులు పరీక్ష ఫీజులు, పుస్తకాల ఫీజులు, ప్రయాణ కర్చులు, హాస్టల్ ఫీజులు, ల్యాబ్ ఇతర సౌకర్యాల ఖర్చులు కట్టలేని పరిస్థితి ఏర్పడే ఒత్తిడి గురై ఇంజనీరింగ్, మెడికల్, ఫార్మసీ, డిగ్రీ, ఇంటర్ విద్యార్థులు డ్రాపౌట్స్ అవుతూ పై చదువులకు వెళ్లలేక పోతున్నారని అన్నారు. విద్యార్థుల ఖాతాల్లోకి స్కాలర్షిప్స్ వేయడంలో ఆలస్యం కారణంగా పేద విద్యార్థుల భవిష్యత్తుకు గొడ్డలిపెట్టుగా ప్రభుత్వ విధానం ఉందని వారన్నారు. విద్యార్థులకు ఆర్థిక సహకారంగా ఉన్న రియంబర్స్మెంట్ ను




కొనసాగిస్తూ పెండింగ్ లో ఉన్న 10వేల కోట్లను తక్షణమే విద్యార్థులకు చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పి డి యస్ యూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు బుర్ర వీరభద్రం, పి డి యస్ యూ ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ల నాయకులు సురేష్, హరిచంద్ర ప్రసాద్, రఘు, రామ్ చరణ్, మురళి నాయకులు మనోజ్, సుశాంత్, గోపి, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.




### వాట్సప్‌లో పాన్, ఆధార్ వివరాలు..

# రిస్క్ కొని తెచ్చుకున్నట్లే!

**న్యూఢిల్లీ:**రుణాల కోసం బ్యాంకు ఏజెంట్‌ను కలిసినప్పుడు.. పాన్, బ్యాంకు స్టేట్‌మెంట్ వంటి వివరాలు పంపించాలని అడుగుతుంటారు. ఏదైనా హోటల్ గదిలో దిగినప్పుడు ఆధార్ వివరాలు వాట్సప్ చేయాలని కోరుతుంటారు. స్థలం కోసం ఎవరైనా ప్రాపర్టీ బ్రోకర్‌ను కలిసినా కావాల్సిన వివరాలను వ్యక్తిగత నంబర్‌కు వాట్సప్ చేయాలని చెప్తుంటారు. వారు వివరాలు అడగ్గానే.. సులువుగా ఉంది కదా అని మీ వ్యక్తిగత వివరాలను వాట్సప్ చేయడమంటే కోరి రిస్కును కొనితెచ్చుకున్నట్లే. దీనివల్ల వ్యక్తిగత డేటా బహిర్గతం అయ్యే అవకాశం ఉందని సైబర్ నిపుణులు హెచ్చరిస్తున్నారు.ఒకసారి వ్యక్తిగత ధ్రువీకరణ పత్రాలను వాట్సప్ ద్వారా ఇతరులకు పంపినప్పుడు, అవతలి వ్యక్తి వాటిని తమ ఫోన్‌లో లేదా ల్యాప్‌టాప్‌లో డౌన్‌లోడ్ చేసుకుంటారు. ఆ పత్రాలు ఆటోమేటిక్‌గా వారి క్లౌడ్ బ్యాకప్‌లో సేవ్ అవుతాయి. వాస్తవానికి మోసం చేయాలన్న ఉద్దేశం ఆ వ్యక్తికి లేకపోయినా.. ఎప్పుడైనా ఆ డివైజ్ లేదా వారి ఖాతా సైబర్ దాడికి గురైనప్పుడు మీ డేటా దుర్వినియోగమయ్యే ప్రమాదం ఉంది. రేపొద్దున ఫలానా కంపెనీకి ఆయా వివరాలు పంపినప్పుడు దుర్వినియోగం అయ్యిందని చెప్పడానికీ ఉండదు. ఎందుకంటే మీరు పంపిన డేటా పద్ధతి ఆ కంపెనీకి సంబంధించిన సైబర్ సెక్యూరిటీ పరిధిలోకి రాదనే విషయం గుర్తుంచుకోవాలి.

**మరేం చేయాలి?**

ఆధార్, పాన్, బ్యాంక్ వివరాలు అడిగినప్పుడు వాట్సప్ ద్వారా ఎట్టి పరిస్థితుల్లోనూ వివరాలు పంపించొద్దు. కంపెనీ లేదా బ్యాంక్‌కు చెందిన అధికారిక లింక్‌ను లేదా డాక్యుమెంట్ అప్‌లోడ్ చేసే సెక్యూర్ పోర్టల్ లింక్‌ను పంపాలని అడగండి. బ్యాంకులకు, రుణదాతలకు లేదా హోటల్ వంటి వ్యాపార అవసరాలకు ప్రత్యామ్నాయ వెరిఫికేషన్ పద్ధతులు ఉన్నాయోమో అడిగి తెలుసుకోండి. డిజిలాకర్ లేదా ఉడాయ్‌కి చెందిన ఆఫ్-లైన్ వెరిఫికేషన్ పద్ధతులు అందుబాటులో ఉంటే ఆ రూపంలో మీ వివరాలు ధ్రువీకరించుకోవాలని సూచించొచ్చు.ఒకవేళ తప్పనిసరి పరిస్థితుల్లో వ్యక్తిగత ఫోన్ నంబర్‌కే పత్రాలను పంపాల్సి వస్తే, ఆ ఫైల్‌ను పాస్‌వర్డ్ ప్రొటెక్ట్‌తో షేర్ చేయడం మంచిది. ఆ పాస్‌వర్డ్‌ను విడిగా తెలియజేయండి. వీలైనంత వరకు ఆధార్‌లోని చివరి 4 అంకెలు మాత్రమే కనిపించే మాస్క్‌డ్ ఆధార్ కాపీలను ఉపయోగించండి.



# నష్టాలతో ముగిసిన సూచీలు

**జనంసాక్షి:**దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాలతో ముగిశాయి. అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చితుల వేళ.. ఐటీ, ఎఫ్ఎంసీజీ స్టాక్స్‌లో అమ్మకాల కారణంగా సూచీలు ఒత్తిడి ఎదుర్కొన్నాయి. దీంతో సెన్సెక్స్ వరుసగా రెండో సెషన్‌లో నష్టాలు చవిచూడగా.. నిఫ్టీ ఐదో రోజూ నష్టాల్లో ముగిసింది. ఇంట్రాడే కనిష్ఠాల నుంచి సూచీలు కోలుకోవడం ఊరటనిచ్చే అంశం.సెన్సెక్స్ ఉదయం 77,892.92 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 78,009.25) వద్ద నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా సూచీ నష్టాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో ఓ దశలో 77,453.75 వద్ద కనిష్ఠానికి పడిపోయిన సూచీ... చివరికి 281.09 పాయింట్ల పతనమై 77,728.16 వద్ద ముగిసింది. నిఫ్టీ 78.35 పాయింట్లు కోల్పోయి 24,287.65 వద్ద స్థిరపడింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 95.61గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టాటాస్టీల్, యాక్సిస్ బ్యాంక్, రిలయన్స్, బీఈఎల్, హెచ్‌డీఎఫ్‌సీ, ఎల్అండ్‌టీ, బజాజ్‌ఫైనాన్స్ షేర్లు మాత్రమే లాభాల్లో ముగిశాయి. మిగతా కంపెనీల షేర్లు నష్టాలను చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ ధర 89.54 డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్సు 4,394.13 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

**పరిమిత శ్రేణిలోనే ట్రేడింగ్!**

స్టాక్‌మార్కెట్లో ప్రధాన సూచీలు ఈ వారం పరిమిత శ్రేణిలో చలించొచ్చన్నది విశ్లేషకుల అంచనా. కార్పొరేట్ జూన్ త్రైమాసిక ఫలితాలు ముగింపునకు రావడంతో, అంతర్జాతీయ పరిణామాల నుంచి మార్కెట్లు సంకేతాలందుకోవచ్చు. ముఖ్యంగా పశ్చిమాసియా యుద్ధ పరిస్థితులు కీలకం కానున్నాయి. ఇరాన్ పోర్టుల దిగ్బంధనాన్ని కొనసాగిస్తామని అమెరికా బెదిరిస్తున్నందున, చమురు



సరఫరాపై ఆందోళనలు తలెత్తుతున్నాయి. దేశీయంగా కార్పొరేట్ ఫలితాలు అంచనాల కంటే మెరుగ్గా నమోదవడం, 2026-27 ఆదాయార్జన అంచనాల పెంపు, రూపాయి కదలికల్లో స్థిరత్వం వంటివి సానుకూల పరిణామాలు. విదేశీ పోర్టుఫోలియో మదుపరులు జులైలో రూ.20,200 కోట్లు; ఈనెలలో ఇప్పటికే రూ.16,621 కోట్ల కొనుగోళ్లు జరపడం సెంటిమెంటును బలపరుస్తోంది. అయినా కూడా మార్కెట్ ధోరణి అంతర్లీనంగా ప్రతికూలంగా ఉందని సాంకేతిక నిపుణులు చెబుతున్నారు. నిఫ్టీ-50 సూచీ 24,180 స్థాయికి తగ్గొచ్చని అంటున్నారు. ఈ సూచీకి 24,200-24,000 స్థాయుల్లో మద్దతు, 24,500 వద్ద నిరోధం కనిపిస్తున్నాయి. వివిధ రంగాలపై విశ్లేషకులు ఏమంటున్నారంటే..వాహన, విడిభాగాల షేర్లు ఈ వారం మళ్లీ లాభాల్లోకి రావొచ్చు. ఈ సూచీ 27,500 స్థాయిని అధిగమించాక బులిష్ ధోరణి కనిపిస్తోంది. 30,000 స్థాయి నిరోధంగా, 29,600 మద్దతుగా పనిచేయగలదు. జీఎస్‌టీ కోత వల్ల లభించిన సానుకూలతతో పోలిస్తే, వాహన ధరల పెంపు పెద్దగా ఇబ్బందిగా మారబోదని అంచనా.లోహ సూచీ ఒక దిశను ఎంచుకునేందుకు ముందు స్థిరీకరణకు గురయ్యే అవకాశం ఉంది. మధ్యకాలానికి సూచీ బాగానే కనిపిస్తున్నా, స్వల్పకాల ధోరణి విషయంలో అప్రమత్తత తప్పదు. తక్షణ నిరోధం 13,220, ఆ తర్వాత 13,930 వద్ద కనిపిస్తోంది. చమురు-గ్యాస్ కంపెనీల షేర్లు ఊగిసలాటకు గురికావొచ్చు. ముడి చమురు అధిక ధరలు కాస్త చమురు మార్కెటింగ్ కంపెనీలకు తలనొప్పిగా మారొచ్చు. 10,700 మద్దతు స్థాయి దిగువన మరింత విక్రయాల ఒత్తిడి ఎదురుకావచ్చు. వినియోగదార్ల సంఖ్య, వినియోగదారు నుంచి లభించే సగటు ఆదాయం (ఆర్పు) మెరుగవుతున్నందున టెలికాం కంపెనీల షేర్లపై విశ్లేషకులు సానుకూలంగా ఉన్నారు. ఆర్పు పెంపునకు కంపెనీలు చేపట్టే చర్యలను మార్కెట్ గమనిస్తుంది.రెండు వారాల పాటు తగ్గుతూ వచ్చిన ముడి చమురు ధర మళ్లీ పెరుగుతుండడంతో ఎఫ్ఎంసీజీ షేర్లపై ఒత్తిడి ఏర్పడొచ్చు. ఈ రంగ సూచీ 47,500 దిగువకు వస్తే 45,000-44,000 స్థాయులను పరీక్షించొచ్చు.ప్రభావం చూపే వార్తలు లేనందున సిమెంటు షేర్లు మార్కెట్‌తో పాటే కదలాడొచ్చు. సెప్టెంబరు త్రైమాసికంలో వర్షాల కారణంగా నిర్మాణ కార్యకలాపాలు తక్కువగా ఉంటాయి కనుక ఫలితాలు మోస్తరుగానే ఉండొచ్చు. విద్యుత్, ఇంధన వ్యయాల ప్రభావం కంపెనీల లాభదాయకతపై పడొచ్చు.నిఫ్టీ ఫార్మా సూచీ ఒక శ్రేణిలో చలించొచ్చు. గత నెలరోజుల్లో కాంట్రాక్ట్ డెవలప్‌మెంట్ తయారీదార్లయిన గ్లాండ్ ఫార్మా, సాయి లైఫ్ సైన్సెస్, దివీస్ షేర్లు 14-19% వరకు పెరిగాయి. అందువల్ల ఫార్మా సూచీలో లాభాల స్వీకరణకూ అవకాశం ఉంది. ఐటీ షేర్లు సమీప కాలంలో ఊగిసలాటకు గురికావొచ్చు. అనిశ్చిత ద్రవ్యోల్బణం, అస్థిరంగా ఉన్న కృత్రిమ మేధ(ఏఐ) ధోరణులు ఇందుకు దోహదం చేయొచ్చు. ఐటీ కంపెనీల విలువలు అధికంగా ఉన్నందున, కొంత మేర నష్టాలకు అవకాశం ఉంది.యంత్రపరికరాల కంపెనీల షేర్లు ఒక శ్రేణిలోనే చలించొచ్చు. అధిక విలువలకు తోడు ముడి చమురు ధరల వల్ల మార్జిన్‌పై ఒత్తిళ్లు పడొచ్చన్న ఆందోళనలు ఇందుకు నేపథ్యం. బలమైన ఆర్డర్ల పుస్తకం కారణంగా నష్టాలు పరిమితంగానే ఉండొచ్చు. అంతర్జాతీయ సంకేతాలు సెంటిమెంటును ప్రభావితం చేయనున్నందున, నిఫ్టీ బ్యాంక్ సమీప కాలంలో ఒక శ్రేణిలో ట్రేడవవచ్చు. 57818.70 వద్ద నిరోధం, 57,216.70 వద్ద మద్దతు కనిపిస్తోంది. నిరోధ స్థాయికి పైన కొనసాగితే పుంజుకోవడానికి అవకాశం ఉంటుంది.

## గుడ్ల ధరలు

హైదరాబాద్ ₹ 5.40

వరంగల్ ₹ 5.42

**బంగారం ధరలు** (10 గ్రాములు)

హైదరాబాద్

₹ 1,54,236 (22 క్యారెట్లు)

₹ 1,67,180 (24 క్యారెట్లు)

**వెండి ధరలు (కేజీ)**

హైదరాబాద్

₹ 2,40,000

# ఓపో, వన్‌ప్లస్, రియల్‌మి దేశీయ తయారీ

### అంబర్ ఎంటర్‌ప్రైజెస్ ఇండియా సీఈఓ జస్బీర్

**న్యూఢిల్లీ:** చైనా స్మార్ట్‌ఫోన్ బ్రాండ్లయిన ఓపో, వన్‌ప్లస్, రియల్‌మి తయారీని దేశీయంగా 2027 మార్చి త్రైమాసికం నుంచి ప్రారంభిస్తామని ఎలక్ట్రానిక్స్ తయారీ సేవల సంస్థ అంబర్ ఎంటర్‌ప్రైజెస్ ఇండియా తెలిపింది. ఆ తరవాత ఆర్థిక సంవత్సరంలో ఈ ఉత్పత్తిని రెట్టింపు చేయాలని భావిస్తున్నట్లు అంబర్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్, సీఈఓ, పూర్తి కాల డైరెక్టర్ జస్బీర్ సింగ్ తెలిపారు. ఓపో గ్రూప్‌నకు చెందిన స్మార్ట్‌ఫోన్ బ్రాండ్ల ఉత్పత్తిని 2027-28లో 80 లక్షల యూనిట్లతో ప్రారంభించి, ఆ తదుపరి సంవత్సరంలో దాన్ని రెట్టింపు చేసి సుమారు 1.6 కోట్ల స్మార్ట్‌ఫోన్లకు పెంచాలని సంస్థ భావిస్తోందని పేర్కొన్నారు. 'మా గ్రూప్, ఓపో మొబైల్స్ ఇండియాతో తయారీ సహకార ఒప్పందం చేసుకుంది. తద్వారా మొబైల్ ఫోన్ల రంగంలోకి ప్రవేశించడానికి సిద్ధంగా ఉంది. ఈ ఒప్పందం పరిధిలోకి ఓపో, వన్‌ప్లస్, రియల్‌మి బ్రాండ్లు వస్తాయి. 2026-27 జనవరి-మార్చి త్రైమాసికం నాటికి ట్రయల్ ఉత్పత్తిని, 2027-28 ఏప్రిల్-జూన్ త్రైమాసికం నాటికి వాణిజ్య ఉత్పత్తిని ప్రారంభించే దిశగా ముందుకు సాగుతున్నామ'ని జస్బీర్ సింగ్ వెల్లడించారు.వివో, ఓపో బ్రాండ్లు చైనాకు చెందిన బీబీకే ఎలక్ట్రానిక్స్‌వే. అయితే స్వతంత్రంగా కార్యకలాపాలు సాగిస్తుంటాయి. ప్రస్తుతం నొయిడాలోని వివో ప్లాంట్లలోనే ఓపో ఫోన్లు తయారవుతున్నాయి.వివో కూడా భారత్‌లోని తన ప్లాంటును, డిక్సన్ టెక్నాలజీస్‌తో కలిసి ఏర్పాటుచేస్తున్న సంయుక్త సంస్థకు అప్పగించేందుకు సన్నాహాలు చేస్తోంది. కౌంటర్ పాయింట్ రీసెర్చ్ ప్రకారం.. 2026 ఏప్రిల్-జూన్‌లో దేశీయ స్మార్ట్‌ఫోన్ విపణిలో వివోకు 17.8%, శామ్‌సంగ్‌కు 17.6%, ఓపోకు 13.6% వాటాలు లభించాయి.వివో, ఓపో గ్రూప్‌ల్లోనే ఐక్యూ, రియల్‌మి, వన్‌ప్లస్ బ్రాండ్లున్నాయి. వీటన్నింటికి కలిసి మన స్మార్ట్‌ఫోన్ విపణిలో 45.6% వరకు వాటా ఉంది.

# వంటగ్యాస్ కొరతకు చెక్..

## రిఫైనరీలకు ఉత్పత్తి లక్ష్యాలు విధించిన ప్రభుత్వం • రిలయన్స్‌కు అతిపెద్ద కోటా

**పశ్చిమాసియా యుద్ధ ప్రభావంతో, సరఫరాలకు ఆటంకాలు ఏర్పడి, మన దేశంలో వంటగ్యాస్ (ఎల్‌పీజీ)కు తీవ్ర కొరత వచ్చి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. భవిష్యత్తులో దిగుమతులకు అంతరాయం ఏర్పడినా, దేశీయంగా వంటగ్యాస్ కొరత రాకుండా చూసేందుకు కేంద్ర ప్రభుత్వం ముందుజాగ్రత్త చర్యలు చేపడుతోంది. అందుకే ప్రభుత్వ, ప్రైవేట్ రంగ రిఫైనరీలు, అప్‌స్ట్రీమ్ చమురు కంపెనీలకు తొలిసారిగా 'ఉత్పత్తి లక్ష్యాలను' కేంద్ర పెట్రోలియం, సహజవాయువు మంత్రిత్వ శాఖ నిర్దేశించింది.**



**న్యూఢిల్లీ:**దేశవ్యాప్తంగా ఉన్న 21 రిఫైనరీలు, అప్‌స్ట్రీమ్ కంపెనీలు కలిపి రోజుకు గరిష్ఠంగా 63,810 టన్నుల ఎల్‌పీజీని ఉత్పత్తి చేయగలవు. ఇది 2025-26లో దేశీయంగా జరిగిన ఎల్‌పీజీ ఉత్పత్తి కంటే రెట్టింపు కాగా, దేశ రోజువారీ అవసరాల్లో దాదాపు 70 శాతానికి సమానం. దేశంలో కొరత తలెత్తినప్పుడు ఈ లక్ష్యాలు తక్షణమే అమల్లోకి వస్తాయి. ఇందులో రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు అధిక కోటా లభించింది.

**రిలయన్స్ ఇండస్ట్రీస్:** గుజరాత్ జామ్‌నగర్‌లోని రిలయన్స్ రిఫైనరీకి దేశంలోనే అత్యధికంగా రోజుకు 18,000 టన్నుల ఎల్‌పీజీ ఉత్పత్తి లక్ష్యాన్ని విధించారు. ఎగుమతుల కోసం ఉద్దేశించిన 35.2 మి.టన్నుల సామర్థ్యం కలిగిన యూనిట్‌కు ఎటువంటి లక్ష్యాన్ని పెట్టలేదు.

**ప్రభుత్వ రంగ రిఫైనరీలు:** ప్రభుత్వ రంగ చమురు సంస్థలకు చెందిన 18 రిఫైనరీలు సంయుక్తంగా రోజుకు 31,470 టన్నుల ఎల్‌పీజీని ఉత్పత్తి చేయాల్సి ఉంటుంది.

**నయారా ఎనర్జీ:** వడినార్‌లోని నయారా రిఫైనరీకి రోజుకు 4,480 టన్నుల ఎల్‌పీజీ ఉత్పత్తి లక్ష్యాన్ని నిర్దేశించారు.

అప్‌స్ట్రీమ్ కంపెనీలు: సహజవాయువు, ఎల్‌పీజీని వెలికి తీసే అప్‌స్ట్రీమ్ కంపెనీలైన ఓఎన్‌జీసీ, గెయిల్ సంస్థలకు రోజుకు 6,460 టన్నుల ఉత్పత్తి పరిమితిని కేటాయించారు.

2025-26లో దేశంలో మొత్తం 33.2 మిలియన్ టన్నుల ఎల్‌పీజీ వినియోగమైంది. అంటే రోజువారీ వినియోగం 91,000 టన్నులుగా ఉంది. ఇందులో దేశీయ ఉత్పత్తి 13.1 మి.టన్నులు మాత్రమే. మిగిలిన 21.3 మి.టన్నుల (రోజుకు 58,400 టన్నుల) అవసరాలు దిగుమతుల ద్వారానే తీరాయి. వంటగ్యాస్ అవసరాల్లో దాదాపు 64% దిగుమతులే తీర్చాయి. పశ్చిమాసియా సంక్షోభ సమయంలో పెట్రోరసాయనాల ముడిసరకును ఎల్‌పీజీకి మళ్లించడం, వంటి తాత్కాలిక చర్యలతో ఉత్పత్తిని రోజుకు 55,000 టన్నులకు పెంచగలిగారు. గృహ వినియోగదారులకు సిలిండర్ బుకింగ్ వ్యవధిని పెంచడం ద్వారా ఒత్తిడి తగ్గించారు. ఇప్పుడు ఉత్పత్తి పెంచేందుకు పటిష్ఠ నిబంధనావళి తీసుకొచ్చారు.

**ఆరు నెలలకోసారి సమీక్ష:** వంటగ్యాస్ ఉత్పత్తి షెడ్యూల్‌ను ప్రభుత్వం ఏటా జనవరి 1, జులై 1 తేదీల్లో సమీక్షించనుంది. కొత్తగా జతచేరే రిఫైనరీలు, నూతన టెక్నాలజీలు, రవాణా మార్గాల విస్తరణ ఆధారంగా ఉత్పత్తి కోటాలను ఎప్పటికప్పుడు సవరించనున్నారు.

## పరీక్షల్లో అవకతవకలు..

న్యూఢిల్లీ(జనంసాక్షి):ప్రశ్నాపత్రాల లీకేజీ, పరీక్షల్లో అవకతవకలపై కొద్ది రోజులుగా పెద్ద ఎత్తున విమర్శలు వస్తుండడంతో జాతీయ పరీక్షల ఏజెన్సీ (ఎటిఎ) కీలక చర్యలు చేపట్టింది. పరీక్షా విధానాన్ని సమూలంగా ప్రక్షాళన చేసే చర్యల్లో భాగంగా 50మందికి పైగా సిబ్బందిని తొలగించింది. సంస్థలోని కీలక స్థానాల్లో నిపుణులను నియమిస్తోంది. ఈ మేరకు కేంద్ర విద్యాశాఖ ప్రకటన వెలువరించింది. చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్, చీఫ్ ఫైనాన్స్ ఆఫీసర్ వంటి పది కొత్త స్థానాల కోసం ప్రకటనలు జారీ చేసి, నియామక ప్రక్రియ చేపట్టనున్నట్లు తెలిపింది. సైబర్ భద్రత, సైకోమెట్రిక్స్, ప్రశ్నపత్రాల రూపకల్పన, ఇతర ప్రత్యేక విభాగాల కోసం ప్రైవేట్ రంగం నుంచి కూడా నిపుణులను తీసుకువస్తున్నట్లు వెల్లడించింది.నిర్దేశిత పరీక్షా విధానాలను కచ్చితంగా పాటించాలని విద్యాశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి అధికారులను ఆదేశించారు. ప్రశ్నపత్రాల గోప్యతను దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక గదులు ఎయిర్-గ్యాప్డ్ సిస్టమ్స్ (ఇంటర్నెట్‌తో సంబంధం లేని వ్యవస్థలు), పరికరాలను భద్రపరిచే విధానాలను పూర్తిగా పునర్ వ్యవస్థీకరించాలని ఆదేశించారు. అన్ని పరీక్షా ప్రక్రియలపై సమగ్ర ఆడిట్ నిర్వహించి, నివేదిక సమర్పించాలని ఎన్‌టీఏను ఆదేశించారు. సోమవారం కేంద్ర విద్యాశాఖ మంత్రి.. ఎన్‌టీఏ డైరెక్టర్ జనరల్ సహా ఇతర ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. సమావేశం అనంతరం ఈ ప్రకటన వెలువడింది. నీట్ ప్రశ్నపత్రాల లీకేజీ కి వ్యతిరేకంగా ఇటీవల దిల్లీలో కాక్రోచ్ జనతా పార్టీ ఆందోళన చేపట్టిన విషయం తెలిసిందే. దేశవ్యాప్తంగా వేలాదిమంది యువతతో పాటు ప్రతిపక్షాలు కూడా ఈ నిరసనల్లో పాల్గొన్నాయి. ఈ నేపథ్యంలో విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. తాజాగా ప్రశ్నపత్రాల్లో పలు తప్పులు దొర్లాయన్న ఫిర్యాదుల నేపథ్యంలో యూజీసీ నెట్ ఇంగ్లిష్, కామర్స్, సోషియాలజీ సబ్జెక్టులకు మళ్లీ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆదివారం ఎన్‌టీఏ ప్రకటించింది. మరుసటి రోజే ఏజెన్సీలో ప్రక్షాళన చేపట్టడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# బ్యాంకింగ్‌పై త్వరలో ఉన్నతస్థాయి కమిటీ

### వికసిత్ భారత్ లక్ష్యాలు..



**న్యూఢిల్లీ:**'వికసిత్ భారత్ 2047' లక్ష్య సాధనలో బ్యాంకింగ్ రంగం పాత్రను సమీక్షించేందుకు త్వరలో ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయబోతున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. ఈ కమిటీ బ్యాంకింగ్ రంగానికి భవిష్యత్ ప్రణాళికలు రూపొందిస్తుందని తెలిపారు. రాబోయే రెండు దశాబ్దాల్లో దేశాభివృద్ధికి అవసరమైన మార్పులను కమిటీ సూచిస్తుందన్నారు. ఈ మేరకు ప్రభుత్వరంగ బ్యాంకుల సదస్సులో ఆమె మాట్లాడారు. బ్యాంకింగ్ రంగంలో చేపట్టాల్సిన సంస్కరణలపై తమ సిఫార్సులు, సూచనలు అందించాలని ఈ సందర్భంగా బ్యాంకు అధిపతులను కేంద్రమంత్రి కోరారు. వికసిత్ భారత్ లక్ష్యాలను చేరుకోవడానికి ఇంకా కేవలం 20 ఏళ్లు మాత్రమే ఉన్నాయని నిర్మలా సీతారామన్ అన్నారు. కాబట్టి ఈ తక్కువ సమయంలో బ్యాంకింగ్ రంగాన్ని అందుకు అనుగుణంగా సిద్ధం చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం నిరర్థక ఆస్తులు (ఔఖంబ) కనిష్ఠ స్థాయికి చేరాయన్నారు. కాబట్టి రాబోయే రెండు దశాబ్దాల ఆర్థిక వృద్ధికి అవసరమైన సంస్కరణలను వేగవంతం చేయడానికి ఇదే సరైన సమయమని ఆమె పేర్కొన్నారు.బ్యాంకింగ్ అంశంపై కాన్‌క్లేవ్‌లో చర్చించాల్సిన ఏడు అంశాలను డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ గుర్తించిందని నిర్మలా సీతారామన్ తెలిపారు. యువతకు బ్యాంకింగ్ సేవలను చేరువ చేయడం, పెట్టుబడుల ప్రోత్సాహం, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు, ప్రాధాన్య రంగాలకు రుణాలు, క్రెడిట్ కార్డు వ్యాపార పునర్నిర్మాణం వంటివి ఇందులో ఉన్నాయని చెప్పారు. ముఖ్యంగా యువతపై దృష్టి సారించాలని బ్యాంకులకు సూచించారు. తమ ప్రణాళికల్లో డెమోగ్రఫిక్ ప్రొఫైల్‌ను పరిగణనలోకి తీసుకోవాలని నిర్మలా సీతారామన్ తెలిపారు.

## నిద్రలోనే అగ్నికి ఆహుతి

అక్కడికి చేరుకున్న సహాయక బృందాలు.. స్థానికులతో కలిసి రక్షణ చర్యలు చేపట్టారు.ౖ÷ర్ ఇంజిన్లతో మంటలను అదుపు చేసి మృతులను, గాయపడిన వారిని రాంపూర్‌హాట్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. కాగా, బాధితులంతా ప్రసిద్ధ కాళీ ఆలయాన్ని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులుగా తెలుస్తోంది. అగ్నిప్రమాద ఘటనపై కోల్‌కతాకు చెందిన ఓ బాధిత మహిళ అతిథి స్పందించారు. హోటల్ మొత్తం పొగతో నిండిపోయిందని, దాని వల్ల చాలా మంది తప్పించుకోలేక పోయారని తెలిపారు. అలాగే, పలువురు శ్వాస తీసుకోవడంలోనూ ఇబ్బంది పడ్డారని వెల్లడించారు. బయటకు వచ్చేందుకు దారి కనిపించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు, ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. హోటల్‌లో కనీస అగ్నిమాపక భద్రతా చర్యలు లేవని ప్రాథమిక దర్యాప్తులో తేల్చారు.ౖ÷ర్ అలారం కూడా పనిచేయలేదని పేర్కొన్నారు. బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## నెల్లూరులో రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్

**హైదరాబాద్:** ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరులో తమ సేవలు ఆరంభమైనట్లు రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ ఆదివారం ప్రకటించింది. అక్కడి 70 పడకల ప్రైమ్ చిల్డ్రన్స్ హాస్పిటల్‌లో మెజారిటీ వాటా స్వాధీనం చేసుకుని, అక్కడి క్లినికల్ సిబ్బందిని కొనసాగిస్తూనే, సూపర్-స్పెషాలిటీ సేవలు ఆరంభిస్తున్నట్లు వెల్లడించింది. నవజాత శిశు, పిల్లల ఇంటెన్సివ్ కేర్, పీడియాట్రిక్ సూపర్-స్పెషాలిటీ క్లినికల్ సేవలు, పీడియాట్రిక్ సర్జరీ, 24/7 అత్యవసర సంరక్షణతో రవాణా సేవలు అందిస్తామంది. చిన్నారులకు ప్రత్యేకమైన కార్డియాలజీ, న్యూరాలజీ, నెఫ్రాలజీ, రీనల్ ట్రాన్స్‌ప్లాంట్, బోన్ మ్యారో ట్రాన్స్ ప్లాంట్, లివర్ ట్రాన్స్‌ప్లాంట్, ఆంకాలజీ, హెపటాలజీ సేవలూ అందిస్తామని వివరించింది. ఇప్పటికే విశాఖపట్నం, రాజమండ్రి, విజయవాడల్లో రెయిన్‌బో ఆసుపత్రులుండగా.. తన జన్మస్థలమైన నెల్లూరులో అత్యాధునిక వైద్య సేవలకు శ్రీకారం చుట్టడం గర్వకారణంగా ఉందని రెయిన్‌బో చిల్డ్రన్స్ మెడికేర్ ఛైర్మన్-మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రమేష్ కంచర్ల పేర్కొన్నారు. అత్యాధునిక వైద్య సేవల కోసం దూరప్రాంతాలకు వెళ్లే అవసరం ఇక ఉండదని ప్రైమ్ రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ ప్రీతమ్ కుమార్ రెడ్డి అన్నారు.

### టెక్ ప్రియులకు మరో షాక్..

# స్మార్ట్‌ఫోన్ ధరలు మరింత పైకి

'మరికొన్ని రోజులు ఆగితే ఆఫర్లు మొదలవుతాయ్.. అప్పుడు డిస్కౌంట్‌లో మంచి ఫోన్ కొందాంలే' అని వేచి చూస్తున్న టెక్ ప్రియులకు చేదువార్త. మొబైల్ కంపెనీలు మరోసారి తమ స్మార్ట్‌ఫోన్ ధరలను పెంచేశాయి. కనీసం రూ.2 వేల నుంచి గరిష్ఠంగా రూ.10వేల వరకు ధరల పెంపు చేపట్టాయి. ధరలు సవరించిన జాబితాలో వన్‌ప్లస్, పోకో, రెడ్‌మీ, ఐకూ కంపెనీలు ఉన్నాయి. మెమొరీ చిప్‌ల ధరల పెరుగుదలను కారణంగా చూపుతూ ఆయా కంపెనీలు.. ఇది వరకే ధరలు పలుమార్లు ధరలు సవరించడం గమనార్హం. దీంతో సామాన్యుడికి తక్కువ బడ్జెట్‌లో ఫోన్ దొరకడం గగనంగా మారింది.




**సవరించిన ధరలు ఇలా..**

ప్రముఖ స్మార్ట్‌ఫోన్ కంపెనీ వన్‌ప్లస్ తన నార్డ్ 6 సిరీస్ వేరియంట్ ధరలను పెంచేసింది. నార్డ్ 6, నార్డ్ సీఈ 6, నార్డ్ సీఈ6 లైట్‌తో పాటు కొత్తగా లాంచ్ చేసిన ఎన్6 ఎక్స్, ఎన్6 స్మార్ట్‌ఫోన్లపై గరిష్ఠంగా రూ.4 వేల వరకు ధరల పెంపు చేపట్టింది.వివో అనుబంధ సంస్థ ఐకూ కూడా 15 సిరీస్ ధరలను సవరించింది. ఐకూ 15 ధరను రూ.8 వేల వరకు, ఐకూ 15ఖీపై రూ.5 వేల వరకు, ఐకూ నియో 10 సిరీస్ ధరలను రూ.2 వేల వరకు పెంచింది. షావోమి అనుబంధ పోకో కూడా తన ఫోన్ల ధరలను పెంచింది. పోకో ఎక్స్8 ప్రో, ప్రో మాక్స్ వేరియంట్ల ధరలను గరిష్ఠంగా రూ.5 వేల వరకు పెంచేసింది. రెడ్‌మీ కూడా తన టర్బో 5 స్మార్ట్‌ఫోన్‌పై రూ.5వేలు పెంచింది.ఒప్పో కూడా కే13 టర్బో ప్రో వేరియంట్‌పై రూ.5 వేల వరకు ధరలను సవరించింది. వివో తన వై సిరీస్ ధరలను సవరించింది. జ51 ఖతీనీ, జ31 5ఉ, జ21, జ11, జ19బ స్మార్ట్‌ఫోన్ ధరలను రూ.4 వేల వరకు పెంచింది.

## ఇరాన్‌పై అణుదాడికి ట్రంప్ ప్రణాళికలు

కూడా ఎదురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు.కాగా యుద్ధం జరుగుతున్నంతకాలం ప్రజలు భయపడుతూనే జీవించాల్సి ఉంటుందని ఇరాన్ మాజీ అధ్యక్షుడు మహమ్మద్ ఖతామీ పేర్కొన్నారు. ఈ పరిస్థితులు తొలగిపోయి శాంతియుత వాతావరణం నెలకొనేలా దౌత్య విధానాలను అవలంభించాలని ప్రభుత్వానికి సూచించారు. ఇన్నాళ్లు బాహ్య ఒత్తిడిని తట్టుకొని ప్రభుత్వం నిలబడినప్పటికీ.. యుద్ధ పరిస్థితులు ఇలాగే కొనసాగితే ప్రజల్లో అసంతృప్తి పెరిగే అవకాశం ఉందన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
18 ఆగస్టు 2026

## ప్రజావాణి అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలి

**జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశం**

**రాజన్న సిరిసిల్ల బ్యూరో, (జనంసాక్షి):** ప్రజావాణిలో ప్రజలు సమర్పించే అర్జీలను సంబంధిత అధికారులు సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం సమర్పించిన అర్జీలపై అధికారులు బాధ్యతగా వ్యవహరించి, ఎప్పటికప్పుడు పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఐడీఓసీ ప్రజావాణిలో మొత్తం 136 దరఖాస్తులు అందగా, వాటిని సంబంధిత శాఖల అధికారులకు అందజేసి పరిష్కరించాలని ఆదేశించారు. సిరిసిల్ల ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో రెండు దరఖాస్తులు, వేములవాడ ఆర్డీఓ కార్యాలయంలో ఏడు దరఖాస్తులు అందాయి.

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని మండలాల్లో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎంపీడీఓ కార్యాలయాల్లో ప్రజావాణి నిర్వహించారు. ప్రతి సోమవారం ఐడీఓసీతో పాటు సిరిసిల్ల, వేములవాడ ఆర్డీఓ కార్యాలయాలు, అన్ని ఎంపీడీఓ కార్యాలయాల్లో ప్రజావాణి కొనసాగుతుందని తెలిపారు. ప్రజలు తమ సమస్యలను స్థానికంగా సంబంధిత కార్యాలయాల్లో అర్జీల రూపంలో సమర్పించాలని కోరారు. ప్రజావాణిలో అందిన దరఖాస్తులన్నింటినీ ఆన్‌లైన్‌లో నమోదు చేసి సంబంధిత శాఖలకు పంపుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ, జడ్పీ సీఈవో వెంకట మాధవరావు, ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత తదితరులు పాల్గొన్నారు.

## పీఆర్సీ, డీఏలు వెంటనే ప్రకటించి అమలు చేయాలి

- పెండింగ్ బిల్లులు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించాలి
- సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహ దినం పాటించాలని నిర్ణయం
- న్యూ ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్‌లో లోపాలు సవరించాలి



**కరీంనగర్ బ్యూరో, ఆగస్టు 17 (జనంసాక్షి):** ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ (టీఎన్జీవోలు) రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పలు కీలక తీర్మానాలు చేశారు. టీఎన్జీవోల కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ అధ్యక్షతన, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ఏ. ముజీబ్ హుస్సేన్ కార్యనిర్వహణలో నాంపల్లిలోని టీఎన్జీవోల కేంద్ర సంఘ కార్యాలయంలో సమావేశం జరిగింది. సమావేశానికి రాష్ట్ర కార్యవర్గ సభ్యులతో పాటు 33 జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హాజరయ్యారు. ఉద్యోగుల పీఆర్సీ, డీఏలు, పెండింగ్ బిల్లులు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఎంప్లాయీ హెల్త్ స్కీమ్ తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దారం శ్రీనివాస్‌రెడ్డి ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర కార్యవర్గం దృష్టికి తీసుకెళ్లారు. ఉద్యోగుల పెన్షన్ విధానంలో జరుగుతున్న అన్యాయాలపై నిరసన కార్యక్రమాలు చేపట్టాలని, సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహ దినంగా పాటించాలని సమావేశం నిర్ణయించింది. న్యూ ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్‌లోని లోపాలను తక్షణమే సవరించి ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానం చేశారు. ఉద్యోగులకు పీఆర్సీని వెంటనే ప్రకటించి అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయాలని, పెండింగ్ బిల్లులు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఇతర ఆర్థిక ప్రయోజనాలను ఎలాంటి జాప్యం లేకుండా చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ ఎన్జీవో కేంద్ర సంఘం ఆధ్వర్యంలో టీఎన్జీవోల జెండా, కండువాను ఆవిష్కరించడం ఉద్యోగుల ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జీవితకాల చందా కార్యక్రమంలో భాగంగా కరీంనగర్ జిల్లా సభ్యుల నుంచి సేకరించిన రూ.2.82 లక్షల విలువైన చెక్కును కేంద్ర సంఘ నాయకులకు అందజేశారు. జిల్లా సంఘం చేసిన కృషిని కేంద్ర సంఘ నాయకులు అభినందించారు. కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా కార్యదర్శి సంఘము లక్ష్మణరావు, సర్దార్ అరవింద్‌సింగ్, రాగి శ్రీనివాస్, గూడ ప్రభాకర్‌రెడ్డితో పాటు ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బొంకూరు శంకర్, సందీప్‌రెడ్డి, మిర్యాల నాగేందర్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి, ప్రవీణ్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 19న మంథనిలో మంత్రి శ్రీధర్ బాబు బహిరంగ సభ

**ఏర్పాట్లను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్**



మంథని, ఆగస్టు 17,( జనంసాక్షి): ఈ నెల 19న బుధవారం పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలో రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు నిర్వహించనున్న బహిరంగ సభకు సంబంధించిన ఏర్పాట్లను మంథని మున్సిపల్ పాలకవర్గం పరిశీలించింది. మున్సిపల్ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్, వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో పాలకవర్గ సభ్యులు సభా ప్రాంగణాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సభకు పెద్ద సంఖ్యలో ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో పార్కింగ్, తాగునీరు, పారిశుద్ధ్యం, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని చర్యలు ముందుగానే పూర్తి చేయాలని చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్ అధికారులకు, సిబ్బందికి సూచించారు. మంత్రి శ్రీధర్ బాబు సభను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని ఆయన కోరారు. సభ ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ పాలకవర్గ సభ్యులు పెంటరి రాజు, యేల్లంకి వంశీధర్, నాయకులు ఎరుకల రమేష్, ఖాజా, సామ్రాట్ పాల్గొన్నారు.

## ముదుమాల్ నిలువు రాళ్లపై కేంద్రానికి నివేదిక


**కృష్ణ, ఆగస్టు 17: (జనం సాక్షి):** కృష్ణ మండలం ముదుమాల్ నిలువు రాళ్లపై కేంద్రానికి నివేదిక సమర్పించనున్నారు.సోమవారం నిలువు రాళ్ళ వద్దకు ఆర్చియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా ,డిపార్ట్మెంట్ ఆఫ్ హెరిటేజ్తెలంగాణ – దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ సంయుక్త అధ్యయనం చేశారు. ముదుమాల్‌లోని మెగాలిథిక్ మెన్‌హిర్స్ ప్రాంతాన్ని పరిశీలించేందుకు పురావస్తు, వారసత్వ రంగాలకు చెందిన నిపుణులు రేపు, 18 ఆగస్టు 2026 మధ్యాహ్నం 12 గంటలకు ముదుమాల్ నిలువురాళ్ల స్టడీ సర్వే నిర్వహిస్తారు ,తదుపరి కృష్ణ నది ఒడ్డునవున్న శివాలయం, మఠము, గ్రామస్తులను కలిసి కథనాలు తెలుసు కొని ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నిలువురాళ్ల విశిష్టత తెలుపుతారు.ఈ కార్యక్రమంలో దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ చైర్మన్ ,ప్రొఫెసర్ మణికొండ వేదకుమార్, ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా హైదరాబాద్ సర్కిల్ సూపరింటెండెంట్ ఆర్కియాలజిస్ట్ శ్రీ నిహిల్ దాస్, డిప్యూటీ సూపరిం టెండెంట్ డా. రోహిణి పాండే అంబేకర్, ప్రొఫెసర్ కె. పి. రావు,డొసియర్ ఎక్స్పర్ట్, తెలంగాణ హెరిటేజ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పాల్గొంటారు.

## చిరుత దాడిలో మూడు మేకలు మృతి

**గండీడ్, (జనంసాక్షి):** గండీడ్ మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన చెన్నారం పకీరయ్యకు చెందిన,మేకలపై చిరుత దాడి చేసింది.సోమవారం కొండాపూర్ శివారులోని బొందేగట్టు ప్రాంతానికి మేకలు మేతకు వెళ్లగా చిరుత ఒక్కసారిగా దాడి చేసినట్లు బాధితుడు తెలిపాడు. ఈ ఘటనలో మూడు మేకలు మృతి చెందాయి.రెండు మేకలు మాత్రమే లభించగా,మరో మేక ఆచూకీ లభిం చలేదు. చిరుత దాడితో గ్రామస్థులు, పశువుల కాపరులు భయాందోళనకు గురవుతున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించి. చిరుతను పట్టుకుని, తమకు నష్టపరిహారం అందించాలని బాధితుడు కోరాడు.

## గాగిరెడ్డిపల్లెలో 'చీకటి' రాజ్యం

- రెండు నెలలుగా వెలగని వీధి దీపాలు
- పాలకవర్గం నిర్లక్ష్యం..విద్యుత్ శాఖ వైఫల్యం
- చీకట్లో కొట్టుమిట్టాడుతున్న 7, 8 వార్డులు.



**చిగురుమామిడి ఆగస్టు 17(జనంసాక్షి):** మండలంలోని గాగిరెడ్డిపల్లె గ్రామ పరిధిలో గల బరిగెలపల్లిలోని 7,8వ వార్డుల ప్రజలు గత రెండు నెలలుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీధి దీపాలు వెలగకపోవడంతో ఆయా వార్డులు చీకటిమయం గా మారాయి. రాత్రి వేళల్లో భయానక వాతావరణం నెలకొందని స్థానిక ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ సందర్భంగా స్థానికులు బరిగెల శ్రీకాంత్,బరిగెల మహేష్, బరిగెల లక్ష్మణ్, బరిగేల శ్రీకాంత్ లు మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాకాలం సీజన్ కావడంతో చీకట్లో విషపురుగులు,పాముల సంచారం తీవ్రంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.కనీసం ఒకరి ఇంటి నుంచి మరొకరి ఇంటికి వెళ్లాలన్నా ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకోవాల్సి వస్తోందని ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంపై మండిపడ్డారు.విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం,సరఫరాలో ఉన్న సాంకేతిక లోపాల వల్లే ఈ సమస్య తలెత్తిందని,బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.సర్పంచ్ సన్నీళ్ల కవిత వెంకటేష్ ను ఈ విషయంపై వివరణ కోరగా ఇటీవల రెండుసార్లు వీధి దీపాలు వేయించినట్లు తెలిపారు.అయితే 11కేవీ విద్యుత్ సరఫరాలో ఉన్న సాంకేతిక లోపాల కారణంగానే దీపాలు తరచూ పోతున్నాయని వివరించారు. దీనివల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులు తమ దృష్టికి వచ్చాయని,వెంటనే విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని వారు హామీ ఇచ్చారు.

## విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

**కరీంనగర్ టౌన్, ఆగస్టు 17 ( జనం సాక్షి)** విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో మంత్రి పొన్నం ప్రభాకర్ ఇంటి ముట్టడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అంగిడి కుమార్ మాట్లాడుతూ.. గత రెండున్నరేళ్లుగా విద్యార్థులకు రావాల్సిన స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం విడుదల చేయకుండా కాలయాపన చేస్తోందని ఆరోపించారు.పేదరికం విద్యార్థుల చదువుకు ఆటంకం కాకూడదనే ఉద్దేశంతో అమలు చేస్తున్న ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని నిర్వీర్యం చేసేలా ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. విద్యార్థుల నిరసనలు, విద్యాసంస్థల బందులు చేపట్టినా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. కమిటీల పేరుతో రెండేళ్లుగా కాలయాపన చేస్తోందని ఆరోపించారు.

రీయింబర్స్‌మెంట్ బకాయిల కారణంగా ఇంజినీరింగ్, మెడిసిన్, ఫార్మసీ, డిగ్రీ, ఇంటర్ విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పలు విద్యాసంస్థల యాజమాన్యాలు చదువులు పూర్తయిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.ఆగస్టు 20లోపు కోర్టు ఆదేశాలను అమలు చేసి విద్యార్థుల ఖాతాల్లో స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను జమ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షులు వెల్దిరాజు మానుపాటి కార్తీక్, మానుపాటి సవర్ధన్, కట్ట శ్రీకర్, వంశీ, అరుణ్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

## పీఎంజే జ్యువెలర్స్ దోపిడీ ముఠాపై పీడీ యాక్ట్

- ప్రధాన నిందితులైన ఐదుగురిపై నిర్బంధ ఉత్తర్వులు
- తుపాకులతో కాల్పులు జరిపి రూ.82 లక్షల విలువైన బంగారం దోపిడీ
- ఇప్పటివరకు 8 మంది అరెస్ట్
- నేరస్థులపై కఠిన చర్యలు తప్పవు: సీపీ గౌష్ ఆలం



**కరీంనగర్ బ్యూరో, ఆగస్టు 17 (జనంసాక్షి):** కరీంనగర్ పట్టణంలోని పీఎంజే జ్యువెలర్స్‌లో జరిగిన సంచలన బందిపోటు దొంగతనం కేసులో ప్రధాన నిందితులైన ఐదుగురు ముఠా సభ్యులపై పోలీసులు పీడీ యాక్ట్ అమలు చేశారు. ఈ మేరకు కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం సోమవారం నిర్బంధ ఉత్తర్వులు జారీ చేశారు. గత మే 3న పీఎంజే జ్యువెలర్స్‌లోకి చొరబడిన దుండగులు సిబ్బందిపై తుపాకులతో కాల్పులు జరిపి సుమారు రూ.82 లక్షల విలువైన బంగారు ఆభరణాలను దోచుకెళ్లిన విషయం తెలిసిందే. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. కేసు దర్యాప్తులో భాగంగా ఇప్పటివరకు ఎనిమిది మంది నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. వారిలో ప్రధాన నిందితులైన రఘునాథ్ కర్మాకర్ అలియాస్ జాగీరాసింగ్ (41), పశ్చిమబెంగాల్, రావిష్‌కుమార్ అలియాస్ ప్రద్యుమాన్ (23), నలంద జిల్లా, బిహార్, సూర్యమణికుమార్ అలియాస్ సనోజ్ (21), నలంద జిల్లా, బిహార్, యాదవ్ అలియాస్ జైనుల్ అబ్దిన్ (33), ఫుల్వారీ షరీఫ్, పాట్నా జిల్లా, బిహార్, మొహమ్మద్ ఆదిల్‌ఖాన్ (31), ఫుల్వారీ షరీఫ్, పాట్నా జిల్లా, బిహార్‌లపై ఆగస్టు 17న పీడీ యాక్ట్ కింద నిర్బంధ ఉత్తర్వులు జారీ చేశారు. నిందితుల నేర కార్యకలాపాలను అరికట్టడంతో పాటు ప్రజల భద్రతకు భరోసా కల్పించడం, భవిష్యత్తులో ఇలాంటి నేరాలకు పాల్పడే వారిలో భయాన్ని కలిగించే ఉద్దేశంతో పీడీ యాక్ట్ అమలు చేసినట్లు పోలీసులు తెలిపారు. సీపీ జారీ చేసిన నిర్బంధ ఉత్తర్వులను కరీంనగర్ జిల్లా జైలులో నిందితులకు అందజేసిన అనంతరం చర్లపల్లి కేంద్ర కారాగారానికి తరలించారు. పీడీ యాక్ట్ అమలులో కీలకంగా వ్యవహరించిన కరీంనగర్ పట్టణ ఏసీపీ ఎన్.వెంకటస్వామి, కరీంనగర్ రెండో పట్టణ సీఐ కె.సృజన్‌రెడ్డి, పీడీ సెల్ పందరి, హెడ్ కానిస్టేబుల్ శంకర్‌ను పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం అభినందించారు. ప్రజల భద్రతకు విఘాతం కలిగించే నేరాలకు పాల్పడే వారిపై కరీంనగర్ పోలీసులు కఠినంగా వ్యవహరిస్తారని, నేరస్థులపై చట్టపరమైన చర్యలు నిరంతరం కొనసాగుతాయని సీపీ స్పష్టం చేశారు.

## అక్రమ ఇసుక రవాణా చేస్తున్న మూడు ట్రాక్టర్లు పట్టివేత

**కరీంనగర్ క్రైమ్, ఆగస్టు 17 ( జనంసాక్షి) :** సోమవారం రోజున పోలీసులు గ్రామాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా కరీంనగర్ రూరల్ మండలంలోని చేగుర్తి గ్రామానికి చెందిన మిరియాల నరేష్, బెజ్జంకి సంతోష్, చామనపల్లి నాగరాజు అనువారు ఎటువంటి అనుమతులు లేకుండా మానేరువాగు నుండి అక్రమంగా ఇసుకను దొంగలించి తమ ట్రాక్టర్లలో రవాణా చేస్తుండగా బొమ్మకల్ లోని లారీ అసోసియేషన్ చౌరస్తా వద్ద కరీంనగర్ రూరల్ పోలీసులు పట్టుకున్నారు అట్టి నిందితులను అదుపులోకి తీసుకొని పంచుల సమక్షంలో పంచనామా నిర్వహించి అట్టి ట్రాక్టర్లను సీజ్ చేసి కేసు నమోదు చేసి తదుపరి చర్య నిమిత్తం కోర్టుకు పంపించడం జరిగింది, ఎవరైనా అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సస్పెక్ట్ షీట్లు తెరుస్తామని కరీంనగర్ రూరల్ ఇన్స్పెక్టర్ ఏ నిరంజన్ రెడ్డి హెచ్చరించారు.

## బిజెపి ఓబీసీ మోర్చ మొదటి రాష్ట్ర కార్యవర్గ సమావేశం



**జగిత్యాల జిల్లా క్రైమ్,ఆగస్టు17 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్ర బిజెపి ఓబీసీ మోర్చా కార్యవర్గ సమావేశాన్ని హైదరాబాదులోని బిజెపి కార్యాల యం నందు మొదటి సమావేశాన్ని హిమాచల్ ప్రదేశ్ మాజీ రాష్ట్ర గవర్నర్, మాజీ కేంద్రమంత్రి బండారు దత్తాత్రేయ, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు అధ్యక్షతన ఘనంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఓబీసీల సమస్యలపై కార్యచరణను ఏర్పాటు చేసి వాటి సాధనగా ప్రతి ఒక్కరు కృషి చేసే విధంగా సమీక్ష సమావేశాలను నిర్వహించారు. ఓబీసీల హక్కులు రాజకీయంగా వారి కోట సాధించే విధంగా ప్రణాళికను తయారుచేసి అమలుపరిచే విధంగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర రావు, జాతీయస్థాయి ఓబీసీ అధ్యక్షులు లక్ష్మణ్, రిటైర్డ్ గవర్నర్, మాజీ కేంద్ర మంత్రి బండారు దత్తాత్రేయ, ఓబిసి అధ్యక్షుడు ఆనంద్ గౌడ్, ఓబిసి రాష్ట్ర ఉపాధ్యక్షులు మచ్చ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## చెట్టును ఢీకొన్న కారు.. సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి


**చేవెళ్ల, ఆగస్టు 17 (జనంసాక్షి):** చేవెళ్ల మండల పరిధిలోని మల్కాపూర్ గ్రామ శివారులో సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి గుడిపూడి హరీష్ (38) మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని నార్సింగి, గండి పేట్ పరిధి మైహోమ్ అవతార్‌లో నివాసముం టున్న హరీష్ రామన్నగూడకు హ్యుందాయ్ క్రెటా కారులో వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. కారును కావ్య (35) నడుపుతుండగా హరీష్ ముందు ఎడమవైపు సీటులో కూర్చున్నాడు. కారు వేగంగా, అజాగ్రత్తగా, నిర్లక్ష్యంగా నడపడంతో అదుపుతప్పి రహదారి ఎడమవైపు న ఉన్న చెట్టును ఢీకొన్నట్లు మృతుడి తండ్రి గుడిపూడి వెంకటేశ్వరరావు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రమాదంలో కారు ముందు భాగం పూర్తిగా దెబ్బతింది. హరీష్‌కు తలపై తీవ్ర గాయం, రెండు కాళ్లకు గాయాలతో పాటు ఛాతీ భాగంలో బలమైన గాయం కావడంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు క్షతగాత్రులను చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## చీరతో కట్టి.. కర్రతో కొట్టి.. ప్రమాదంగా చిత్రీకరణ!

- సీసీ కెమెరాల్లో ప్రమాద దృశ్యాలు లేకపోవడంతో బయటపడిన అసలు విషయం
- పోస్టుమార్టం, వైద్య నివేదికలతో పోలీసులకు అనుమానం
- భర్తను హత్య చేసిన భార్య అరెస్ట్.. రిమాండ్‌కు తరలింపు



భర్తను చంపిన భార్య ఫోటో సునీత



చనిపోయిన వ్యక్తి సత్యనారాయణ

**బోడుప్పల్, ఆగస్టు 17 (జనంసాక్షి):** భర్తను చీరతో కట్టేసి కర్రతో కొట్టి హత్య చేసి, వాహనం నుంచి జారిపడి గాయపడినట్లు చిత్రీకరించేందుకు ప్రయత్నించిన ఘటనను మేడిపల్లి పోలీసులు ఛేదించారు. పోస్టుమార్టం నివేదిక, వైద్యుల అభిప్రాయం, సంఘటనా స్థలంలో లభించిన ఆధారాలు, సీసీ కెమెరాల దృశ్యాల ఆధారంగా అసలు విషయాన్ని వెలుగులోకి తీసుకొచ్చినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసులో మృతుడి భార్య సునీత (44)ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్‌కు తరలించారు. మేడిపల్లి సీఐ డి.జలంధర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పీర్జాదిగూడ రాఘవేంద్రకాలనీకి చెందిన సత్యనారాయణ (51) ఆగస్టు 6న నైట్ డ్యూటీ ముగించుకుని మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఇంటికి వచ్చాడు. అతడి భార్య సునీత రోజువారీ పనులకు వెళ్లి మధ్యాహ్నం 1.30 గంటలకు ఇంటికి చేరుకుంది. సత్యనారాయణ మద్యం సేవించడంతో భార్యాభర్తల మధ్య గొడవ జరిగినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఈ సందర్భంగా సత్యనారాయణ తనను, పిల్లలను చాలాకాలంగా మానసికంగా వేధిస్తున్నాడనే ఆగ్రహంతో సునీత అతడిపై దాడికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. గొడవ అనంతరం సునీత తన భర్త చేతులు, కాళ్లను చీరతో కట్టేసి, సెంట్రింగ్ పనులకు ఉపయోగించే కర్రతో తలతో పాటు శరీరంలోని ఇతర భాగాలపై తీవ్రంగా దాడి చేసినట్లు విచారణలో తేలింది. తీవ్ర గాయాలతో సత్యనారాయణ స్పృహ కోల్పోయాడు. అనంతరం సునీత తన కుమారుడు నికిత్‌కు ఫోన్ చేసి తండ్రి వాహనం నుంచి ప్రమాదవశాత్తు జారిపడి గాయ పడినట్లు చెప్పినట్లు పోలీసులు వెల్లడించారు. కుటుంబ సభ్యులు సత్య నారాయణను బోడుప్పల్‌లోని మెడిస్టార్ ఆసుపత్రికి తరలించగా, వైద్యుల సూచనతో గాంధీ ఆసుపత్రికి తీసుకెళ్లారు. రాత్రి 10.18 గంటలకు పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. తొలుత ఘటనను రోడ్డు ప్రమాదంగా భావించి బీఎన్ఎస్ సెక్షన్ 106(1) కింద కేసు నమోదు చేశారు. అయితే పోస్టుమార్టం నివేదిక, వైద్యుల అభిప్రాయంతో మృతుడి శరీరంపై ఉన్న గాయాలపై పోలీసులకు అనుమానాలు కలిగాయి. దీంతో సంఘటనా స్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించడంతోపాటు పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాలను తనిఖీ చేశారు. సునీత తెలిపిన విధంగా ఎలాంటి రోడ్డు ప్రమాదం జరిగిన ఆనవాళ్లు కనిపించకపోవడంతో విచారణను ముమ్మరం చేశారు. సునీతను అనుమానంతో విచారించగా అసలు విషయం బయటపడినట్లు పోలీసులు తెలిపారు. భర్త తనను, పిల్లలను మానసికంగా వేధిస్తున్నాడనే కారణంతో అతడి చేతులు, కాళ్లను చీరతో కట్టి కర్రతో దాడి చేసినట్లు ఆమె అంగీకరించినట్లు పేర్కొన్నారు. నిందితురాలిని చట్టప్రకారం అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరుపరచగా కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు మేడిపల్లి పోలీసులు తెలిపారు.




## అక్రమంగా తరలిస్తున్న పిడిఎస్ బియ్యం పట్టివేత

**కొత్తపల్లి ఆగస్టు17 (జనం సాక్షి) :** ప్రజా పంపిణీ వ్యవస్థ (పిడిఎస్) ద్వారా పేదలకు అందించాల్సిన బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని అధికారులు పట్టుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు నిర్వహించిన తనిఖీల్లో భారీ మొత్తంలో పిడిఎస్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, ప్రభుత్వ సంక్షేమ పథకాల కింద లబ్ధిదారులకు పంపిణీ చేయాల్సిన బియ్యాన్ని కొందరు వ్యక్తులు అక్రమంగా సేకరించి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు గుర్తించారు. వెంటనే స్పందించిన అధికారులు వాహనాన్ని తనిఖీ చేసి బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.

ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. పిడిఎస్ బియ్యం అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. మద్దూరు పోలీస్ టౌన్ లో పట్టుకొని మొత్తం మూడు కేసులు నమోదు చేయడం జరిగిందని ఎస్సై విజయ్ కుమార్ తెలిపారు. విశ్వసనియసమాచారం మేరకు తనిఖీలు నిర్వహించగా రెండు ఆటోలు ఒక డంపు వాహనంలో అక్రమంగా తరలిస్తున్న వీడిఎస్ బియ్యాన్ని పట్టుకున్నారు 1. ఎం రాజేందర్ సన్నాఫ్ వెంకయ్య. గ్రామం మల్కాపూర్ మండల కోయిలకొండ.2 బోయిని ఆంజనేయులు సన్నాఫ్ హనుమంతు రెనువట్ల గ్రామం మద్దూరు మండలం ఆటోలో పట్టుకున్నారు.1.65 క్వింటాళ్ల బండారి నరసింహులు సన్నాఫ్ దానప్ప.5.09 క్వింటాళ్ల బూనిడి శివారులోని పొలం వద్ద డంపు పట్టుకున్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థలో అవకతవకలు జరగకుండా ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని అధికారులు కోరారు.

## సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ భద్రతా చర్యలు



శేరిలింగంపల్లి, ఆగస్టు 17 (జనంసాక్షి) : ఖాజాగూడ డిపిఎస్ మరియు మల్కంచెరువు ప్రాంతాలలో ట్రాఫిక్ పోలీస్ విభాగం జాయింట్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ సోమవారం ఆకస్మిక తనిఖీని కొనసాగించారు. సైబరాబాద్ కమ్యూనిటీకి మెరుగైన, సురక్షితమైన ట్రాఫిక్ వ్యవస్థను అందించడమే లక్ష్యంగా సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ సున్‌ప్రీత్ సింగ్ ఖాజాగూడ మరియు మల్కంచెరువు ప్రాంతాలలో పర్యటించి, అక్కడి ట్రాఫిక్ పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఖాజాగూడలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ వద్ద ఏర్పాటు చేయతలపెట్టిన ప్రతిపాదిత నూతన యూ-టర్న్ ప్రాంతాన్ని పరిశీలించడంతో పాటు, స్థానిక ప్రజలతో మాట్లాడి వారి అభిప్రాయాలను సేకరించారు. ఖాజాగూడ పరిధి ఢిల్లీ పబ్లిక్ స్కూల్ వద్ద ప్రస్తుతం ఉన్న పాత యూ-టర్న్‌ను పూర్తిగా మూసివేసి, దానికంటే సుమారు 70 మీటర్ల ముందుగా కొత్త యూ-టర్న్‌ను ఏర్పాటు చేయాలని శేరిలింగంపల్లి జోన్ ట్రాఫిక్ విభాగం అడిషనల్ డిసిపి, మాదాపూర్ ట్రాఫిక్ విభాగం ఏసిపి, రాయదుర్గం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎస్.హెచ్.ఓ ను ఈ సందర్భంగా జాయింట్ సిపి ఆదేశించారు. దీనివల్ల రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని, వాహనదారులు రాంగ్ రూట్‌లో ప్రయాణించడాన్ని పూర్తిగా నియంత్రించవచ్చని తెలిపారు. అనంతరం మల్కంచెరువు వెనుక వైపు ఉన్న హైటెన్షన్ రోడ్డును సందర్శించి ట్రాఫిక్ రద్దీనిసైతం జాయింట్ సిపి సమీక్షించారు. తక్కువ దూరంలోనే రెండు యూ-టర్న్‌లు ఉండటంవల్ల వాహనాల రాకపోకల్లో గందరగోళం ఏర్పడి ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని గుర్తించడం జరిగిందన్నారు. ఈ నేపథ్యంలో అతి తక్కువ దూరంలో ఉన్న ఆ రెండు యూ-టర్న్‌లను మూసివేయాలని అధికారులను ఆదేశించారు. రోడ్డు భద్రతను మరింత మెరుగుపరచడానికి, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడానికి మరియు వాహనాల సజావు రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా అవసరమైన అన్ని ముందస్తు చర్యలు వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీలో స్థానిక ట్రాఫిక్ అధికారులు పాల్గొన్నారు.

## టేకు చెట్లను నరికి దొంగలించిన గుర్తుతెలియని దుండగులు

**కథలాపూర్ ఆగస్టు 17 (జనం సాక్షి) :** కథలాపూర్ మండలంలోని భూషణ్ రావు పేట గ్రామంలోనీ కొంతమంది దుండగులు శనివారం రాత్రి టేకు చెట్లు కోసివేసి దొంగతనంగా తీసుకెళ్లారు. రైతు కరుణాకర్ గత 28 సంవత్సరాల నుండి టేక్ చెట్టు తమ పట్టా భూమిలో పెంచుకోన్నారు రాత్రికి రాత్రి వచ్చి దుండగులు టేక్ చెట్లు నరికి దొంగలించారు సుమారు ఒక్కో చెట్టుకు 15000 పైన ఉంటుంది, అలా ఆరు చెట్లు నరికివేసి తీసుకువెళ్లారు. ఇలా ఇంతకుముందు అలాగే ఆరు చెట్లు నరికి వేశారు మళ్లీ ఇది రెండవసారి జరిగింది ఫారెస్ట్ డిపార్ట్మెంట్ వారు వచ్చి పరిశీలించడం జరిగింది. మరియు కథలాపూర్ ఎస్ ఐ. రవికిరణ్ దుండగులు ఎవరు అయినా సరే వారి పైన కఠిన చర్యలు తీసుకోబడును అని హామీ ఇవ్వడం జరిగింది. ఇంకోసారి ఇలా పునరావృతం కాకుండా చూడాలని రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

# జటప్రోలు వంతెనపై పొంచి ఉన్న ప్రమాదం

- రైలింగ్ ధ్వంసమై పది నెలలు.. పట్టించుకోని అధికారులు
- శిథిలావస్థలో వంతెన.. భయాందోళనలో వాహనదారులు



**పెంట్లవెల్లి, ఆగస్టు 17 (జనంసాక్షి):** ఒకవైపు ఉప్పొంగుతున్న కృష్ణమ్మ.. మరోవైపు శిథిలావస్థకు చేరిన వంతెన.. నిత్యం ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణిస్తున్న వాహనదారులు. నాగర్‌కర్నూల్ జిల్లా పెంట్లవెల్లి మండలం జటప్రోలు సమీపంలో కృష్ణానదిపై సుమారు 44 ఏళ్ల క్రితం నిర్మించిన హైలెవల్ వంతెన ప్రమాదకరంగా మారింది. వంతెనపై ఇనుప చువ్వలు బయటకు కనిపిస్తూ, రైలింగ్ ధ్వంసమై ఉండటంతో ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. కొల్లాపూర్ నుంచి పెబ్బేరు వెళ్లే ప్రధాన రహదారి కావడంతో నిత్యం వందల సంఖ్యలో వాహనాలు ఈ వంతెనపై రాకపోకలు సాగిస్తుంటాయి. సుమారు పది నెలల క్రితం రాత్రి సమయంలో పెబ్బేరు నుంచి కొల్లాపూర్ వైపు వెళ్తున్న ఓ లారీ అదుపుతప్పి వంతెన రైలింగ్‌ను ఢీకొట్టడంతో కొంత భాగం ధ్వంసమైంది. అప్పటి నుంచి ఇప్పటివరకు మరమ్మతులు చేపట్టకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వంతెన కింద కృష్ణానది ఉప్పొంగుతున్న నేపథ్యంలో ప్రమాదం జరిగితే వాహనాలు నదిలో పడిపోయే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. ఈ మార్గంలో ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు తరచూ రాకపోకలు సాగిస్తున్నప్పటికీ వంతెన పరిస్థితిని పట్టించుకోకపోవడంపై మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. జటప్రోలులో నిర్మాణంలో ఉన్న ఇంటిగ్రేటెడ్ పాఠశాల భవన పనులను పరిశీలించేందుకు అధికారులు పలుమార్లు ఇదే వంతెన మీదుగా వెళ్లినా మరమ్మతులు చేపట్టకపోవడం విడ్డూరంగా ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. వంతెనపై వాహనం అదుపుతప్పితే నేరుగా కృష్ణానదిలో పడిపోయే ప్రమాదం ఉందని, ప్రాణనష్టం జరిగిన తర్వాత స్పందించకుండా ముందుగానే చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన పలువురు యువకులు కోరుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి ధ్వంసమైన రైలింగ్‌కు మరమ్మతులు చేపట్టడంతో పాటు శిథిలావస్థకు చేరిన వంతెనను పూర్తిస్థాయిలో పరిశీలించి అవసరమైన రక్షణ చర్యలు చేపట్టాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# పార్టీ మారగానే బీఆర్ఎస్ అక్రమాలు మరిచావా?

- ప్రవీణ్‌కుమార్ వైఖరిపై కాంగ్రెస్ నేతల తీవ్ర విమర్శలు
- మల్లారెడ్డి హయాంలో అభివృద్ధి కుంటుపడిందని ఆరోపణ



**బోడుప్పల్, ఆగస్టు 17 (జనంసాక్షి):** బహుజన సిద్ధాంతాల గురించి మాట్లాడిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ బీఆర్ఎస్‌లో చేరిన తర్వాత తన పాత సిద్ధాంతాలను పక్కన పెట్టారని కాంగ్రెస్ నాయకులు విమర్శించారు. గతంలో బీఆర్ఎస్ పాలనలోని అవినీతి, అక్రమాలు, భూకబ్జాలపై ప్రశ్నించిన ప్రవీణ్‌కుమార్ ఇప్పుడు అదే పార్టీ నేతల ప్రయోజనాల కోసం కాంగ్రెస్‌పై ఆరోపణలు చేయడం ఏమిటని నిలదీశారు. సోమవారం బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని పీర్జాదిగూడ డివిజన్ బండి ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ పోచారం, మేడిపల్లి, పీర్జాదిగూడ డివిజన్ల అధ్యక్షులు కర్రె రాజేష్, తుంగతుర్తి రవి, బండి శ్రీరాములు గౌడ్ మాట్లాడారు. ఇటీవల మేడ్చల్ నియోజకవర్గం బొమ్మరాశిపేటలో ప్రవీణ్‌కుమార్ చేసిన వ్యాఖ్యలను వారు తీవ్రంగా ఖండించారు. డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు అంజిరెడ్డి, అనిల్‌రెడ్డిపై నిరాధార ఆరోపణలు చేయడం సరికాదన్నారు. వ్యక్తిగత విమర్శలు, అసత్య ఆరోపణలతో రాజకీయ లబ్ధి పొందాలని చూస్తే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. బహుజన ఉద్యమ నేపథ్యం నుంచి వచ్చిన ప్రవీణ్‌కుమార్ బీఆర్ఎస్‌లో చేరిన తర్వాత తన సిద్ధాంతాలను పూర్తిగా మార్చుకున్నారని విమర్శించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వంపై తానే పలు ఆరోపణలు చేసిన ఆయన ఇప్పుడు అదే పార్టీకి మద్దతుగా నిలిచి కాంగ్రెస్‌పై విమర్శలు చేయడం అవకాశవాద రాజకీయాలకు నిదర్శనమన్నారు. కాంగ్రెస్ నేతలపై భూకబ్జాల ఆరోపణలు చేస్తున్న సమయంలో అసలైన కబ్జాదారులు ఎవరో ప్రజలకు తెలుసని, మాజీ మంత్రి మల్లారెడ్డిని ఉద్దేశించి వారు వ్యాఖ్యానించారు. ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టకుండా వ్యక్తిగత ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇచ్చారని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం ప్రభుత్వ భూములు, చెరువులు, నాలాలు, ప్రజా ఆస్తులను పరిరక్షించేందుకు చర్యలు తీసుకుంటోందని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. హైడ్రా ద్వారా ఆక్రమణలను గుర్తించి ప్రభుత్వ భూములను కాపాడతామని స్పష్టం చేశారు. కబ్జాలకు పాల్పడిన వారు ఎంతటి వారైనా, ఏ రాజకీయ పార్టీకి చెందిన వారైనా ఉపేక్షించేది లేదన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో జరిగిన అవినీతి, అక్రమాలను ప్రజల ముందుకు తీసుకొస్తామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై నిరాధార ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు ఫలించవని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ దర్గా దయాకర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఏనుగు జలేందర్‌రెడ్డి, జిల్లా నాయకులు వంగేటి ప్రభాకర్‌రెడ్డి, మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ ముదిగొండ రమేష్, ఎన్‌కేఎన్ దుర్గ, మణిరాం నాయక్, కర్రె బాల్‌రాం, ఎండీ మజార్, సుదర్శన్‌రెడ్డి, సుక్క జయేందర్ తదితరులు పాల్గొన్నారు.

# నారాయణపూర్ గ్రామాన్ని ముంపుగా ప్రకటించాలి

- డప్పుచప్పుళ్లతో ప్రజావాణికి తరలివచ్చిన గ్రామస్తులు
- అన్ని ఇండ్లకూ నష్టపరిహారం అందించాలని డిమాండ్
- అధికారులకు వినతిపత్రం సమర్పించిన 307 మంది మహిళలు



**గంగాధర, ఆగస్టు17 (జనంసాక్షి):** నారాయణపూర్ రిజర్వాయర్‌ను ఆనుకుని ఉన్న గ్రామాన్ని వెంటనే ముంపు గ్రామంగా ప్రకటించి గ్రామంలోని అన్ని ఇండ్లకు నష్టపరిహారం చెల్లించి మమ్మల్ని ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ నారాయణపూర్ గ్రామస్థులు వినూత్న నిరసన చేపట్టారు సోమవారం నారాయణపూర్ గ్రామానికి చెందిన సుమారు 307 మంది మహిళలు డప్పుచప్పుళ్లతో ప్రజావాణి కార్యక్రమానికి తరలివచ్చి, తమ సమస్యలపై అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ మహిళలు మాట్లాడుతూ రిజర్వాయర్ నిర్మాణం వల్ల ఇబ్బందులు పడుతున్న నారాయణపూర్ గ్రామాన్ని పూర్తిగా ముంపు ప్రాంతంగా గుర్తించాలని ప్రతీ ఇంటికీ పరిహారం అందించాలని స్పష్టం చేశారు.గ్రామంలోని కొద్దిమందికే పరిహారం ఇచ్చి మిగతా వారికి మొండిచేయి చూపడం తీవ్ర అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు.గత ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తక్షణమే స్పందించి మొత్తం గ్రామాన్ని ముంపు ప్రాంతంగా ప్రకటించేలా చర్యలు తీసుకోవాలని, బాధితులందరికీ న్యాయం చేయాలని వారు కోరారు.

# ఈ ఖరీఫ్ సీజన్‌లో.. లోటు వర్షపాతమే





## 30వేల ఎకరాల్లో పత్తిపంట సాగు

**ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ గాను మండల రైతాంగం అధిక మొత్తంలో పత్తిపంటను సాగు చేసేందుకు ఆసక్తి కనపరిచారు. దాదాపు 30 వేల ఎకరాలకు పైగా పంటను సాగు చేశారు. గత ఏడాది దాదాపు 36వేల ఎకరాల్లో పంటను సాగు చేయగా.. ఈ ఏడాది రైతులు పత్తి పంటకు బదులుగా చెరుకు, ఇతర పంటల సాగుపై దృష్టి సారించారు. అడపాదపగా కురిసిన సాధారణ వర్షాలతో ప్రధానంగా.. మంజీర నది పరివాహక ప్రాంతం, న్యాల్ కల్, అత్నూర్, చినిగేపల్లి, డప్పుర్, ఇబ్రహీంపూర్, తదితర గ్రామాలకు చెందిన పత్తిపంట సాగు ప్రస్తుతం ఆశాజనకంగా ఉంది. త్వరలోనే అడపాదడపాగా, మోస్తారు భారీ వర్షాలు కురిస్తేనే పత్తిపంటను కాపాడుకోవచ్చని రైతులు పేర్కొంటున్నారు.**

### ప్రస్తుతం ఆశాజనకంగా పలు పంటలు
### ఆశించిన మేర వర్షాలు లేక అయోమయంలో అన్నదాతలు

**న్యాల్ కల్, ఆగస్టు 17, (జనం సాక్షి) :** ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుండి నేటివరకు కురిసిన సాధారణ వర్షాలతో.. వర్షపాతం నెలకొంది. ఖరీఫ్ సీజన్ కు ముందు ఓ మోస్తారు భారీవర్షం కురవడంతో మండలంలోని రైతాంగం దాదాపు 70 / 75 శాతం మేరకు వేల ఎకరాల్లో వివిధ రకాల పంటలను సాగు చేశారు. అనంతరం దాదాపు పాతిక రోజులకు పైగా వర్షాలు కురవకపోవడంతో రైతులు తీవ్ర గందరగోళానికి, అయోమయానికి గురయ్యారు. వేల ఎకరాల్లో వేసిన పత్తిపంట మొలకెత్తుక పోవడంతో తిరిగి విత్తనాలు నాటారు. జూన్ ప్రారంభదశలో వేసిన పత్తిపంట ఆశాజనకంగా ఉండడం, తర్వాత వేసిన పత్తిపంట కాస్త ఎదుగుదల లేకపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. జూన్, జూలై మాసాల్లో సాధారణ వర్షాలు, ఆగస్టులో (ఈ నెల 17 వరకు) సాధారణ వర్షంకంటే అతితక్కువ వర్షాలు కురిశాయి. గత ఏడాది కురిసిన అతిభారీ వర్షాలతో ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన వివిధ రకాల పంటలు తీవ్రంగా నష్టపోయాయి.

**ప్రస్తుతం ఆశాజనకంగా పత్తిసాగు**

మండలంలో సాగుచేసిన పత్తిపంట సాగు ప్రస్తుతం ఆశాజనకంగా ఉన్నప్పటికీనీ "ఎల్ నీనో" ప్రభావంతో చిరుజల్లులు, మోస్తారు సాధారణ వర్షాలే తప్ప అతిభారీ వర్షాలు కురవకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అతి త్వరలోనే పెసర, మినుము, సోయా పంటలు కోతదశకు చేరుకున్నాయి. కురిసిన సాధారణ వర్షాలతో సాగుచేసిన పప్పుధాన్యాల సాగు ఆశాజనకంగా ఉన్నాయి. అతిభారీ వర్షాలు కురిస్తే చేతికివచ్చిన పప్పు ధాన్యాల పంటలకు తీవ్ర నష్టం వాటిల్లి ప్రమాదం పొంచి ఉందని రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

**ఈ ఏడాది ఖరీఫ్‌లో లోటు వర్షపాతమే**

ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుండి ఆగస్టు 17వరకు సాధారణ, అతి సాధారణ వర్షాలు కురవడంతో లోటు వర్షపాతం నమోదు అయ్యింది. జూన్ మాసంలో 119.5 మి.మీ గాను105 మి.మీ. జూలై మాసంలో 211.3 మి.మీ గాను178. ఆగస్టు మాసంలో 83.1 (ఆగస్టు 17వరకు) 32.8 మి.మీ వర్షం మాత్రమే కురిసింది. ఆగస్టు మాసంలో 61శాతం తక్కువ వర్షపాతం కురిసింది. ఖరీఫ్ సీజన్ లో లోటు వర్షపాతం కురిసింది.

**ఆశాజనకంగా పత్తిపంట : వీరన్న రైతు, న్యాల్ కల్**



ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుండి సాధారణ వర్షాలే కురిశాయి. జూన్ ప్రారంభం, జూలై చివరి, ఆగస్టు తొలి వారంలో కురిసిన సాధారణ, మోస్తారు వర్షాలతో ప్రస్తుతం పత్తిపంట సాగు ఆశాజనకంగా ఉంది. భారీ వర్షాలు కురిస్తేతప్ప పంటను సాగు చేయడం సాధ్యం కాదు. వర్షాలు విస్తారంగా కురిస్తేనే పంట దిగుబడి వచ్చే ఆస్కారం అధికంగా ఉండనుంది. గత ఏడాది కురిసిన భారీ వర్షాలతో తీవ్రంగా నష్టపోయాం. ఈఏడాది తీవ్ర వర్షాభావం తో సాగు చేసిన పంటకు నష్టం వాటిల్లే ప్రమాదం పొంచి ఉంది.

# రెండేళ్ల చిన్నారిపై లైంగిక దాడికి యత్నం

**అమీన్పూర్ ఆగస్టు 17 (జనం సాక్షి) :** రెండేళ్ల చిన్నారిపై ఓ వ్యక్తి లైంగిక దాడికి యత్నిస్తుండగా స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించిన సంఘటన అమీన్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గండిగూడలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. అమీన్పూర్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ రెడ్డి తెలిపిన వివరాలు ప్రకారం ఆదివారం రాత్రి సమయంలో, నిందితుడు ఉత్తరప్రదేశ్ కాన్పూర్ నగర్, ఘటంపూర్ కు చెందిన రఘునాథ్ 48 ప్రస్తుతం దీపక్ బ్రిక్స్ బ్లాక్ కంపెనీ ఉంటున్నాడు. గండిగూడెం చౌరస్తాకు చెందిన 2 ఏళ్ల చిన్నారిని, ఆమె ఇంటి ముందు ఆడుకుంటుండగా అక్కడి నుండి తీసుకువెళ్లాడు.
అతను ఆ చిన్నారిని ఇలాపూర్ తండా శివార్లలోని ఒక నిర్మానుష్య ప్రాంతానికి తీసుకువెళ్లి, ఆమెపై లైంగిక దాడికి యత్నించాడు. అదే సమయంలో, చిన్నారి ఏడుపు విని, బొల్లారం గ్రామంలో పని ముగించుకుని ఇంటికి వెళ్తున్న శశి కుమార్ సంఘటనా స్థలానికి వెళ్లాడు. అక్కడ నిందితుడు చిన్నారిపై లైంగిక దాడికి ప్రయత్నించడాన్ని అతను గమనించాడు.
శశి కుమార్ ఆ చిన్నారిని రక్షించి, నిందితుడిని అతని చర్య గురించి ప్రశ్నించాడు. అలాగే తన స్నేహితుడు నవీన్‌కు ఫోన్ చేసి, చిన్నారిని రక్షించాడు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడికి చేరుకొని అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు పోలీసులు నిదితుడు రఘునాథ్‌ను అదుపులోకి తీసుకుని పోక్సో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# తీజ్ వేడుకల్లో విషాదం.. తండ్రి చేతిలో కుమారుడు హతం

- రోకలిబండతో దాడి.. వెంకట్‌గాని తండాలో దారుణం
- ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు



**నల్గొండ, ఆగస్టు 17 (జనంసాక్షి):** చందంపేట మండలం వెంకట్‌గాని తండాలో తీజ్ పండుగ వేడుకల్లో విషాదం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల మధ్య ప్రారంభమైన వివాదం తీవ్ర ఘర్షణకు దారితీయడంతో ఓ యువకుడు మృతి చెందినట్లు సమాచారం. కన్న తండ్రే కుమారుడిపై రోకలిబండతో దాడి చేయడంతో ఈ ఘటన జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. స్థానికుల వివరాల ప్రకారం.. తండాకు చెందిన నేనావత్ లష్కర్, ఆయన కుమారుడు మాకట్లాల్ తీజ్ పండుగ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యుల మధ్య ఏర్పడిన వాగ్వాదం క్రమంగా తీవ్రరూపం దాల్చింది. ఈ క్రమంలో లష్కర్ తన కుమారుడు మాకట్లాల్‌పై రోకలిబండతో దాడి చేసినట్లు తెలుస్తోంది. తలపై తీవ్ర గాయాలు కావడంతో మాకట్లాల్ అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం. పండుగ వేడుకల్లో జరిగిన వివాదం చివరకు హత్యకు దారితీయడంతో తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి. సమాచారం అందుకున్న చందంపేట ఎస్ఐ లోకేష్ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పరిశీలించి ఘటనకు దారితీసిన పరిస్థితులపై కుటుంబ సభ్యులు, స్థానికులను విచారించారు. కుటుంబ సభ్యుల మధ్య అసలు వివాదం ఏమిటి, హత్యకు దారితీసిన కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పూర్తి వివరాలు దర్యాప్తులో వెల్లడికావాల్సి ఉంది.

# ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను స్కిల్ యూనివర్సిటీలో కలపొద్దు

## పాలిటెక్నిక్ ఉద్యోగులు భోజన విరామ నిరసన

**నంగునూరు, ఆగస్టు 17 (జనం సాక్షి) :** రాష్ట్ర స్థాయి పాలిటెక్నిక్ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి పిలుపు మేరకు శక్తి కి వ్యతిరేకంగా స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉద్యోగులు భోజన విరామ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఉద్యోగులు రాష్ట్ర ప్రభుత్వం పాలిటెక్నిక్ కళాశాలలను స్కిల్ యూనివర్సిటీలో కలపడాన్ని వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. పాలిటెక్నిక్ కళాశాలలను స్కిల్ యూనివర్సిటీలో కలపడం వలన నాణ్యమైన పాలిటెక్నిక్ ఇంజనీరింగ్ విద్యను కోల్పోయే ప్రమాదం ఉందని, దీని వలన పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య దొరకక పోగా ఆర్థిక భారంతో ఉన్నత విద్యా అవకాశాలు సన్నగిల్లె ప్రమాదం ఉందని తెలిపారు. ఈ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో కళాశాల సిబ్బంది సయ్యద్ షాహెబాజ్ గ, పాతూరి శ్రీనివాస రెడ్డి వై రాజు రామకృష్ణ సంతోష్, కిషోర్, నవీన్ , కవిత జ్యోతి కమల్ అహ్మద్ మంజుల వైదేహి ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యాన్ని సహించం

## అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి,(జనంసాక్షి) :** ప్రజావాణిలో సమర్పించిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖల అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, చట్టపరిధిలో త్వరితగతిన పరిష్కరించాలని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్ ఐఏఎస్ అధికారులను ఆదేశించారు. సోమవారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ (ఐడీఓసీ) సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్ఓ) మాలతి ప్రజల నుంచి నేరుగా వినతులు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుత.. ప్రజావాణిలో అందిన ఫిర్యాదుల పట్ల అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.
ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితులు, దరఖాస్తుదారులు మొత్తం 92 అర్జీలు సమర్పించారు. వీటిలో ప్రధానంగా రెవెన్యూ, భూసంబంధిత సమస్యలు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపు, ఆసరా పింఛన్లు, తాగునీటి సరఫరా, డ్రైనేజీ, రహదారులు తదితర పౌర సమస్యలకు సంబంధించిన వినతులు ఉన్నాయి. ప్రజావాణిలో అందిన ప్రతి అర్జీని సంబంధిత శాఖలకు పంపించి, నిర్ణీత గడువులోగా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిధిలోని వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

# వివాదాస్పద భూమిపై హక్కుల కోసం బాధితుల ఆందోళన

- ఆత్మహత్యాయత్నాన్ని అడ్డుకున్న పోలీసులు
- వెనుక ఫ్లాట్లకు త్రోవ కొనుగోలు చేసిన బాధితుల ఆవేదన



**బెజ్జంకి,ఆగస్టు 17,(జనం సాక్షి):** మండలంలో తండ్రి ఆస్తిలో వాటా కోసం కోర్టులో కేసు కొనసాగుతుండగా,వివాదంలో ఉన్న భూమిని ఇతరులకు పట్టా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపిస్తూ ఓ మహిళ సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేసింది.తన ఇద్దరు కుమార్తెలతో కలిసి పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించగా అప్రమత్తమైన పోలీసులు అడ్డుకుని,బాధితులకు నచ్చజెప్పి ఆందోళన విరమింపజేశారు. బాధితురాలు అందే మల్లిగారి రాజమల్లవ్వ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని సర్వే నంబర్ 565ఏ/డీ/ఏలో బోగనగిరి దుర్గయ్యకు 0.38 గుంటల భూమి ఉంది.ఆయనకు ఇద్దరు కుమార్తెలు లక్ష్మి,రాజమల్లవ్వ ఉన్నారు.తండ్రి మరణానంతరం భూమిలో ఇద్దరికీ సమాన వాటా రావాల్సి ఉందని తెలిపారు.తండ్రి ఆస్తి నుండి భూమి చిన్న కుమార్తెకు తన నుండి వారి కుమారుడికి మార్పిడి జరిగిందని తెలిపారు.అనంతరం 2022లో అందులో కొంత భూమిని ఇతరులకు విక్రయించారని,సర్వే నంబర్ 563కు వెళ్లేందుకు ఇదే భూమిలో నుంచి త్రోవను కూడా విక్రయించినట్లు పేర్కొన్నారు.ఈ విషయం తెలిసి తనకు రావాల్సిన వాటా కోసం లక్ష్మి కోర్టును ఆశ్రయించగా ప్రస్తుతం కేసు కొనసాగుతోందని తెలిపారు.అయినప్పటికీ భూమిని ఇతరులకు విక్రయించి పట్టా మార్పులు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపిస్తూ,కేసు తేలే వరకు ఎలాంటి పట్టా మార్పులు చేయకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

**ఫ్లాట్ల కొనుగోలుదారుల ఆవేదన:**

వివాదాస్పద భూమి వెనుక ఉన్న సర్వే నంబర్ 563లోని ఫ్లాట్లకు ఇదే భూమి నుంచి త్రోవను గతంలో కొనుగోలు చేసినట్లు లింగాల లచ్చయ్య తెలిపారు.తాము డబ్బులు చెల్లించి స్థలాలు కొనుగోలు చేశామని,ప్రస్తుతం భూమి వివాదంలో చిక్కుకోవడంతో తమ పరిస్థితి ఏమిటని ఆందోళన వ్యక్తం చేశారు.తమ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు ఫ్లాట్ల కొనుగోలుదారులు కూడా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని గోడు వినిపించారు.భూమి హక్కులు,పట్టాలు,విక్రయాలు,త్రోవకు సంబంధించిన అంశాలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు,తమకు నష్టం కలగకుండా న్యాయం చేయాలని బాధితులు అధికారులను కోరారు.





# సర్పంచ్ చొరవ.. విద్యార్థులకు రోజూ టిఫిన్

- రోజూ రూ.3,500తో పౌష్టికాహారం
- చౌదర్పల్లి సర్పంచ్ అనూష సతీష్‌రెడ్డి

**మహమ్మదాబాద్,ఆగస్టు 17(జనంసాక్షి):** పాఠశాల విద్యార్థులకు ఉదయాన్నే పౌష్టికాహారం అందిస్తూ చౌదర్పల్లి గ్రామ సర్పంచ్, సుక్కిరెడ్డి అనూష సతీష్‌రెడ్డి, మానవత్వాన్ని చాటుకున్నారు. మహమ్మదాబాద్ మండలంలోని చౌదర్పల్లి ప్రాథమిక పాఠశాలలో సోమవారం విద్యార్థులకు మార్నింగ్ టిఫిన్ కార్యక్రమాన్ని,సర్పంచ్,అనుష సతీష్ రెడ్డి,పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రారంభించారు.గ్రామంలోని పాఠశాల విద్యార్థులకు ప్రతిరోజూ ఉదయం సొంత ఖర్చుతో సుమారు రూ. 3,500 వ్యయంతో పౌష్టికాహారం అందించనున్నట్లు సర్పంచ్ తెలిపారు. ఈసందర్భంగా,అనూష సతీష్ రెడ్డి, మాట్లాడు తూ.. పేద విద్యార్థులకు విద్యతోపాటు మంచి పౌష్టికాహారం అందించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే చదువుపై శ్రద్ధ పెట్టగలరని పేర్కొన్నారు.ప్రతి విద్యార్థి కష్టపడి చదివి పాఠశాలకు, గ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. సర్పంచ్ చేపట్టిన ఈ కార్యక్రమంపై విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కే.ఎం, నారాయణ, మాజీ ఎంపీపీ శాంతిరంగ్య, మమత ప్రతిప్ రెడ్డి, వేణుగౌడ్, గ్రామస్తులు పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ, మెట్రో, ఆటో, క్యాబ్ సేవలు

# ఇకపై ఒకే యాప్‌లో...

- ఒకే డిజిటల్ వేదికపైకి ప్రజారవాణా సేవలు
- మీసేవ ఆధ్వర్యంలో 'మీటికెట్' యాప్ రూపకల్పన
- 'ఆర్టీసీ సొంతంగా ఆటోలు నడపడం లేదు..



**హైదరాబాద్, ఆగస్టు 17 (జనంసాక్షి):** ప్రజారవాణా సేవలను ఒకే డిజిటల్ వేదికపైకి తీసుకురావాలనే లక్ష్యంతో మీసేవ ఆధ్వర్యంలో 'మీటికెట్' యాప్‌ను అభివృద్ధి చేస్తున్నారు. ఆర్టీసీ, మెట్రో, ఆటోలు, క్యాబ్ సేవలను అనుసంధానించి ప్రయాణికులకు వేగవంతమైన, సులభమైన సేవలు అందించేందుకు ఈ యాప్‌ను రూపొందిస్తున్నారు. ఈ యాప్ ద్వారా ప్రయాణికులు ఆర్టీసీ లేదా మెట్రో టికెట్‌తో పాటు గమ్యస్థానానికి అనుగుణంగా ఆటో, క్యాబ్‌ను ముందస్తుగా బుక్ చేసుకోవచ్చు. చెల్లించిన రుసుము సంబంధిత రవాణా సంస్థలు, భాగస్వాములకు ఎప్పటికప్పుడు జమ అయ్యేలా చెల్లింపు వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారు. ఆటో, క్యాబ్ డ్రైవర్లు, ఇతర రవాణాదారులు భాగస్వాములుగా చేరి నేరుగా సేవలు అందించే అవకాశం ఉంటుంది. దీంతో ఒకే యాప్ ద్వారా ప్రయాణికులకు సమగ్ర ప్రయాణ సౌకర్యం లభించనుంది. ఇదిలా ఉండగా, ఆర్టీసీ సొంతంగా ఆటోలు కొనుగోలు చేసి నడుపుతుందన్న ప్రచారంలో వాస్తవం లేదని యాజమాన్యం స్పష్టం చేసింది. ఆర్టీసీ స్వయంగా ఆటోలను కొనుగోలు చేయడం, నిర్వహించడం చేయదని, భవిష్యత్తులోనూ అలాంటి ప్రతిపాదన లేదని తెలిపింది. ప్రయాణికులు, ఆటో డ్రైవర్లు అపోహలకు గురికావద్దని కోరింది.

# అంగన్‌వాడీ సిబ్బందికి పెరిగిన రిటైర్మెంట్ బెనిఫిట్స్

- 60 ఏళ్లు దాటిన వారు స్వచ్ఛందంగా వైదొలిగినా ప్రయోజనం
- ఇప్పటివరకు 2,572 మందికి రూ.15.61 కోట్ల చెల్లింపు
- మంత్రి సీతక్క చొరవతో ఆర్థిక భరోసా





హైదరాబాద్: అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు ప్రభుత్వం పెంచిన సర్వీస్ ఎండ్ బెనిఫిట్స్ అందిస్తోంది. 65 ఏళ్ల వయస్సులో రిటైర్ అయిన వారికి పెంచిన మొత్తంతో పాటు, 60 సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న వారు స్వచ్ఛందంగా విధుల నుంచి వైదొలిగినా ఈ ప్రయోజనాలు వర్తింపజేస్తూ రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందజేస్తోంది. 2023లో జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం అంగన్‌వాడీ టీచర్లకు రూ.1 లక్ష, అంగన్‌వాడీ హెల్పర్లు, మినీ అంగన్‌వాడీ వర్కర్లకు రూ.50 వేలుగా ఉన్న సర్వీస్ ఎండ్ బెనిఫిట్స్‌ను మంత్రి సీతక్క ప్రత్యేక చొరవతో 2025 మే 30న ప్రజా ప్రభుత్వం పెంచింది. కొత్త ఉత్తర్వుల ప్రకారం 65 ఏళ్ల వయస్సులో వైదొలిగే అంగన్‌వాడీ టీచర్లకు రూ.2 లక్షలు, అంగన్‌వాడీ హెల్పర్లకు రూ.1 లక్ష చొప్పున అందిస్తున్నారు. అదే విధంగా 60 సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు స్వచ్ఛందంగా విధుల నుంచి వైదొలిగిన సందర్భంలో కూడా అంగన్‌వాడీ టీచర్లకు రూ.2 లక్షలు, హెల్పర్లకు రూ.1 లక్ష చొప్పున వాలంటరీ డిస్‌ఎంగేజ్ మెంట్ బెనిఫిట్ అందించే అవకాశం కల్పించారు.

### రూ.15.61 కోట్లు చెల్లింపు

2026-27 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు మొత్తం 2,572 మంది అంగన్‌వాడీ సిబ్బంది ఖాతాలకు రూ.15,61,10,000 సర్వీస్ ఎండ్ బెనిఫిట్స్‌గా చెల్లించారు. ఇందులో 473 మంది అంగన్‌వాడీ టీచర్లకు రూ.4.73 కోట్లు, 1,930 మంది అంగన్‌వాడీ హెల్పర్లకు రూ.9.65 కోట్లు చెల్లించారు. పెంచిన బెనిఫిట్స్ ప్రకారం మరో 14 మంది అంగన్‌వాడీ టీచర్లకు రూ.28 లక్షలు, 59 మంది అంగన్‌వాడీ హెల్పర్లకు రూ.59 లక్షలు అందించారు. గతంలో అమల్లో ఉన్న ఉత్తర్వుల ప్రకారం మరో 96 మంది అంగన్‌వాడీ సిబ్బందికి రూ.36.10 లక్షలు చెల్లించారు. గత ప్రభుత్వంలో రిటైర్ అయిన అంగన్వాడీ సిబ్బందికి సైతం ఈ ప్రభుత్వం రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించింది. అంగన్‌వాడీ సిబ్బందికి పదవీ విరమణ అనంతరం ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు, దీర్ఘకాలంగా సేవలందించిన వారికి గౌరవప్రదమైన ప్రయోజనాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ నిర్ణయాలు తీసుకుంది.



## టీజీ సేఫ్ కమిషనర్‌గా అవినాశ్ మహంతి పదవీ బాధ్యతలు

**హైదరాబాద్ (జనంసాక్షి) :** టీజీ సేఫ్ కమిషనర్‌గా అవినాశ్ మహంతి డ్రగ్ కంట్రోల్ అడ్మీటేషన్ కార్యాలయంలో సోమ వారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఆహార, ఔషదాల నాణ్యత ప్రమాణాలను మరింతగా మెరుగు పరచడానికి ప్రభుత్వం ఆహార భద్రత, ఔషద నియంత్రణ భాగాలను వీలీనం చేసి టీజీ సేఫ్‌గా ఏర్పాటు చేసింది. ఈ మేరకు ఈ శాఖకు డైరెక్టర్‌గా అవినాశ్ మహంతి డైరెక్టర్ గా కొనసాగనున్నారు. టీజీ సేఫ్ (తెలంగాణ స్టాండర్స్ అథారిటీ ఫర్ ఫుడ్ అండ్ ఎసెన్షియల్ డ్రగ్స్) గా ఏర్పాటు చేశారు.






# మావోయిస్టు లేఖల కలకలం!

- డీజీపీ ప్రకటన తర్వాత మేడారంలో కలకలం
- ఏటీపీహెచ్ పేరిట వెలసిన హెచ్చరిక లేఖలు
- ఆరా తీస్తున్న జిల్లా పోలీస్ యంత్రాంగం



**వెంకటాపూర్(రామప్ప ),ఆగస్టు17(జనం సాక్షి):** రాష్ట్ర డీజీపీ తెలంగాణలో మావోయిస్టుల ఉనికే లేదని చెప్పి వారం రోజులు కూడా గడవకముందే ములుగు జిల్లాలోని మేడారంలో ఏటీపీహెచ్ పేరిట ఆదివారం వెలిసిన హెచ్చరిక లేఖలు కలకలం సృష్టించాయి.సీఎం రేవంత్ రెడ్డి మేడారం పర్యటన నేపథ్యంలో పోలీసులు భారీ బందోబస్తు చర్యలు చేపట్టినప్పటికీ సమ్మక్క సారక్క గద్దెల సమీపంలోని ఐటిడిఏ క్యాంపు కార్యాలయం గేటుకు లేఖలు అంటించడం చర్చనీయంగా మారింది. మేము ఇంకా ఉన్నాం...మా హక్కుల కోసం ఎప్పుడూ ఉంటాం... శాంతించామని అనుకోకండి.. మా హక్కుల కోసం ఎప్పుడూ ఉంటాం..తగ్గి ఉన్నంత మాత్రాన.. ఓడిపోయామని భావించకండి.మునుపటి కంటే మరింత బలంగా నిలబడతాం అంటూ మరికొన్ని పదాలను రెడ్ పెన్‌తో రాసిన సదురు లేఖలపై సుత్తెకొడవలి గుర్తులు ఉన్నాయి.ఏటీపీహెచ్ పేరిట వెలిసిన లేఖలు ప్రస్తుతం ములుగు జిల్లాలో చర్చనీయాంశంగా మారాయి. లేఖలు వెలిసిన కొద్దిసేపట్లోనే స్థానిక పోలీసులు తొలగించినప్పటికీ జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తమయింది. వాటిని ఎవరు అంటించారనే కోణంలో విచారణ ప్రారంభించి దర్యాప్తును ముమ్మరం చేశారు. మేడారంలో వేల సంఖ్యలో పోలీసులు ఉన్నప్పటికీ ఐటీడీఏ క్యాంపు కార్యాలయం గేటుకు సదరు లేఖలు ఎలా అంటించారు... ఎవరైనా కావాలని చేశారా లేదా ఆకతాయిల పనినా అనే కోణంలో పోలీసులు ముందుకు సాగుతున్నారు. ఈ అంశాన్ని ములుగు జిల్లా ఎస్పీ సీరియస్ గా తీసుకున్నట్లు తెలిసింది. ఏదేమైనప్పటికీ గత కొంతకాలంగా ప్రశాంతంగా ఉన్న ములుగు ఏజెన్సీలో లేఖలు వెలువవడం తీవ్ర చర్చనీయాంశమైంది. సీఎం పర్యటన నేపథ్యంలోనే ఆ లేఖలు విడుదల కావడం వెనుక అంతర్యం ఏమిటని పోలీస్ వర్గాల తో పాటు జిల్లా ప్రజల్లో తీవ్ర చర్చ జరుగుతుంది.

## దిగువ కొండగట్టులో ఆర్టీసీ బస్సు లారీ ఢీ

- పలువురికి గాయాలు
- తప్పిన భారీ ప్రమాదం





**మల్యాల ఆగస్టు 17 (జనం సాక్షి) :** జగిత్యాల్ కరీంనగర్ ప్రధాన రహదారి ప్రముఖ పుణ్యక్షేత్రం దిగువ కొండగట్టు పెట్రోల్ బంకు సమీపంలో సోమవారం సాయంత్రం ఆర్టీసీ బస్సు లారీ ఢీకొన్న ఘటనలో సుమారు 24 మందికి గాయాలయ్యాయి అందులో 20 మందికి సాధారణ గాయాలు 4 తీవ్ర గాయాలయ్యాయి అయ్యాయని అందరికీ పూర్తిస్థాయి వైద్యం అందిస్తున్నామని అధికారులు తెలిపారు. కరీంనగర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు నిజామాబాద్ వైపు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న లారీ ఢీకొన్నాయి ప్రమాదంలో ఆర్టీసీ బస్సు,లారీ ముందు భాగాలు పూర్తిగా నుజ్జునుజ్జయ్యాయి, స్థానికులు సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను 108 అంబులెన్స్ లో జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనతో ప్రధాన దరహాదారిపై ఇరువైపులా భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తున్నారు.






# మద్దూరు కస్తూర్బాగాంధీ విద్యార్థులకు అస్వస్థత

- విద్యార్థులను చేర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలింపు
- నాణ్యతలేని ఆహారం.. అపరిశుభ్రత
- కేజీబీవీలో విద్యార్థినుల ఆరోగ్యంపై నిర్లక్ష్యం



**చేర్యాల/మద్దూరు ఆగస్టు 17 (జనంసాక్షి) :** సిద్దిపేట జిల్లా మద్దూరు మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో విద్యార్థినులు అస్వస్థతకు గురైన ఘటనతో విద్యాలయంలో నాణ్యతలేని ఆహారం, పారిశుధ్య లోపాలు, పరిసరాల అపరిశుభ్రత మరోసారి చర్చనీయాంశంగా మారాయి. నాణ్యత లోపించిన బియ్యం, ఉప్మా రవ్వ, పల్లీలు, ఇతర పప్పు దినుసులు చీడపట్టి ఉండటం, విద్యార్థినులకు అందించే అరటిపండ్లు కుళ్లిపోయి ఉండటం, అదే సమయంలో శానిటేషన్ పరిస్థితులు సరిగా లేకపోవడం విద్యార్థినుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థినులకు అందించే ఆహార పదార్థాల నాణ్యతను ఎప్పటికప్పుడు పరిశీలించాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహించడంతోనే ఇటువంటి పరిస్థితి ఏర్పడిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆహార నాణ్యతతో పాటు తాగునీరు, వంటగది పరిశుభ్రత, మరుగుదొడ్లు, డ్రైనేజీ, పరిసరాల శానిటేషన్‌పైనా నిరంతర పర్యవేక్షణ అవసరమని తల్లిదండ్రులు కోరుతున్నారు. మద్దూరు తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయం, పోలీస్ స్టేషన్‌కు సమీపంలోనే కేజీబీవీ ఉన్నప్పటికీ విద్యాలయంపై పర్యవేక్షణ కంటితుడుపుగా మారిందని ప్రజాసంఘాలు, విద్యార్థి సంఘాలు, అఖిలపక్ష నాయకులు విమర్శిస్తున్నారు.

### సిద్దిపేట కలెక్టర్ పరిశీలన

విద్యార్థినులు అస్వస్థతకు గురైన విషయం తెలుసుకున్న సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె. హైమావతి, ఐఏఎస్, సంబంధిత అధికారులతో కలిసి కేజీబీవీ పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా శానిటేషన్ సమస్యలతో పాటు పరిసరాల అపరిశుభ్రత కూడా విద్యార్థినులు అనారోగ్యానికి గురికావడానికి కారణంగా గుర్తించినట్లు కలెక్టర్ తెలిపారు. సమస్యలపై వెంటనే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. తాత్కాలిక పరిష్కారానికి యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని, శానిటేషన్, మౌలిక సదుపాయాల సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించేందుకు అవసరమైన ఎస్టిమేషన్‌ను సిద్ధం చేసి అందించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థినుల ఆరోగ్య భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని స్పష్టం చేశారు.

### ఆహార నాణ్యతపై కఠిన హెచ్చరిక

విద్యార్థినులకు అందించే భోజన పదార్థాల నాణ్యత విషయంలో కూడా నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ నిర్వాహకులను హెచ్చరించారు. నాణ్యతలేని లేదా పాడైన ఆహార పదార్థాలు విద్యార్థినులకు అందకుండా పకడ్బందీగా తనిఖీలు నిర్వహించాలని సూచించారు. ఈ ఘటన మరోసారి పునరావృతం కాకుండా చూడాలని నిర్వాహకులకు స్పష్టం చేశారు. సిద్దిపేట జిల్లా డీఎంహెచ్‌ఓ ధన్‌రాజ్ ఆధ్వర్యంలో వైద్యపరమైన అంశాలను కూడా పరిశీలించాల్సిన అవసరం ఉందని అధికారులు పేర్కొన్నారు. విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ, అస్వస్థతకు ఖచ్చితమైన కారణాలను గుర్తించి తగిన వైద్య చర్యలు చేపట్టాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. ఇకనైనా అధికారులు సమగ్రంగా స్పందించి నాణ్యమైన ఆహారం, సురక్షితమైన తాగునీరు, పరిశుభ్రమైన వంటగది, మెరుగైన మరుగుదొడ్లు, పరిసరాల పరిశుభ్రత, నిరంతర వైద్య పర్యవేక్షణ కల్పించాలని ప్రజాసంఘాలు, విద్యార్థి సంఘాలు, అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేస్తున్నారు.









Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370